
సచిత్ర వారపత్రిక
-4-'56
ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY



ధ్రువునకు వరము

చిత్రకారుడు: గోలి శేషయ్య, తెనాలి.



విశ్వదాత, దానప్రపూర్ణ, దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు.

వర్ధంతి : చైత్ర శుద్ధ ద్వాదశి (27-4-1956)

విషయానుక్రమణిక

ముఖచిత్రం:
హిందీతార మీనాకుమారి

న్యూఢిల్లీ లేఖ—	3
అరుణవలయం—ఎడ్గార్ వాలెస్	6
సమస్యాపూరణం—పి. గణపతిశాస్త్రి	9
పథేర్ పాంచాలి (సీరియల్)— విభూతిభూషణ్ బెనర్జీ	13
సంసారులకు మాత్రమే—వంతుల శ్రీరామశాస్త్రి	19
వెధవ గొడవ—నిట్టల శ్రీరామమూర్తి	25
హక్కులకోసం పత్రికల పోరాటం—	26
సినిమా—	28
తప్పిన అశుభం—పోతుకూచి సాంబశివరావు	37
వనితాలోకం—ఇల్లిందల సరస్వతీదేవి	42
అగ్గిపుల్లల అమ్మాయి—హెచ్. సి. ఆండర్సన్	44
సాగరగర్భంలో సాహసయాత్ర— (సీరియల్) జూల్స్ వెర్న్	46
కుర్చీ ఆత్మకథ—ఎ. సీతారామం	51
యుక్తిశాలి—ఆర్. దొరసామి	52
అత్తగారు—[illegible]	54

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 49
సంచిక 34
25.4-56

దుర్ముఖ చైత్ర శుద్ధ పూర్ణిమ బుధవారం

న్యూఢిల్లీ లేఖ

భారతప్రధాని ఈమధ్య మరొక విషయములో తమ నాయకత్వ సమర్థత బుజువు చేసుకున్నారు. 'వ్యక్తి ఆరాధన' ఆచారాన్ని మొట్టమొదటిసారిగా ఆయన నొకతాపు తన్నారు. ఈ ఆచారాన్ని ఆయన చచ్చు లేకుండా, కుండ బద్దలు కొట్టినట్టు ఖండించారు.

భారత రాజధానిలో వ్యక్తి ఆరాధన చాలా 'సైంటిఫిక్' పద్ధతులలో వర్ధిల్లుతోంది. రష్యన్‌పద్ధతికీ, దీనికీ తేడా వుంది. రష్యాలో అగ్రనాయకుడైన స్టాలిన్ ఆరాధనగా పరిణమించింది. భారతదేశంలో అది సింహాసనంలో కూర్చున్న వ్యక్తినిగాక, సింహాసనాన్నే ఆరాధించే పద్ధతిగా పరిణమించింది. జన్మదినోత్సవాలు ఇందుకొక ఉదాహరణ. భారత రాష్ట్రపతిదో, ప్రధానిదో అయితే జన్మదినోత్సవం జరపడంలో అర్థముంది గాని, మంత్రులందరి జన్మదినాలూ ఉత్సవపూర్వకంగా జరపడం అర్థంలేనిపని. వార్తాసౌకర్యాలశాఖ మంత్రి శ్రీ జగ్‌జీవనరాం 48-వ జన్మదినం ఈ నెల 5వ తేదీన పడింది. ఆ సందర్భంలో ఆయన్ని సన్మానించే ఉద్దేశ్యంతో ఈ క్రింది లేఖ కొందరికి పంపించబడింది:

"ప్రియమిత్రులకు,

శ్రీ జగ్‌జీవన్‌రాం జన్మదినోత్సవం చాలా సంవత్సరాలుగా మనం చేస్తున్నామని మీకు తెలిసే వుంటుంది. ఇదివరకు ఆయనపై మన గౌరవ మర్యాదలకు సూచనగా గ్రంథాలను బహూకరించేవాళ్ళం. ఈఏడు ఆయన 48-వ జన్మదినోత్సవం 1956 ఏప్రిల్ 5-న పడింది. ఈ శుభసమయంలో ఆయనకు 48,000 రూపాయలు బహూకరించడం బాగుంటుందని కొందరు మిత్రులు, అభిమానులు అభిప్రాయపడ్డారు. మన ప్రజలకు ఆయనచేసిన అద్వితీయసేవకు మన కృతజ్ఞతాభిమానాల సూచనగా ఈ ధనం ఇవ్వాలని వారి ఆలోచన.

మీరు ఆయన మిత్రుల, అభిమానుల బృందంలో ఒకరు. ఆయనకు సన్మానం జరపడం శ్రీజగ్జీవన్ రామ్ 48 వ జన్మదినోత్సవసంఘం వారమైన మాకెంత సంతోషకారణమో మీకూ అంతే. అందుచేత మీరు మేము సేకరించే నిధికి ఉదారంగా విరాళం ఇవ్వాలని మా సంఘం కోరుతున్నది. కానింగ్‌లేన్, 7 వ నెంబరు గల మా గృహంలో పార్లమెంటు సభ్యులు, ఇతర ప్రముఖులు సమావేశమై ఈ సంఘం ఏర్పరచారు. వ్యవధి తక్కువ గనుక కొందరు ముఖ్య మిత్రులను మాత్రమే విరాళం అడిగి నిధి భర్తీ చేయాలని మేము నిశ్చయించాము.

వీలైనంత త్వరగా, మా సంఘ కోశాధికారి శ్రీ ఆర్. ఆర్. మొరార్కా పేరిట 'క్రాసడ్ చెక్'ద్వారా మీ చందా పంపించవలసిందిగా అభ్యర్థిస్తున్నాను. బొంబాయి, మద్రాసు, పాతఢిల్లీ మొదలైనచోట్ల నిధి సేకరణకోసం స్థానిక సంఘాలు ఏర్పాటయ్యాయి. వాటికికూడా ధనం అందజెయ్యవచ్చు. అటువంటి సంఘాలు లేనిచోట్లనుండి పంపదలిస్తే సరాసరి శ్రీ మొరార్కాకే పంపండి. ఇది అందరికీ కావలసిన విషయమే గనకా, సేకరించవలసిననిధి ఎక్కువ, వ్యవధి తక్కువ గనకా, మిమ్మల్ని స్వయంగా కలుసుకోవడం సాధ్యంకాకపోవచ్చు. మీ సహకారం లభిస్తుందని నా నమ్మిక.

1956 ఏప్రిల్ 5 న న్యూఢిల్లీలో జరగబోయే జన్మదినోత్సవ సభకు మీరు వీలుచేసుకొనివస్తే మాకు చాలా సంతోషం. ఆసభలో నిధి సమర్పించబడుతుంది. ఇట్లు, బిపిన్‌బిహారీ వర్మ, అధ్యక్షుడు."

మాజీ కార్మిక శాఖామంత్రి శ్రీ వి. వి. గిరి, మాజీ వర్క్సు శాఖామంత్రి శ్రీ ఎన్. వి. గాడ్గిల్, మాజీ పునరావాస శాఖామంత్రి బాబూ మోహన్‌లాల్ శాక్సేనాలకు ఇటువంటి జన్మదినోత్సవ సంఘాలేమీ లేవు. ఒక మాజీ మంత్రి తన పుట్టినరోజున, మిత్రులు, అభిమానులు వచ్చి అభినందనలు అందజేస్తారని ఆశపడి వాకిట్లో పచార్లు చేస్తూ ఎదురుచూడడం నే నెరుగుదును.

"మినిస్టర్ - నవాజీ" అనబడే ఈ వ్యక్తి ఆరాధనలో ముఖ్యమైన అంశం మంత్రిగారితో కలిసి తరుచు కనిపించడం. మంత్రిగారితో కలిసి తీయించుకున్న ఫోటోలను అమ్మే వ్యక్తులుకూడా ఢిల్లీలో కొందరున్నారు. మరికొందరికి కొండలమీద మంచి మంచి భవనాలుంటాయి; అక్కడికి మంత్రులను విశ్రాంతి తీసుకోవలసిందని ఆహ్వానిస్తూ ఉంటారు. విగ్రహారాధన ప్రబలంగా ఉన్న ఈ దేశంలో మంత్రులు పెద్ద విగ్రహాలుగా మారిపోయారు.

ఇక వార్తాపత్రికలు చూస్తే, మంత్రులకు ఇంత పెద్ద పబ్లిసిటీ ఇస్తున్న దేశం మరొకటి కనిపించదు. మంత్రులు ఏదిచెప్పినా వేదవాక్కులుగా స్వీకరించి 'కాలాల' వారీగా ముద్రించే వార్తాపత్రికలు జాస్తి అయ్యాయి. అధికార రీత్యా వెలువడిన ఒక ప్రకటన ఉదాహరణగా ఇస్తున్నాను:—

"రక్షణ మంత్రి డా॥ కె. ఎన్. కట్జూ మేజర్ జనరల్ తారాసింగ్ బాల్, బ్రిగేడీర్ హెచ్. ఎల్. భండారీలతో కలిసి ఏప్రిల్ 8 వ మీరట్‌లో మిలిటరీ పాడి కేంద్రం సందర్శించారు. అక్కడ వారిని లెఫ్టినెంట్ జనరల్ కాంతసింగ్ కలుసుకున్నారు.

మిలిటరీపాడి కేంద్రాన్ని కిందటిసారి దర్శించినప్పుడు డా॥ కట్జూ, చుట్టుపక్కల గ్రామాలవారికి పాడి, వ్యవసాయాలలో నవీన పద్ధతులను బోధించాలని పాడికేంద్రం అధికార్లకు సూచించారు. ఇప్పుడు ఆయన

శ్రీ కృష్ణ
(ఆంధ్రపత్రిక ప్రతినిధి)

★ న్యూఢిల్లీ లేఖ ★

విశాలమైన పశుశాలలను, పాడిక్షేత్రాలను దర్శించగా కొందరు గ్రామస్థులు ఆయనను కలుసుకున్నారు. కొత్తగా చేసిన ఏర్పాట్లు చాలా బాగున్నాయని వారు మంత్రిగారికి చెప్పారు. తమకు బోధించినవాటిని ఆచరణలో పెడుతున్నామనికూడా చెప్పారు.

వారాని కొకసారి గ్రామస్థులను పాడి కేంద్రానికి పిలిపించి పశు ఆరోగ్యం, పాలు తీసే పద్ధతి, ఎరువుల వాడకం శాస్త్రీయ వ్యవసాయపద్ధతులు బోధిస్తున్నారు.

పాడికేంద్రంలోని పశువులపై డా॥ కట్జూ చాలా శ్రద్ధ కనబరిచారు. క్రిందటేడు అఖిలభారత బహుమతిపొందిన సాహీవాల్ ఆంబోతును చూపించగా, కేంద్రంలోని పశువులన్నీ ఈ స్థాయికి వస్తే బాగుండునని డా॥ కట్జూ అన్నారు.

తరవాత డా॥ కట్జూ పాడి కేంద్రం తాలూకు వ్యవసాయ పరిశోధనశాలను, సూక్ష్మజీవుల పరిశోధనశాల, టెక్నికల్ గ్రంథాలయం దర్శించి, ప్రయోగ, ప్రదర్శన క్షేత్రాలలో కొత్తరకం పశుగ్రాసం పెంచే విధానాన్ని తిలకించారు."

ఈ ధోరణిలో మనదేశపు రక్షణబలం నిర్మించబడుతోంది. ఈ మాదిరి ప్రకటనలు శరవేగంతో వెలువడుతున్నాయి. ఎందుకంటే నెలకు ఇరవైరోజుల చొప్పున రక్షణ మంత్రి పైటూళ్ళు తిరుగుతూ ఉంటారు. ఆయన అధ్వర్యంలోనే సంస్థానాలశాఖ రద్దయింది. ఇప్పుడు ఆయన రక్షణశాఖ అధినేతగా ఉన్నారు గనుక ఆ శాఖ భవిష్యత్తు కొంచెం ఆదుర్దా కలిగిస్తోంది.

* * *

"సహనం అనేది ఒక మితి దాటితే సుగుణం కావడం మానేస్తుంది" అని బర్క్ అన్నాడు. కాంగ్రెసుపార్టీలో క్రమశిక్షణోల్లంఘనం ఈ మితి దాటిందా అని అనుమానంగా ఉంది. హిమాచల్ ప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానవర్గాన్ని బహిరంగంగా ఎదిరించ నారంభించింది. ఢిల్లీ కాంగ్రెస్ లో ఒక వర్గం తమ అధ్యక్షునిపై ఎదురు తిరిగింది. ఈ తిరుగుబాట్లన్నీ ప్రజాస్వామ్యం పేరుతోనే జరుగుతున్నాయి.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో రెండు రాజకీయ పక్షాలు ఉండడం ఎంత అగత్యమో, ఏ పార్టీలోనయినాసరే క్రమశిక్షణ ఉండడం అంత అవసరం. దేశీయ వైద్య విధానంపట్ల అవలంబించిన వైఖరి మార్చుకోనిపక్షంలో పదవికి రాజీనామా ఇచ్చి తప్పుకోవాలని కేంద్ర పునరావాస శాఖ మాజీ మంత్రి శ్రీ మోహన్ లాల్ శాక్సేనా, ఆరోగ్యమంత్రిణి శ్రీమతి అమృతకౌర్ ను కోరారు. ఈ వ్యవహారంలో క్రమశిక్షణ అనే అంశానికి స్థానం ఏమిటి? అసలు, రాజకీయపక్షంలో క్రమశిక్షణ ఆవశ్యకతను ఐవర్ బుల్ తామస్ అనే బ్రిటిష్ రచయిత వివరించారు. "బ్రిటన్ లో రాజకీయపక్షాలు" అనే పుస్తకంలో ఆయన ఇలా వ్రాశారు:

"నేటి పార్లమెంటరీ పక్షంలో సభ్యుల స్థానం ఎటువంటిది? ఉదాహరణకు 'లిబరల్ పక్షం' తీసుకొంటే, అందులో చిరకాలంగా భావ ప్రకటనా స్వాతంత్ర్యం విపరీతంగా ఉంటూ ఉంది. ఈ తరహా పరిశీలిస్తే, అసలు దీన్ని పార్టీ అనడంకన్న కొందరు 'వ్యక్తుల' సమ్మేళనం అనడం సబబు. అనిపిస్తుంది ఈ పరిస్థితి అవాంఛనీయమని 17 మంది లిబరల్ పక్ష సభ్యులే అంగీకరించారు. 1951 నవంబరు 27న వీరంతా కలసి పార్టీ పత్రిక 'లిబరల్ న్యూస్' లో ఒక లేఖ వ్రాస్తూ, పార్టీసభ్యులంతా మొట్టమొదట చేయవలసినపని, క్రమశిక్షణ విషయం ఆలోచించుకుని, ఒక సమాధానం కుదుర్చుకోవాలని వాదించారు.

"ఇది అగత్యం. మనం అందరం కలసి కట్టుగా పనిచేసి, అందరం కావాలనుకున్న లక్ష్యాలను సాధించడానికే ఒకపార్టీ అంటూ ఏర్పాటు చేసుకున్నాం. ఇపుడు స్వేచ్ఛ పేరిట, ఎవరికివారు యిష్టం వచ్చినట్లు మాట్లాడుతూ ఒకరి నొకరు బహిరంగంగా విమర్శించుకుంటూ పరస్పర ప్రతికూల భావాలు వెదజల్లుకుంటూ వుంటే, ఇది పార్టీ అనిపించుకోదు; మనం లక్ష్యాలు సాధించుకోనూ లేము" అని వారానాడు అందులో వ్రాశారు. ఇక బ్రిటిష్ కార్మికపక్షంలో, నియమావళి దృష్ట్యా చెప్పాలంటే, కఠిన నిబంధనలు చాలా ఉన్నాయి. ఆ పార్టీ సభ్యుడు అయినవాడు ఏ పరిస్థితులలోనూ, పార్టీ విధానాలకు ప్రతికూలంగా ప్రసంగించరాదు. ప్రతికూలంగా ఓటుచేయరాదు. మహాఅయితే, తనకి సుతరామూ నచ్చని విషయం వచ్చినపుడు ఓటు ఎటూ వెయ్యకుండా తటస్థంగా ఊరుకోవచ్చు. కాతే, ఏవైనా తీర్మానాలు సవరణల్గా సభలో ప్రతిపాదించదలచినపుడు ముందుగా పార్టీ అనుమతి తీసుకోవాలి. అనుమతి ప్రసక్తి లేకుండా, స్వేచ్ఛగా చెయ్యగల పని, తనకితోచిన విషయం మీద ప్రశ్నలు అడగడం, ఏదేనా ఒక కొత్తవిషయం ప్రస్తావనకు తేవడం మాత్రమే. నిజానికి ఇవన్నీ పుస్తకంలో వ్రాసిపెట్టుకున్న నిబంధనలు మాత్రమే. ఇవి కనక కఠినంగా అమలు జరిపితే, పార్లమెంటులో ఆ పార్టీ సభ్యుడు ఎందుకూ కొరగాని వాడుగా ఉంటాడు. అంచువల్ల, కొంత స్వతంత్రంగా వ్యవహరించడానికి అలవాటు పడ్డ సభ్యులంతా ఆచరణలో ఈఅవధులను అతిక్రమిస్తునేఉంటారు. అందువల్ల, అడపా తడపా కొందరిని పార్టీ బహిష్కరిస్తూ ఉంటుంది. కొందరు కొద్దిలో తప్పించుకుంటూ ఉంటారు. ఒకసారి ఇద్దరు సభ్యులు, స్వచ్ఛందంగా రాజీనామాలే ఇచ్చారు. మొత్తానికి, పరిస్థితులు మరీ ముదిరి, ఇంత దాకా రాకుండా, పార్టీ కొంత సహనం చూపుతునే ఉంటుంది. కొందరు సభ్యులు పార్టీ నిర్ణయాలను ప్రతి

'నివేదిక అనగా నేమి?'

మంచికాగితాలపై ముచ్చటగా అచ్చువేసి చక్కగా 'బైండు' చేసిన పుస్తకాన్ని నివేదిక అంటారు. అలా కాకుండా మామూలు కాగితాలమీద టైపుచేసి మడత పెట్టి ఇస్తే అది 'విషయ సంగ్రహం' అనిపించుకుంటుంది. కేంద్రప్రభుత్వన్యాయశాఖమంత్రి శ్రీ సి.సి. బిశ్వాస్ ఈ మధ్య లోక్ సభలో పై నిర్వచనాలు వెల్లడిచేశారు.

సభాపతి శ్రీ అనంతశయనం అయ్యంగారుమాత్రం, 'అట్ట ఉన్నా మానినా వివిధ విషయాలను సభకు తెలియచేసే ప్రచురణలను 'నివేదిక' అనే పిలవాలని సలహా ఇచ్చారు.

★

కూలిస్తూ అడపా తడపా ప్రసంగిస్తూ వచ్చినా ఓటింగు దగ్గరకు వచ్చేసరికి తమాయించుకుని తగ్గిపోతారు. ఎందుకంటే తమ పార్టీకి ప్రతికూలంగా ఓటు చెయ్యడం అంటే, టోరీలకు అనుకూలంగా ఓటువెయ్యడమే అవుతుంది. మొత్తం మీద ఈనాడు రాజకీయ పక్షాల దృష్టిలో సభ్యుల మాటలు ఏమంత ముఖ్యం కాదు. చేతలే ప్రధానం. ప్రతికూల ప్రసంగాలకు ఏదో సంజాయిషీ ఇవ్వవచ్చు చెరిపెయ్యవచ్చు. ఓటుమాత్రం అలా కాదు.

* * *

కరాచీ రేడియోవల్ల ఈ మధ్య విచిత్రమైన భోగట్టా ఒకటి తెలియవచ్చింది. ఆగ్రా సమీపాన ఉన్న భారత్ పూర్ లోని ముస్లిములు పెద్దసభ చేశారనీ, తమని బలవంతాన హిందూమతంలో మార్చడానికి ప్రయత్నం జరుగుతున్నందువల్ల, వచ్చింది ఆ బెడద నివారించవలసిందిగా ప్రధాని నెహ్రూను కోరుతూ తీర్మానం చేశారనీ కొద్దిరోజుల క్రితం పాకిస్తాన్ రేడియో ప్రకటించింది. ఈ భోగట్టా ఫలితంగా ఈ విషయమై దర్యాప్తు జరిగింది. భరత్ పూర్ సభ గురించి ఏ పత్రికలకూ వార్త రాలేదు. వార్తాసంస్థలకు కూడా ఈ వైనం తెలియలేదని తేలింది. అయితే, ఇది కరాచీ రేడియో కట్టుకథగా కొట్టిపారెయ్యవచ్చునా? ఏం చెయ్యాలో తేల్చే లోగానే, దీని ఆచూకీ తెలిసింది. ఢిల్లీనుండి ప్రచురితం అయే ఒక "జాతీయ" వార్తాపత్రికలో ఈ వార్త అచ్చుపడిందని తెలియవచ్చింది. మన పార్లమెంటులో ఒకాయన ఆ సభకు అధ్యక్షత వహించారని కూడా ఆ వార్తలో వ్రాశారు.

కొన్నాళ్ళక్రితం ఇటువంటి వార్తే మరొకటి ఒక ఢిల్లీపత్రికలోనే వెలువడింది. ఉత్తర్ ప్రదేశ్ లో ముస్లింలను భారీఎత్తున, బలవంతంగా హిందూమతంలో చేర్చివేస్తున్నారని ఆ వార్త సారాంశం. అప్పట్లో పాకిస్తాన్ పత్రికలు దాన్ని పెద్ద శీర్షికలతో అచ్చువేసి ప్రచారం చేశాయి. దరిమిలా ఆ విషయం ప్రస్తావనకు వచ్చింది. ఆ వార్త ప్రచురించిన పత్రికే, అది అబద్ధమని అంగీకరించినట్లు భారత ప్రభుత్వం వెల్లడించింది.

ఇప్పుడు ఈసారి వచ్చిన వార్త తరహా వేరు. ఈసారి కథనం ప్రకారం భరత్ పూర్ సభకు మన పార్లమెంటు సభ్యులే ఒకరు అధ్యక్షత వహించినట్లు ప్రచారం అవుతోంది. అందువల్ల ఇది తేలికగా కొట్టిపారవేసే విషయం కాదు. అదే నిజమైతే, అధ్యక్షత వహించిన ఆ సభ్యుడు, ఆ సభకు సంబంధించిన విషయాలు వివరించడం అవసరం. ★

డిటెక్టివ్ సీరియల్

మూలం: ఎడ్గార్ వాలెస్

అరుణ వలయం

అనువాదం "ప్రద్యుమ్న"

ఉపోద్ఘాతం

ముష్యూర్ పాలియాఁ జన్మదినం సరిగా ఆ సెప్టెంబరు 29 వ తేదీన పడి ఉండకపోతే అరుణ వలయానికి సంబంధించిన ఈ నిగూఢచరిత్ర ఏదీ జరగకపోయి ఉండును. ఒక డజనుమంది మృతవ్యక్తులు ఇప్పుడు నిక్షేపంగా జీవించి ఉండేవారు. థాలియా డ్రమండ్ అనే సుందరిని నిజాయితీ పరుడయిన ఒక పోలీసు ఇన్స్పెక్టరు "ఈమె దొంగ; దొంగలతో కలిసి పని చేసింది," అని వర్ణించి ఉండేవాడు కాదు.

జన్మదిన సందర్భంలో ముష్యూర్ పాలియాఁ తన సహచరులు ముగ్గురికీ టులూజ్ నగరంలో విందు చేశాడు. కబుర్లతో కాలం గడిచిపోతోంది. తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ముష్యూర్ పాలియాఁకు తాను టులూజ్ నగరం ఎందుకు వచ్చిందీ హఠాత్తుగా జ్ఞాపకం వచ్చింది. లైట్‌మన్ అనే ఇంగ్లీషు నేరస్థుని మరణ దండన నిర్వహించడానికి అతడు పని కట్టుకుని ఈ నగరం వచ్చాడు.

"ఇప్పుడు మూడు గంటలైంది. 'అరుణా దేవి'ని మనమింకా సిద్ధం చెయ్యనే లేదు" అన్నాడు ముష్యూర్ పాలియాఁ. మద్యపాన మహిమవల్ల అతనికి మాటలు తడబడ్డాయి.

వెంటనే నలుగురూ లేచారు. కారాగృహానికి ఎదురుగా ఒక ట్రాలీ ఉంది. దానిమీద గిలటిన్ (మారణ యంత్రం) భాగాలన్నీ విడివిడిగా అర్ధరాత్రినుండీ అలాగే పడి ఉన్నాయి. అలవాటైన చేతులు కనుక వారు సునాయాసంగా ఆయంత్ర భాగాలనూ, ఖడ్గాన్నీ అమర్చారు.

గిలటిన్ యంత్రం బాగా పనిచేసేదే అయినప్పటికీ దక్షిణ ఫ్రాన్సులో లభ్యమయ్యే ఘాటైన మద్య ప్రభావానికి అది లోను గాక తప్పలేదు. అందుచేత యంత్రం పని చేస్తోందో లేదో పరీక్షించడానికి వారు ప్రయత్నించినప్పుడు ఖడ్గం పడవలసిన చోట పడనేలేదు.

"నేను చెప్తానాగండి" అని ముష్యూర్ పాలియాఁ గిలటిన్‌లో ఒక మేకు బిగగొట్టాడు. ఆమేకు సరిగ్గా ఎక్కడ దిగబడకూడదో అక్కడ దిగబడింది.

వ్యవధి లేదు, సైనికులు వధ్యస్థానం సమీపించారు......

నాలుగు గంటల తరవాత నిందితుణ్ణి కారాగృహం నుండి నడిపించుకు వచ్చారు. అప్పటికి నిందితుని ఫొటో తీయడానికి వీలైనంత వెలుతురు వచ్చేసింది......

"ధైర్యంగా వుండు" అని ముష్యూర్ పాలియాఁ నిందితునితో మెల్లిగా అన్నాడు.

"ఏడిశావ్ లే ఫో" అని నిందితుడు హేళనగా జవాబిచ్చాడు. గిలటిన్ బల్లకు అతన్ని పటకాలతో విరిచి కట్టారు.

పాలియాఁ గిలటిన్ గడియ లాగాడు. ఖడ్గం ధన్‌మని మేకుమీద పడి ఆగిపోయింది.

పాలియాఁ మూడుసార్లు ప్రయత్నించాడు. మూడు సార్లూ విఫలు డయ్యాడు. క్రోధోద్దీపితులైన ప్రేక్షకులు సైనిక వలయం ఛేదించుకుని గిలటిన్ సమీపించారు. అతి కష్టంమీద నిందితుణ్ణి మళ్ళీ కారాగృహానికి తీసుకుపోయారు.

పదకొండేళ్ళ అనంతరం ఆ మేకు అనేకుల దుర్మరణానికి హేతువైంది.

1. మఠాలో ప్రవేశం

మర్యాదస్థులైన పౌరులందరూ నిద్రకు ఉపక్రమించే వేళ. అది నాలుగు వీధులు కలిసే చోటు. అక్కడ పాతకాలపు భవనాల పై అంతస్తు కిటికీలనుండి వెలుగులు కొద్ది కొద్దిగా బయటికి కనిపిస్తున్నాయి. ఆకులు రాలి మోడులైపోయిన చెట్లు గాలికి ఊగిసలాడుతూ ఆ వెలుగులలో నల్ల నల్లగా కనబడుతున్నాయి. నదిమీదినుండి వీచే శీతలవాయువులు ఇళ్ళలోకి, ఇళ్ళ మూల మూలల్లోకి చొచ్చుకుపోయి వణికించేస్తున్నాయి.

ఆ నిశాసమయంలో ఒకవ్యక్తి రోడ్డుపక్క ఇనపకమ్మీలను పట్టుకుని మెల్లిగా నడుస్తున్నాడు. దట్టమైన దుస్తులు ధరించినా, చలికి తట్టుకోలేక వణికిపోతున్నాడు. చలిగాలి హోరుమనివీచే ఇటువంటి ప్రదేశాన్నే ఆ అజ్ఞాతవ్యక్తి సంకేతస్థలంగా ఎందుకు నిర్ణయించాడో అతనికి అర్థంకాలేదు.

అతని కాళ్ళచుట్టూ రాలిన ఎండుటాకులు గలగలమంటూ నాట్యం చేస్తున్నాయి. చిన్న చిన్న రెమ్మలూ, ఆకులూ టపటప రాలి పడుతున్నాయి. అతన్ని పట్టుకోవాలని వంగుతున్నట్లుగా దీర్ఘ హస్తాలవంటి చెట్లకొమ్మలు గాలికి వంగిలేస్తున్నాయి. ఎదురుగా ఉన్న ఒక గృహవాతాయనంలో వెచ్చని వెలుగులకేసి అతడు ఆశగా చూశాడు.

దగ్గరలో ఒక గడియారం పదకొండు కొట్టింది. పదకొండో గంట ప్రతిధ్వని ఇంకా అంతరించిపోకుండానే ఒక కారు వేగంగా, నిశ్శబ్దంగా ఆకస్మికంగా టకంలోకి వచ్చి అతని కెదురుగా నిలిచింది. కారు ముందు దీపాలు మసకగా వెలుగుతున్నాయి. కారు లోపల చీకట్లను పులిమినట్లై ఏమీ కనిపించడం లేదు. ఒక క్షణం తటపటాయించిన తరవాత రోడ్డుమీది వ్యక్తి కారును సమీపించి, తలుపుతీసి, లోపల కూర్చున్నాడు. ముందు సీటులో కూర్చున్న డ్రైవరు ఆకారరేఖ ఛాయామాత్రంగా కళ్ళకు కట్టింది. కారులో అడుగుపెట్టగానే ఏదో తెలియని ప్రమాదంలో అడుగుపెట్టినట్లు అతని గుండె దడదడ కొట్టుకుంది. కారు కదలలేదు. డ్రైవరు సీటులో కూర్చున్న అజ్ఞాత వ్యక్తి చలించలేదు.

కొంతసేపైన తరవాత "ఏమిటి?" అని ఆందోళనతోచే స్వరంతో మొదటి వ్యక్తి అడిగాడు.

"నిశ్చయించుకున్నట్లేనా?" అని డ్రైవరు అడిగాడు.

"నిశ్చయించుకోకపోతే ఇక్కడికెందుకు వస్తాను." అని విసుగ్గా సమాధానమిచ్చి "నేను ఉబుసుపోక వచ్చాననుకున్నావా? నీకు నానుంచి కావలసిందేదో చెప్పు; నాకు కావలసింది చెబుతాను." అన్నాడు మొదటి వ్యక్తి.

"నీకు కావలసింది నాకు తెలుసు" డ్రైవరు అన్నాడు. అతని మాటలు తెరల చాటునుంచి మాట్లాడుతున్నట్టు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

మొదటివ్యక్తి కళ్లు చీకటికి అలవాటైన

తరవాత, డ్రైవరు తలకు చుట్టుకున్న నల్లని సిల్కు పాగా రేఖామాత్రంగా కనిపించింది.

డ్రైవరు ఇంకా ఇలా అన్నాడు: "నాకు తెలుసు; ప్రస్తుతం నువ్వు పూటకు గతిలేని బికారివి. నీది కాని డబ్బు నువ్వు ఖర్చు పెట్టావు. ఆత్మహత్య చేసుకుందామని ఆలోచిస్తున్నావు. తిండికి లేక కాదు! నీరహస్యం ఏదో నీ శత్రు వొకడికి తెలిసిపోయింది. అది బయటపడితే నువ్వు పోలీసులచేతుల్లో పడతావు. మూడురోజుల క్రితం నువ్వు ఒకముంగులషాపులో ఒక స్నేహితుణ్ణిఅడిగి ఒక ఘోరవిషం సంపాదించావు. నువ్వు ఒక వారం రోజుల్నుంచీ విషాలనుగూర్చి, వాటి ఫలితాలనుగూర్చి చదువుతున్నావు. విధి న్యాచక్రం అడ్డుపడి నిన్ను రక్షిస్తే తప్ప, శనివారమో, ఆదివారమో విషంత్రాగి చనిపోదామని ఆలోచిస్తున్నావు. బహుశా ఆదివారం నాడనుకుంటాను."

వెనకసీటులో వ్యక్తి ఆశ్చర్య సంభ్రమాలతో రొప్పుతున్నాడు. అది గమనించి డ్రైవరు నెమ్మదిగా నవ్వాడు.

"ఏం? నేను చెప్పినపని చెయ్యడానికి సిద్ధంగా ఉన్నావా?"

"ఏం కావాలో చెప్పు!" అని మొదటి వ్యక్తి వణుకుతూ అడిగాడు.

"నేను చెప్పినపనిచేస్తే చాలు, ఇంకేమీ అక్కర్లేదు నీకు ప్రమాదం రాకుండా నేను చూస్తాను. నీకు సొమ్ము బాగా ముట్టచెబుతాను. నీ అవసరాలకు సరిపడేనంత సొమ్ము ఈ క్షణమే నీకిస్తాను. దీనికి బదులుగా నేను నీకు పంపించే ధనమంతా చెలామణీ అయ్యేట్టు చెయ్యాలి. నేను పంపే బాంకి నోట్ల నంబర్లన్నీ పోలీసులకు తెలిసిపోయి ఉంటాయి కనుక వాటి ఆమాత్రం తెలియకుండా మార్చేస్తూ ఉండాలి. నేను మార్చడానికి వీలుండదు కనుక బాంక్లను కూడా నువ్వే మార్చాలి. మొత్తంమీద అన్ని విషయాలలోను నా ఏజెంటుగా పని చెయ్యాలి..." అని కొంచెం ఆగి "నేను ఏది అడిగితే అది యిచ్చెయ్యాలి" అని అన్నాడు.

కొంతసేపు సమాధానం చెప్పకుండా ఊరుకుని మొదటివ్యక్తి, "అయితే ఈ అరుణ వలయం సంగతేమిటి?" అని ప్రశ్నించాడు.

"నువ్వే అరుణవలయానికి!"

"నేనా?" అని మొదటి వ్యక్తి చకితుడయ్యాడు.

"నువ్వు అరుణవలయం లోపలి వ్యక్తివే.

నీతోపాటు మరొక వందమందికూడా వలయంలోపల ఉన్నారు. అయితే వారిలో ఏ ఒక్కణ్ణీ నువ్వు కనిపెట్టలేవు; ఏ ఒక్కడూ నిన్ను కనిపెట్టలేడు."

"మరి నువ్వో?"

"నాకు అందరూ తెలుసు. ఏం, అంగీకరించినట్లేనా?" అన్నాడు డ్రైవరు.

కొంచెం ఆగి "ఆ" అని సమాధానమిచ్చాడు మొదటి వాడు.

డ్రైవరు కొంచెం వెనక్కి తిరిగి, చెయ్యి జాపి "ఇది తీసుకో" అన్నాడు.

ఆ "ఇది" ఒక పెద్దకవరు. కొత్తగా ముఠాలో ప్రవేశించిన సభ్యుడు ఆ కవరు అందుకుని జేబులో పదిల పరిచాడు.

"ఇక దిగు" అని డ్రైవరు ఆజ్ఞాపించాడు. మారుమాట లేకుండా మొదటి వ్యక్తి దిగిపోయాడు. కారుతలుపు వేసేసి రెండడుగులు ముందుకు వేశాడు. అజ్ఞాత వ్యక్తి ఎవరైందీ తెలుసుకోవాలని అతని కొకటే తహతహగా ఉన్నది.

"ఇక్కడ చుట్ట ముట్టించబోకు" అని డ్రైవరు కఠినంగా ఆజ్ఞాపించాడు. "అగ్గిపుల్ల వెలిగించడంకోసమే చుట్ట ముట్టించ గోరుతున్నావని అనుకోవలసి వస్తుంది. ఒక విషయం జ్ఞాపకముంచుకో. నేనెవరో తెలుసుకున్న వ్యక్తి మరుక్షణంలో నరకానికి ప్రయాణమవుతాడు!"

మొదటి వ్యక్తి జవాబిచ్చేలోగా కారు కదిలిపోయింది. కారువెనక ఎర్రలైటు కనిపించేదాకా అతడలాగే నిలుచుండిపోయాడు. అతడు ఆపాదమస్తకం కంపించి పోతున్నాడు. గజగజ కొట్టుకుంటున్న పళ్ళతో చుట్టను నొక్కిపట్టి వెలిగించాడు. అగ్గిపుల్ల మంటకూడా ఆ వణుకుతో రెపరెపలాడింది.

"అదీ సంగతి" అనుకుని రోడ్డుదాటి ఒక సందుమలుపులో మాయమైనాడు.

అతడు వెళ్ళిపోగానే చీకటిగావున్న ఒక ఇంటిగుమ్మంనుండి నిశ్శబ్దంగా ఒక ఆకృతి కదిలింది. ఆ వ్యక్తి పొడుగ్గా, వెడల్పుగా ఉన్నాడు. ఊపిరి అందక ఆయాసపడుతూ నడుస్తున్నాడు. ఇంతసేపూ జరిగినదంతా అతడు నౌకల్లో ఉపయోగించే దూరదర్శిని సహాయంతో కనిపెడుతున్నాడు. అతడు ఒక వందఅడుగులునడిచి చుట్టూ చూశాడు. అతడు ఎవరికోసం చూస్తున్నాడో అతడు మాయమయ్యాడు. అందుకు అతడేమీ ఆశ్చర్యపడలేదు. అతణ్ణి ఎక్కడ పట్టుకోవాలో అతనికి తెలుసు. ఫెలిక్స్‌మార్లో పళ్ళికిలించాడు. కారు నంబరు చూశాడు కనుక ఉదయం కారు యజమానిని కనుక్కోవచ్చు. అయితే అతడెవరు? కారులో ఆ వ్యక్తులమధ్య జరిగిన రహస్య విషయం చూచాయగానైనా అతడు ఊహించినట్లయితే అతడలా నవ్వుకుని ఉండేవాడు కాదు. అతనికంటె కొమ్ములుతిరిగిన మహామహావాళ్ళే అరుణవలయం పేరుచెబితే భయభ్రాంతులయ్యారు.

2

దిక్కరించినందుకు ఫలితం

ఫిలిప్ బెసార్డ్ అడిగినదంతా కిమ్మనకుండా చెల్లించి, బతికి బయటపడ్డాడు. డబ్బు చెల్లించినవాళ్ళను అరుణవలయం హాని చెయ్యదనడానికి ఇది నిదర్శనం. బ్యాంక్ అధిపతి జాక్వెస్ రిజే డబ్బుచెల్లించాడు, కాని భయంతో సగం చచ్చి మరీ చెల్లించాడు. నెలరోజుల తరవాత అతడు సహజ కారణాలవల్ల, అంటే గుండె జబ్బువల్ల బాల్చి తన్నేశాడు. రైల్వే లాయరు బెన్సన్ 'నన్నేం చెయ్యగలరు' అని ధీమాగా తిరిగాడు. వెంటనే అతడు ఇహలోకంనుండి నిష్క్రమించాడు.

డిటెక్టివ్ డెరిక్ యేల్ అసాధారణ ప్రజ్ఞావంతుడు. బెన్సన్ కారులో ప్రవేశించి అతన్ని హత్యచేసిన హంతకుణ్ణి సునాయాసంగా పట్టిచ్చాడు. హంతకుణ్ణి ఉరి తీయడమైతే తీశారు గాని వాడి నాయకుడి పేరు మాత్రం చెప్పించలేకపోయారు. వస్తువులు చూసి వాటి రహస్యాలు కనిపెట్టగల యేల్‌ను చూసి మొదట్లో పోలీసులు నవ్వారుగాని, అతడు హత్య జరిగిన నలభై ఎనిమిది గంటలలోగా పోలీసులను హంతకుడు దాగిన స్థలానికి తీసుకువెళ్ళి చూపించడం, నిర్విణ్ణుడైపోయి హంతకుడు నేరం ఒప్పుకోవడం జరిగింది.

ఈ హత్యానంతరం, పలువురు వ్యక్తులు కిమ్మనకుండా డబ్బు చెల్లించి ఉంటారు. అయితే పోలీసులకు రిపోర్టు చేయడానికి ఒక్కరికీ దమ్ములు లేకపోయినట్లయింది. ఎందుకంటే చాలరోజులవరకూ అరుణవలయం పేరు వార్తాపత్రికల్లో ప్రత్యక్షం కానే లేదు. ఆ తరవాత ఒక రోజు ఉదయం జేమ్స్ బియర్డ్ మోర్ ప్రాతర్భోజనం కావిస్తూ ఉండగా, నలుచదరంగా ఉన్న ఒక కార్డు అతనికి అందింది. దానిమీద అరుణవలయం ముద్ర ఉన్నది.

"జాక్!" అని కుమారుణ్ణి పిలిచి, "నీకు ఇలాటి అద్భుత విషయాలలో ఆసక్తి జాస్తి గావును! ఇదుగో యీ రికార్డు చదువు," అన్నాడు జేమ్స్ బియర్డ్ మోర్.

కనుబొమలు చిట్లించి జాక్ ఆ కార్డు పరిశీలించాడు. చిరునామా లేకపోవడం మినహా, మిగతాదంతా మామూలు కార్డులవలెనే ఉన్నది. అరుణ వలయం ఒకటి కార్డు నలుమూలలనూ స్పృశిస్తూ, రబ్బరు స్టాంపుతో ముద్రించినట్లు కనబడుతోంది. వలయంమధ్య ఇలా అచ్చువేసి ఉంది:

"మీ ఆస్తితో పోలిస్తే లక్ష చాలా తక్కువే. 'ట్రిబ్యూన్' పత్రికలో పడిన ఒక ప్రకటనను అనుసరించి, వచ్చే ఇరవై నాలుగు గంటలలో, మీకు వీలుగా ఉండే వేళలోనే, నేనొక వార్తాహరుణ్ణి పంపిస్తున్నాను. బాంక్ నోట్లలో ఆ లక్షా చెల్లించండి. ఇదే ఆఖరి హెచ్చరిక!"

సంతకం లేదు.

"ఏమిటది?" అని తండ్రి కళ్ళజోడులోంచి చూస్తూ అడిగాడు. ఆయన కళ్ళలో నిర్లక్ష్యంతో కూడిన నవ్వు కనిపిస్తోంది.

"అరుణవలయం!" అతి కష్టంమీద జాక్ ఈ మాట ఉచ్చరించాడు.

జాక్ కంఠం వణకడం చూసి జేమ్స్ బియర్డ్ మోర్ బిగ్గరిగా నవ్వాడు.

"అవును, అరుణవలయమే. ఇప్పటికి ఇటువంటివి నాలుగు ఉత్తరాలు వచ్చాయి."

యువకుడు తండ్రికేసి దిగ్భ్రాంతుడై చూశాడు. "నాలుగా......? అందుకేనా డిటెక్టివ్ యేల్ మనతో ఉంటున్నాడు?"

"అది ఒక కారణం మాత్రమే" అన్నాడు తండ్రి.

"యేల్ డిటెక్టివ్ అని నాకు తెలుసనుకో. కాని ఇందుకోసమని—"

"ఈ వలయం, గిలయం బెంగ నువ్వు పెట్టుకోకు," అని అతనిమాటకు తండ్రి అడ్డంవచ్చాడు. "నేను వాళ్ళకి భయపడడం లేదు. తనకికూడా ఇటువంటిది వస్తుందని, మన పొరుగువాడు ఫ్రాయంట్ గజగజ లాడిపోతున్నాడు. అది సహజమే అనుకో. అతనికీ, నాకూ శత్రువుల కొరత లేదు."

జేమ్స్‌బియర్డ్ మోర్ ముఖం గిడసబారింది. వృద్ధాప్యరేఖలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గడ్డంకూడా నెరసింది. ఎదురుగా కూర్చున్న సుందరయువకుణ్ణిచూసి ఇతన్ని చూస్తే, ఇతడు తాతలాగా ఉన్నాడు తప్ప, తండ్రిలాగా లేడు. బియర్డ్ మోర్ ఆస్తి చాలా కష్టపడి కూడబెట్టిన ఆస్తి. ఎన్నో కష్టాలు, ఎన్నో ప్రమాదాలు ఎదుర్కొని, దేశదేశాలు తిరిగి, ఆఖరికి మృత్యుముఖంనుండికూడా తప్పించుకున్న జేమ్స్‌బియర్డ్ మోర్‌కు అరుణవలయం బెదరింపు హేళనాస్పదంగా కనిపించడంలో వింతలేదు. అందుచేతే అతడు ఆందోళన పడుతున్నది తన్నుగురించి కాదు, కొడుకును గురించి.

(55-వ పేజీ చూడండి)

సమస్యాపూరణం

8

[గత సంచిక తరవాయి]

ఆనాటికి, విలాసవతి పెట్టిన పక్షం రోజులగడువులోను అప్పుడే పదిరోజులు గడిచిపోయాయి. అంతవరకు ఓరిమి వహించిన కాళిదాసకవి ఆపైన ఇక ఓరిమి వహించలేకపోయాడు. ఆ నాటినించీ తిరిగి తన స్వగ్రామం అజక్షీరం వెళ్ళిపోతానని ప్రయాణమైనాడు. విలాసవతి మాట ఇచ్చిన ప్రకారం మిగిలిన అయిదురోజులు కూడా ఉండి వెళ్లవలిసిందని బలవంత పెట్టింది.

కాని ఆ మరునాటి సాయంకాలం అతని దగ్గరకు వచ్చి ఎంతో గుంభనగా ఒక నవ్వు నవ్వి, అతడింక స్వగ్రామం అజక్షీరం వెళ్ళిపోవాలనీ లేకపోతే ప్రాణభయం కలగగలదనీ భయపెట్టింది. వెంటనే బయలుదేరి పోవాలని కూడా తొందర పెట్టింది. దీనితో కవి పరిస్థితి బాగా విషమించి ఉండవచ్చునని గ్రహించి కంగారు పడ్డాడు. తొందర తొందరగా స్వగ్రామానికి ప్రయాణమైనాడు. అతని తొందరపాటు చూచి విలాసవతి విరగబడి నవ్వింది! ఆ ధోరణిమాచి కాళిదాస కవి నిర్ఘాంతపోయాడు:

"ఎందుకలా నవ్వుతావు!"

"ఊరికే పరిహాసానికన్నాను! మరేమీభయం లేదు లెండి!"

"పెల్లికి చెలగాటం! ఎలక్కి ప్రాణ సంకటం! అన్నట్టుగా ఉందీ వ్యవహారం అంతాను! నిజంగా అంతటి ప్రాణాపాయమేమీ లేదా?"

"లేదు!".

"అయితే వెళ్లిపొమ్మని నన్నెందుకంతగా తొందరచేశావు?"

"మీ పంచప్రాణాలు అజక్షీరంలోను అక్కగారిమీదే ఉన్నాయి గదా!... ప్రేమానురాగాల నేవి సహజంగా లోలోపలినించి పుట్టుకు రావాలిగాని కాళ్లా వేళ్లా పడి బతిమాలితే మాత్రం పుట్టుకు వస్తాయా? అందుకనే మిమ్మల్నింత తొందరగా వెళ్లిపొమ్మన్నాను!"

"అయితే ప్రస్తుతానికి వచ్చిన ప్రాణభయమేమీ లేదన్న మాట!"

"ఏమీ లేదు!... పైగా మీకొక శుభవర్తమానం కూడా పట్టుకు వచ్చాను."

"నాకా? శుభవర్తమానమా? ఏమిటి చెప్మా అది!"

"ముందుగా నేను కోరుకునే కోరిక చెల్లిస్తానని మాటఇస్తే చెబుతాను."

"ఏమిటో ఆ కోరిక!"

"ఏమీ లేదు ఒక చిన్న సమస్యాపూరణం! అంతే!"

"అంతేనా? నిలుచున్న పాటుగా నీ ఎదట గజ్జెకట్టి మేళం చెయ్యమంటావేమోనని భయపడ్డానులే! అది సరే గాని, ఏమిటో ఆ శుభవార్త!

"మహారాజుకు మీ మీద కలిగిన అపోహ యావత్తు తొలిగిపోయిందనీ తాము విధించిన నగర నిర్వాసన శిక్షకెంతైనా పశ్చాత్తాప పడుతున్నారనీ తెలిసింది!"

"నిజమేనా? ఊరికే పరిహాసానికంటున్నావా?"

"పరిహాసం కాదు! నిజమే!"

"నామీద ఒట్టు పెట్టుకో!"

"నేను చచ్చిపోయినంత ఒట్టు! సరికదా!"

"నామీద ఒట్టు పెట్టుకోమంటే నీమీద పెట్టుకున్నావే!"

"అంతటి అమాయిత్వం మాట అనడానికి నాకు నోరాడలేదు!... నేను చెప్పిన శుభవార్త నిజమే! నామాట నమ్మండి!"

అని నవ్వుచెప్పి ఆమె తనకు తెలిసిన శుభవర్తమానం ఆమూలాగ్రంగా అతనికి తెలియజేసింది. మహారాజేర్పాటు చేసిన గూఢచారులు, అంతఃపుర పరిచారికలు నిద్రాహారాలు కూడా మానివేసి తరంగికా మహేశ్వరుల రహస్య వర్తనలన్నీ అతిరహస్యంగా పరిశీలించారు. ఆ పరిశీలనలో తరంగిక గృహంలో వారికొక తాళపత్ర లేఖ దొరికింది. అది మహేశ్వరకవి తరంగికకు వ్రాసిన లేఖ. దానిలో అతడు గూఢచారుల భయంవల్ల తాను కొంతకాలం వరకు తరంగిక గృహానికి రావడంలేదనీ దానికి అన్యథా భావించవద్దనీ ఆ కలవరింతలవల్ల అక్షరాలా అనుకున్నదంతా జరిగిపోయిందనీ వ్రాసి, తరంగిక చాతుర్యం వేయి విధాలుగా ప్రశంసించాడు. లేఖ పఠించిన ఉత్తర క్షణంలోనే అది అగ్నిహోత్రునికాహుతి చెయ్యవలసిందనీ ఆ విషయం మాత్రం విస్మరించవద్దనీ అది అత్యంతావశ్యకమనీ వ్రాశాడు. అయితే తరంగిక మహేశ్వరునిమీది మమకారం కొద్దీ ఆ లేఖ అగ్నిహోత్రునికాహుతి చెయ్యకపోయింది. పైగా అది కళ్ళకద్దుకుని తన అలంకార మంజూషలో ఎంతో ప్రాణపదంగా దాచుకొన్నది. అది ఒక అంతఃపుర పరిచారికకు దొరికింది. వెంటనే అది రాణి లీలాదేవి చేతిలోకి వెళ్ళిపోయింది. ఆమె ఆ లేఖ చేతబుచ్చుకుని తరంగికననేకవిధాలుగా నయానాభయానా బెదిరించింది. యథార్థం తెలియజేస్తే ఏవిధమైన హాని కలగనీయనని అభయప్రదానం చేసింది తరంగిక మరిగత్యంతరం లేక మహేశ్వరకవికీ తనకు మధ్య నడిచిన తతంగమంతా పూసగుచ్చినట్లుగా లీలాదేవికి చెప్పివేసి తనతప్పిదం మన్నించవలసిందని ప్రార్థించి కన్నీరు మున్నీరుగా రాగాలు పెట్టింది. పిమ్మట అదంతా మహారాజుదాకా వెళ్ళిపోయింది. అది వినగానే మహారాజు మనస్సులో పశ్చాత్తాపము, మథన ప్రారంభమైనాయి.

ప్రాచీన గాథాలహరి

పి. గణపతిశాస్త్రి

ఆ విషయం అంతా విలాసవతి కాళిదాసకవికి తెలియజేయగానే అప్రయత్నంగా అతని పెదవుల నుండి ఒక్క దీర్ఘనిశ్వాసం వెలువడింది. విలాసవతి ఒక్క చిరునవ్వునవ్వి హేలగా ఇలాగన్నది.

"నేను మొదటినించీ చెబుతూనే ఉన్నాను, తొందరపడవద్దని! నిజం నిలకడమీద తేలిపోయింది చూశారా!"

"అయితే నేనీవేళ సాయంకాలమే అజక్షీరం వెళ్లిపోతున్నాను."

"మహారాజు గాని మళ్లీ పిలిపిస్తారేమో! కొంచెం నిదానించండి!"

"ఏమైనాసరే! తిరిగీ నేను మహారాజు ముఖం చూడదలచుకోలేదు! అంతే!"

"పోనీలెండి! మీరు నా ఆస్థానకవీశ్వరులేగదా? ఇంక మహారాజుతో అవసరం ఏముంది! అయితే మరి—నా సమస్య మాట?"

"నీ సమస్య అంటే!"

★ సమస్యాపూరణం ★

"అప్పుడే మరిచారా? నా సమస్య కేమి టెండి గాని—కవితా సమస్యమాటే అడుగుతున్నాను."

"ఆ సమస్య ఎవరిచ్చారో!"

"భోజమహారాజు! అది పూర్తిచేసిన వారిని అక్షర లక్షలతో ఆస్థానమహాకవిగా అభిషేకిస్తారట!"

"ఇక ఈ రాజా స్థానాల గోల నాకేల! నాదారిని నన్నుపోనీ!"

"పోనీ! అది నా కోసం పూర్తిచేసి పెట్టండి!"

"అది నీకెందుకు!"

"ఆ అక్షరలక్షలు, ఆ ఆస్థాన మహాకవి గౌరవము నేనే స్వీకరించాలని అనుకుంటున్నాను!"

ఆమె అలాగనగానే కాళిదాసకవి ఒక్క నిమిషం ఊరుకుని—

"మహాచక్కని ఆలోచన!" అన్నాడు.

ఇక ఆ సమస్యాపూరణంతో ఇక ఆస్థానంలో మిగిలిన క్షుద్ర కవులందర్నీ తలలెత్తుకోకుండా చేయవచ్చుననీ తాను ధారానగరం విడిచివెళ్లిన తరవాత విలాసవతికా మహాకవి గౌరవంకలిగిస్తే అది ప్రస్తుత విషమసమస్యకొక చక్కని పరిష్కారం కాగలదనీ అనుకున్నాడు. వెంటనే అతడామె నా సమస్య తెలియజెయ్యవలిసిందని అడిగాడు. ఆమె అది మధురకంఠంతో నెమ్మదిగా ఇలాగ చదివింది:

"కుసుమే కుసుమోత్పత్తిః
శ్రూయతే నతు దృశ్యతే."

పువ్వులోనించి పువ్వుపుట్టడమనేది వినడమేగాని ఎక్కడా చూడలేదు." అని దాని తాత్పర్యం.

అది వినగానే కాళిదాసకవి "ఇది ఎవరు కల్పించారో గాని చాలా పెద్ద విషమ సమస్యే!"అన్నాడు.

"ఇంకెవరు కల్పించగలరు! మన మహారాజే!"

"ఈ సమస్య ఎందుకిచ్చినట్లో!"

"ఏమో ఏమీ తెలియడంలేదు!"

"ఇన్ని అత్యంత రహస్య విషయాలు పట్టుకొన్నావుగదా! ఇది ఒక్కటీ మాత్రం తెలియలేదా!"

"మందారమాలికకూడా దీని అంతేమిటో తెలియడంలేదని అంది!"

"అయితే మందారమాలికద్వారా నీ రిన్ని తెలుస్తున్నాయన్నమాట!"

"అన్న మాటేమిటి? అదేనా గూఢచారిణి! – ఇంతకీ మహారాజీ సమస్య ఎందుకిచ్చారో మన కెందుకు? పూరించడమే మన వంతు! దయచేసి కొంచెం పూరించి పెట్టండి!"

అటుపిమ్మట కాళిదాసకవి కనురెప్ప వేయకుండా ఆమె ముఖభంగిమ గమనించాడు. అలాగ రెండు మూడు నిమిషాలు గడిచిపోయాయి! కవి తరవాత "బాలే! తవ ముఖాంభోజే దృష్టమిందీవరద్వయం" అని ఆ సమస్య పూర్తిచేశాడు.

"ఓ చిన్నదానా! నీ ముఖ పద్మమందు రెండు నల్లకలవలు కనిపించాయి!" అని ఆ పాద తాత్పర్యం!

కవి వెంటనే శ్లోకం అంతా ఇలాగ చదివాడు.

"కుసుమే కుసుమోత్పత్తిః
శ్రూయతే నతు దృశ్యతే!
బాలే! తవ ముఖాంభోజే
దృష్ట మిందీవరద్వయమ్!"

అది వినగానే విలాసిని ఆశ్చర్య విస్ఫారిత నేత్రాలతో కవివైపు చూచింది. కాళిదాసామె అరుణాధరంమీద దృష్టి నిలిపి—

"ఇంత చక్కగా పూరించానుగదా! మరి దీనికి సత్కారం మాట!" అన్నాడు.

"చాల్లెండి, మీ కొంటెతనం!" అంటూ విలాసిని అక్కడినించి పారిపోయింది!

౮

తరంగిక కేవలం గత్యంతరం లేకపోవడం వల్లనే తన తప్పిదం ఒప్పుకొన్నది. దాని మూలంగా ఆమె కేవిధమైన హానీ కలగలేదు. అయితే లీలాదేవి అప్పటినించీ ఆమెను అంతఃపురంలో సామాన్య పరిచర్యా నిర్వహణలో మాత్రమే వినియోగించింది. అంతే గాని మిగిలిన విషయాలలో ఆమె కేవిధమైన హానీ కలగనీయలేదు.

అయితే తరంగిక తాను చెప్పిన వృత్తాంతం మూలకంగా మహేశ్వర కవి కేమైనా అపకారం జరగవచ్చునేమోనని లోలోపల చాలా భయపడింది. వెంటనే ఒకనాడతిరహస్యంగా మహేశ్వర కవి కా తాళపత్ర లేఖా వృత్తాంతం అంతా తెలియజేసింది. అతడది విని హడలిపోయి వెంటనే కృష్ణ కళింగ కవులిద్దరికీ ఆ వ్యవహారం అంతా ఆమూలాగ్రం తెలియజేశాడు.

కృష్ణకవి ఇది వినగానే వ్యవహారం అంతా బాగా చెయ్యిదాటిపోయిందనీ క్రమంగా ఈ పెనుప్రళయం అంతా కళింగ కవిమీద, తనమీద కూడా విరుచుకుపడ వచ్చుననీ భయపడ్డాడు. మొదటినించీ అతడీ విషయంలో చాలా చాకచక్యంతో వ్యవహరిస్తున్నాడు. కాళిదాస కవికి నగర నిర్వాసనం జరిగినప్పటినించీ తరుచుగా తరంగిక గృహానికి వెళ్లవద్దనీ, గూఢచారులతిరహస్యంగా ఆ విషయం పరిశీలిస్తున్నారనీ మహేశ్వరకవిని హెచ్చరించినవాడు కృష్ణకవే! అయితే తరంగిక వ్యవహారం అంత తేలికగా బయటపడిపోగలదని అతి దూహించలేదు. కాళిదాసకవి నగరనిర్వాసనానికి లోలోపల ఎంతో సంతోషిస్తున్న కవిత్రయం వారందరికీ ఇటీవల జరిగిన ఈ రహస్య భంగంతో ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి. దాంతో ఎవరిమట్టుకు వారే ఆత్మగౌరవ సంరక్షణలో పడిపోయారు. కృష్ణ కళింగ కవులిద్దరు క్రమక్రమంగా మహేశ్వరకవిని కొంచెం దూరం దూరంగా నెట్టివెయ్యడం మొదలు పెట్టారు. కాని పైపైకి బాగా ఆప్యాయత కనబరచడం మాత్రం మానలేదు. మహేశ్వర కవికి విషమసమస్యలో ఏమి చెయ్యడానికీ పాలుపోలేదు. తనకిక కృష్ణకవి ఒక్కడే ఆపద్బంధువుడు కాగలడని నమ్మి అతడ్నే అంటిపెట్టుకుని తిరిగేవాడు.

ఆ విషయంలో వారిలో వారా విధంగా మథనపడుతూండగా హఠాత్తుగా ఆ నూతన సమస్యాపూరణ వృత్తాంతం తెలిసింది. మహారాజీవిధంగా నూతన సమస్య ఇవ్వడానికిగల కారణమేమో వారెవ్వరికీ బోధపడలేదు. కాళిదాసకవి నగరనిర్వాసనం జరిగిన తరవాత మరి ఒకరి నెవరినైనా ఆస్థాన కవిగా అభిషేకించడానికి మహారాజావిధంగా నూతన సమస్యాపూరణం ప్రకటించి ఉండవచ్చునని వారిలో వారొక నిర్ణయానికి వచ్చారు.

ఆ ఆపత్సమయంలో వారికా సమస్య సముద్రంలో మునిగిపోయేవారి కొక నౌకలా భాసించింది. ఆపైన కృష్ణకవి ప్రతిభ ఆ విషయంలో బాగా చురుకుగా పనిచేసింది: ఎలాగైనా మహేశ్వర కవిచేత ఆ సమస్య పూర్తిచేయిస్తే తమకందరికీ ప్రస్తుతం వచ్చిన ప్రమాదం తొలగిపోతుంది. మహారాజు మాట ఇచ్చిన విధంగా అతన్ని ఆస్థాన మహాకవిగా అభిషేకించక తప్పదు. దానితో మహేశ్వర కవికి ప్రస్తుతం వచ్చిన ప్రమాదం అంతా పూర్తిగా తొలగిపోవచ్చును. ఇంకొక విషయం: ఆస్థాన మహాకవి అయినా అతనికీ తన సాహాయ్యము, కళింగకవి సాహాయ్యము చాలా అవసరం. ఆ విధంగా తనకు, కళింగ కవికీ అతడొక పెట్టని కోటగా ఏర్పడ కలడు.

అందుచేత ముగ్గురు వేర్వేరుగా మూడు విధాలుగా సమస్యలు పూర్తిచేసినా వాటిలో ఉత్తమమైనదానికి మహేశ్వరకవికర్తృత్వం ఆరోపించడం ప్రస్తుతానికి అత్యంతావశ్యకమనీ, అది అన్నివిధాలా తగిన తరణోపాయమనీ కృష్ణకవి నిశ్చయించాడు. కళింగకవికూడా ప్రస్తుతానికది ఒక్కటే తరణోపాయమనీ అంతకంటె మరి గత్యంతరమేమీ లేదనీ వంతపాడాడు. మహేశ్వరకవి కృష్ణకవిచాతుర్యానికీ పరోపకారపారీణతకు ఉప్పొంగిపోయి అతని ననేకవిధాలుగా ప్రశంసించాడు.

అటుపిమ్మట ముగ్గురు వేర్వేరుగా మూడు విధాలుగా ఆ సమస్య పూర్తిచేశారు. ఆ సమస్యాపూరణాలన్నిటిలోనే కళింగకవికే సర్వోత్తమంగా ఉన్నదనీ ధారానగరకవివర్గంలో అమాత్రం చమత్కారయుక్తంగా సమస్య పూర్తిచెయ్యగలవారెవ్వరు లేరనీ కృష్ణకవీ, మహేశ్వరకవీ కూడా మెచ్చుకొన్నారు. వెంటనే అది మహేశ్వరకవి పేరిట మహారాజసన్నిధికి పంపించివెయ్యాలని నిశ్చయించారు.

అది పంపివేసిన మర్నాడు కృష్ణ కళింగకవులిద్దరు కృష్ణకవిగృహంలో సమావేశమైనారు. కొంతసేపటివరకు ఏవేవో మంతనాలు సాగించారు. కళింగకవికి ప్రస్తుతం మహేశ్వరకవికి రాబోయే ప్రమాదం అంత తేలికగా తొలగిపోయేది కాదనీ, మహారాజుకు మహేశ్వరకవిమీద కలిగిన అగౌరవభావం, అతని సంసర్గంవల్ల క్రమక్రమంగా తమమీదకూడా ప్రసరించవచ్చుననీ భయంవేసింది:

“ఒకవేళ ఇంతకన్నా మనోజ్ఞంగా ఈ సమస్య పూర్తిచేసినవారెవరైనా ఉంటే మరి మహేశ్వరకవి గతి ఏంకావాలి?”

“అలాంటివారెవరు ఉండరనే నా నమ్మకం!” అన్నాడు కృష్ణకవి.

“ఆసమస్యాపూరణం తిరిగి పఠిస్తే నాకేమీ అంత భరవసా కలగడంలేదు. అదీగాక మహారాజు అభిరుచి ఏవిధంగా మొగ్గుతుందో ఎవరు చెప్పగలరు? ఇంతకీ మహారాజసన్నిధికి వచ్చిన సమస్యాపూరణాలన్నీ మనం చూడలేదుగదా!”

“పోనీవయ్యా! గాలీ వానా వస్తే కథే లేదు!”

“అంటే?”

“ఈ సమస్యాపూర్తితో మరొకరెవరైనా ఆస్థాన మహాకవిఅయితే మహేశ్వరకవి మరి ఈ ఆస్థానానికి తిలోదకాలు వదులుకోవలసిందే!”

“తీరా మోసి అతడిదంతా మనమీద తోసివేసి తానేపాపము ఎరగనని చల్లగా తప్పుకుంటేః”—

“అనగానే సరా? ప్రబలమైన అటువంటి ఆధారం ఉండవద్దూ?”

“ఏమైనా అది మహారాజు హృదయంలో కొంచెం అనుమాన విషబీజం నాటించడానికి చాలునుగదా!”

“దానివల్ల అతనికి వచ్చే లాభం?”

“ఆత్మరక్షణ!”

“అది నాకు కొంచెం స్ఫురించక పోలేదు!...అయితే వ్యవహారం అంతా మొదటికివచ్చే సూచన లేమైనా కనిపిస్తే వెంటనే అతని హృదయంలో భీతావహం పుట్టించి చల్లచల్లగా పలాయనమంత్రం పునశ్చరణ చేయించేస్తాను!”

“లేకపోతే మన ప్రాణాలకే మోసం రావచ్చును! అది గమనించారా?”

“ఇవ్వన్నీ నేను మొట్టమొదటే అనుమానించానయ్యా!...అయితే ఆ దాసీపిల్ల ఇంత కొంప ముంచుతుందని ఊహించలేక పోయాను! అంతే!”

“అదిమాత్రం ఏంచేస్తుంది! తీరా మోసి అదంతా విరగబడి మీదపడేసరికి తన పంచప్రాణాలు దక్కించుకుని బయటపడింది!”

“మహేశ్వరకవి ప్రాణాలకు తన ప్రాణాలడ్డు వేస్తుందేమోనని అనుకున్నాను గాని చిట్టచివరికి అతని ప్రాణాలే తన ప్రాణాలకడ్డు వేసుకుంది!”

“ఇక మన కర్తవ్యము అంతే!”

“సరే! అప్పటిమాట ఆలోచిద్దాము ఈ ఘడియవరకు వ్యవహారం మించిపోలేదుగదా!”

పిమ్మట వారిద్దరు స్వగృహాలకు మరలిపోయారు.

౯

తరవాత కొంతకాలానికి ధారానగర కవీశ్వరులందరు పంపించిన సమస్యాపూరణాల పరీక్ష జరిగింది. దానికి ధారాధిపతి భోజమహారాజేకాక మరి ఇద్దరు విద్వత్కవులు కూడా పరీక్షకులైనారు. ఆ సమస్యాపరీక్షకు కృష్ణ కళింగమహేశ్వరకవులేగాక ఇంకా మిగిలిన ధారానగరకవులు, విలాసిని మొదలయినవారెందరెందరో తమ శ్లోకాలు పంపించారు.

శ్లోకాల పరిశీలన ఆయాకవి నామధేయాల ప్రసక్తి లేకుండా నిష్పక్షపాతంగానే జరిగింది. కాని ఆ పరిశీలన ముగిసేసరికి భోజమహారాజు, మిగిలిన ఇద్దరు విద్వత్కవులు ఆశ్చర్యచకితులైనారు. సమస్యాపూరణాలన్నిటిలోను ఒకేఒక్క సమస్యాపూరణం ఉత్తమోత్తమమని పరీక్షకులు ముగ్గురు ఏకగ్రీవంగా నిశ్చయించారు. ఆ నిశ్చయానికి పూర్వం వారికది రచించినవారెవరో తెలియదు. నిర్ణయం జరిగినతరవాత వారందరికీ ఆ కవి నామధేయం తెలుసుకోవాలనే ఉత్కంఠ బయలుదేరింది. అది విలాసిని!

సమస్యాపూరణం

ఆ పేరు వినబడేసరికి వారు ముగ్గురు తాము మేలుకొన్నామా! కలలు గంటున్నామా! అని ఆశ్చర్యపోయారు!

విలాసిని అంతకుపూర్వం ఎన్నడు గీర్వాణకవయిత్రిగా పేరుపొంది ఉండలేదు. కావ్య నాటకాలంకారాలలో ఆమెకు కొంత విద్వత్తు ఉన్న మాట వాస్తవమే! అంతమాత్రంచేత రసవత్తరమైన ఆ సమస్యాపూరణం ఆమె రచించినదే అనడానికి వారెవ్వరు సాహసించలేకపోయారు. ఆమె నామధేయంతో ఆ సమస్యాపూరణం పంపించిన తరవాత అది కాదనడానికి ఎవరికీ నోరాడ లేదు.

ఈ విషయంలో ఎటు నిర్ణయించడానికి పాలుపోక మహారాజు ఆమెను ఒకసారి దర్శనానికి రావలసిందని కబురు పంపించాడు. విలాసిని తన సన్నిధికి రాగానే ఆమె కవితా చాతుర్యం అభినందిస్తూ ప్రశంసించాడు. దానికామె ఉబ్బి తబ్బిబ్బైపోలేదు.

ఒయ్యారంగా తల వంచుకొని—"మహాకవులు పొందవలసిన ఈ మహా గౌరవం నావంటి అల్పురాలికి వచ్చిందే!" అని కొంచెం కించపడుతున్నాను. అయితే ఇదంతా మీ అపారమైన ఔదార్యం మాత్రమే!" అన్నది.

"నీ మూలాన నేటికి మా ఆస్థానాని కాలోటు తీరిపోయిందే!"

"కాని కాకి బంగారం మేలిమి బంగారం కానేరదు కదా!"

ఆమె మాటలలో భోజునికేదో నిశిత వ్యంగ్యం స్ఫురించింది. నిశ్చలంగా ఆమెకేసి చూస్తూ నెమ్మదిగా ఇలాగన్నాడు.

"నీ మాటలు నా కర్థం కావడం లేదు!"

"అర్థం కాకపోవడానికి మీకు తెలియనిదేమున్నది! అయితే అపరాధం మన్నిస్తామని అభయ ప్రదానం చేస్తే ఉన్న విషయం కాస్తా తమ ఎదట మనవి చేస్తాను!"

మహారాజంగీకారసూచకంగా శిరఃకంపం చేశాడు.

"ఈ సమస్యపూరించింది నేను కాదు!"

"ఎవరా మహాకవి?"

"కాళీదాస మహాకవి!"

"ఆయన అజక్షీర గ్రామానికి మరలి పోలేదా?"

"మరలిపోతే ఈ సమస్య ఇంత హృదయంగమంగా ఎవరు పూరించగలరు?"

"అయితే ఆయన ధారానగరంలోనే ఉన్నారన్న మాట!"

"అవును! అదే! నా మహాపరాధం!" అని చెప్పి విలాసవతి కాళిదాస కవికి నగర నిర్వాసన శిక్ష విధించినది మొదలుకొని అప్పటివరకు జరిగిన విషయాలన్ని సంగ్రహంగా అతనికి తెలియజేసింది. అది విని మహారాజామె చాతుర్యానికెంతో మెచ్చుకొని సగౌరవంగా సత్కరించాడు! కాళీదాసకవిని తన అపరాధం మన్నించవలసిందని కోరడానికై ఆనాటి సాయంకాలమే ఆమె భవనానికి బయలుదేరి వస్తున్నాననీ కవిపట్టిన పట్టు సడలించేటట్టు చూడవలసిందనీ ఆమెతో అన్నాడు.

తరవాత ఆ వార్త క్రమక్రమంగా ధారానగరం అంతటా పాకిపోయింది. కృష్ణకళింగ కవులిద్దరు ఆ వార్తను చిలవలు, పలవలు కల్పించి మహేశ్వరకవి సుందెల్లో పెద్దపులులు పరిగెత్తించారు! మహేశ్వరకవి ఆనాటి సాయంకాలం సంజ చీకట్లలో తలదాచుకుంటూ చల్ల చల్లగా ధారానగరం విడిచి పారిపోయాడు! పైపై కెంతో విచారం వెళ్ళగక్కినా కృష్ణ కళింగ కవులిద్దరు ఆసంఘటన చూచి అమితానంద భరితులైనారు.


విలాసవతి తొందర తొందరగా స్వభవనానికి మరలివచ్చి చిన్న చిన్న ఛలోక్తుల తోను, పరిహాసాలతోను కాళీదాస కవికా శుభవర్తమానం అంతా తెలియజేసింది. అపరాధ క్షమాపణకోసం స్వయంగా మహారాజే విలాసవతీ భవనానికి వస్తున్నారనే వృత్తాంతం వినగానే కాళీదాసకవికి అంతకుపూర్వం మహారాజుపై కలిగిన ఆగ్రహం అంతా ఒక్కసారిగా పటాపంచలై పోయింది! విలాసవతి ఔదార్యం తలుచుకోగానే కవి కంఠంలో గద్గదిక పొడచూపింది.

కాని విలాసవతి అతన్ని వెంటనే అజక్షీర గ్రామానికి వెళ్ళిపొమ్మని శాసించింది! నిర్ఘాంతపోయి నిలుచున్న అతన్ని గది గుమ్మం బయటికి నెట్టివేసి ధామ్మని గదితలుపులు బిగించివేసి లోపల గొళ్ళెం పెట్టింది! తరవాత దీపదీపాల వేళదాకా అతడెంత బతిమాలుకొన్నా ఆమె మరి తలుపులు తెరవనేలేదు!

పిమ్మట మహారాజు విలాసవతీ భవన ద్వారం సమీపించడమూ, ఆమె ఆ తలుపు తియ్యడమూ ఒక్కసారిగానే జరగాయి!

ఆ మరునాడే కాళీదాసకవి భోజరాజాస్థాన మహాకవిగా పట్టాభిషిక్తుడైనాడు.

ఆ సమయంలో అక్షర లక్షలతని శిరస్సుపై సువర్ణ పుష్పాంజలిలా ప్రకాశించాయి! ఆ మహా గౌరవం కృష్ణ కళింగ కవు లిద్దరు ప్రశంసించినంత గొప్పగా ఇది తర కవు లెవరు ప్రశంసించలేకపోయారని ధారానగర విద్వత్కవులలో ఒక మహా కల్లోలం చెలరేగింది! ★



అనువాదం:

మద్దిపట్లసూరి

16

హరిహరుడు ఊరు విడుతూ ఈసారి కుర్ర వాణ్ణి వెంటతీసుకుని వెళ్లాడు. "ఇంట్లో ఉంటే తినేందుకేమీ ఉండేదు, అయినా బయటి ఎక్కడికైనా వెడితే నెయ్యి, పాలు, పెరుగు-ఆరోగ్యం కాస్త బాగుపడుతుంది" అన్నాడు.

అపూ పుట్టినప్పట్నుంచీ ఎప్పుడూ ఎక్కడికీ వెళ్లి ఎరుగడు. ఊళ్లో ఆ పొగడచెట్టు, గోసాయితోట, చింతలోపు, ఏటిగట్టు-మహా వెడితే నవాబ్‌గంజ్‌కి వెళ్లే రోడ్డు — అంతవరకే వాడిపరుగు. అప్పుడప్పుడు వైశాఖ, జ్యేష్ఠమాసాల్లో మరీ ఎండ ఎక్కువ కాచిన రోజున సాయంత్రప్పుడు వాళ్ళ అమ్మ ఏటి రేవుకి వచ్చి నుంచుంటూ ఉంటుంది. ఏటి కవతలి ఒడ్డున మెరకమీది తుమ్మచెట్లపూలు పచ్చగా కన్పిస్తూ ఉంటాయి. పసువులు పచ్చికమేస్తూ ఉంటాయి. అక్కడి ఆ బూరుగు చెట్లను, పెద్ద పెద్ద మోకుల్లాంటి తిప్పతీగెలను చూస్తుంటే అవి ఎన్నేళ్ళ నాటినుంచీ ఉన్నవో అనిపిస్తుంది. గొల్ల కుర్రవాళ్లు గొడ్లకు నీళ్లు పట్టటానికి ఏటికి తోలుకు వస్తూ ఉంటారు. వాళ్ల ఊళ్లో కెష్ట-అక్రూరుడు ఓ చిన్నడింగీ ఎక్కి నీళ్లో చేపలు పట్టటానికై వల విసురుతుంటూ పోతూంటాడు. మైదానంలో అక్కడక్కడ గుబురు గుబురుగా ఉన్న రెండుగోను చెట్లపూలు సాయంత్రపు పైరు గాలికి ఊగిసలాడుతూ ఉంటాయి.

సరిగా అటాంటప్పుడు ఒకొక్క రోజున అవతలిఒడ్డున పచ్చని పొలాల చివర — దూరంగా ఎక్కడో ఊరి వెలుపలి తోపు దగ్గర నీలాకాశం వెలకి అనుకున్న చోటుకేసి చూస్తూంటే వాడి మనస్సు కెలాగో ఉండేది. ఆ భావాలన్నీ స్పష్టంగా చెప్పటం చేత

జరిగిన కథ:—

నిశ్చిందిపురం బెంగాల్‌లోని మారుమూల కుగ్రామం. ఆ ఊళ్లో చితికిపోయిన మధ్య తరగతి సంసారి హరిహరరాయ్. అతని భార్య సర్వజయ. కూతురు దుర్గ. హరిహరరాయ్ పెళ్ళయిన తరవాత కొంతకాలం దేశాలు పట్టిపోయి, శాస్త్రాల్లు, కావ్యాలు చదివి పండితుడై, స్వదేశానికి తిరిగివచ్చి కాపరంపెట్టాడు. దుర్గ పుట్టిన చాలఏళ్ళకి అతనికి కొడుకు పుట్టాడు. వాడిపేరు అపూ. ఇంట్లో ఎప్పుడుచూసినా 'ఇవాళ ఎలా గడుస్తుందిరా భగవంతుడా' అనే చింతే. కాని పిల్లలకిదేం పట్టింది? దుర్గకి ఒక్కనిమిషం ఇంట్లో కాలు నిలవదు. ఎప్పుడూ ఏ తోటలోనో, ఏ చెట్టుకిందనో తిరుగుతూ ఉంటుంది. అపూ ఎప్పుడూ ఊహాలోకంలోనే గడుపుతాడు. వాడికి ప్రకృతి కొత్త, ప్రతిదీ వింతే. వాడి జీవితపరిధిలోకివచ్చే ప్రతి సాధారణవిషయమూ అసాధారణమైనదిగా, అద్భుతమైనదిగా వాడికి కనిపిస్తుంది. ఒకరోజున అపూను బళ్లోవేశారు. చదువుచెప్పడంకంటె, బడిలోనే ఒకపక్కనఉన్న చిల్లర కొట్టుపని చూసుకోవడం, కొట్టుకు వచ్చేపోయేవారితో కబుర్లుచెప్పడమే పంతులుగారికి అలవాటైంది. కొట్లోకివచ్చే గ్రామస్థుల కబుర్లు వింటూ అపూ ఏవో ఆలోచనల్లో తేలిపోతూ ఉండేవాడు. పంతులు ఎప్పుడైనా పాఠంచెప్పినా ఆ మాటలు వాడికి అర్థంఅయ్యేవికావు. అర్థంకాని ఆ శబ్దసముదాయం వెనక వాడికి ఏవో చిత్రవిచిత్రమైన రమణీయలోకాలు, దేశకాలబాధితంకాని ప్రపంచాలు కనిపించేవి. పెద్దవాడైన తరవాత దానికనుక్కుని అక్కడికి వెళ్ళాలని వాడు నిశ్చయించుకున్నాడు.

★ పథేర్ పాంచాలీ ★

కాదు వాడికి. వాళ్ళ అక్క తేవులోంచి ఒడ్డు ఎక్కగానే — "అక్కా అక్కా, అదుగో అటుచూడు" అంటూ ఆ మైదానం చివర వ్రేలితో చూపుతూ-"అదే. ఆ చెట్ల వెనుక, చాలా దూరం. ఏం కదూ?" అనే వాడు.

దుర్గ నవ్వుతూ-"చాలాదూరం, అదేనా చూపిస్తున్నది, పోరా, ఎక్కడో ఒక్కి పిచ్చి వాడివి నువ్వు!" అనేది.

అలాంటి అపూ ఇవాళే మొదటిసారిగా ఊరి వెలుపల అడుగుపెట్టాడు. ఉత్సాహం కొద్దీ కొన్నాళ్ళనుంచీ వాడికి రాత్రిళ్ళు నిద్ర పట్టటం లేదు. రోజులు లెక్కపెట్టగా లెక్క పెట్టగా, అక్కడికి వెళ్ళేరోజు వచ్చింది.

తమ ఊళ్ళోనుంచి వచ్చే దారి మలుపు తిరిగి, నవాబ్‌గంజ్ రోడ్డుదాటి, మైదానానికవతల దుర్గాపురం నాటుదారిలో కలుస్తుంది. దుర్గాపురం దారికి రాగానే "రైలు వెళ్ళేదారి యిటువైపు నాన్నా?" అని అడిగాడు అపూ.

"మనం వెడుతున్న ఈ దోవ కెదురుగానేరా. పద. మనం రైలురోడ్డు దాటే వెళ్ళాలి ఇప్పుడు—" అన్నాడు వాళ్ళ నాన్న.

అప్పుడొకసారి తమ దోర—ఆవుదూడ తప్పిపోయింది. ఎన్నిచోట్ల వెతికినా రెండు మూడు రోజులదాకా కన్పడనేలేదు.

అప్పుడు వాడు అక్కతో కలిసి దక్షిణ వైపు మైదానానికి వెతకటానికి వచ్చాడు. పుష్యమాసం అది. ప్రతిచేలో పెసర బాగా పూచి అప్పుడప్పుడే కాపుకు తిరుగుతోంది. తానూ, అక్కా కూడా మధ్య మధ్య వంగి కాయలు కోసుకుని తింటూ నడుస్తున్నారు. నవాబ్‌గంజ్ రోడ్డు ఎదురుగా దగ్గరలోనే ఉంది. ఖర్జూరం, జెల్లపు బుట్టల ఎద్దుబళ్లు కిరకిరలాడుతూ దుర్గాపురం సంతకి వెడుతున్నాయి.

వాళ్ల అక్క రోడ్డుకవతల వైపున దూరం నుంచి అస్పష్టంగా కన్పిస్తున్న మైదానంలో దేన్నో రెప్ప వాల్చకుండా చూస్తోంది. "ఓ పని చేద్దాంరా అపూ. పద, మనంవెళ్లి రైలు వెళ్ళేదారి చూసివద్దాం, వస్తావా?" అన్నది హఠాత్తుగా. అపూ అక్కముఖం కేసి విస్తుబోయి చూస్తూ "రైలు రోడ్డా? అది చాల దూరంగా! అక్కడి కెలా వెడతాం?" అన్నాడు.

"చాలా దూరమా? ఎవరుచెప్పారు నీకు? ఈ రోడ్డుకి అవతలేగా, కాదూ?" అన్నది అక్క.

"దగ్గిరయితే కన్పిస్తుందిగా! రోడ్డుమీది కెళ్ళి చూడొచ్చు. వెడదాం పద అక్కా చూసివద్దాం" అన్నాడు అపూ.

ఇద్దరూ నవాబ్‌గంజ్ రోడ్డుఎక్కి, ఎంతోసేపు చూస్తూ నుంచున్నారు. "అబ్బా! చాలాదూరమల్లే ఉందిరా, వెడదామా—" అన్నది వాళ్ళ అక్క "ఏమీ కన్పించటమే లేదు. అంతదూరం వెడితే మళ్లీ ఎలా తిరిగి రావటం?" వాడి చూపుమాత్రం అక్కడే ఉంది. వెళ్లాలని ఆశగానూ ఉంది. మళ్లీ భయ భయంగానూ ఉంది. హఠాత్తుగా వాళ్ల అక్క తెంపరితనం తెచ్చుకుని "పదరా అపూ చూసివద్దాం, ఆఁ ఎంతదూరం ఉంటుంది లెద్దూ మహా? మళ్లీ మధ్యాహ్నానికల్లా తిరిగి రావొచ్చు. ఇప్పుడే బహుశా రైలుకూడా వస్తుందేమో ఈ వేళ. ఇప్పుడు-అమ్మతో దూడని వెతకటం ఆలస్యమయిందని చెప్పవచ్చునులే—"అన్నది.

తమను ఎవరైనా కనిపెట్టి చూస్తున్నారేమో అని మొదట్లో వాళ్లు కాసేపు అటూ యిటూ చూశారు. తర్వాత రోడ్డుదిగి, ఆమిట్ట మధ్యాహ్నం ఎండలో అక్కా తమ్ముడూ ఇద్దరూ - మైదానంలో పల్లంలో నిలిచిన నీళ్లు దాటి; తిన్నగా దక్షిణపువైపుగా గబగబా నడవటం మొదలెట్టారు. పరుగు, పరుగు, ఒకటే పరుగు. నవాబ్‌గంజ్ ఎర్రదుమ్ము రోడ్డు అప్పుడే చాలా దూరం వెనకపడిపోయింది. ఇటు చలివేంద్ర, అటు గొర్రెల బీడు, ముసలమ్మ చెరువు- ఒక్కటొక్కటే వెనక్కి జారిపోతున్నాయి. ఎదుట ఓ చిన్న నీటి మడుగు కన్పిస్తోంది. వాళ్లఅక్క నవ్వుతూ వాడికేసిచూసి, "అమ్మకి కనుక తెలిసిందంటే—వీపుతాట ఒలిచేస్తుంది" అన్నది. అపూ ఓ మాటు నవ్వాడు. తెగింపుతో కూడిన నవ్వు అది! మళ్ళీ పరుగు మొదలెట్టారు- జీవితంలో స్వేచ్ఛగా, అవాంతరాలేమీ లేకుండా ఇవాళే మొదటిసారిగా తెగించుకుని పోతున్నామన్న ఉత్సాహంలో, వాళ్ల దుడుకురక్తం వాళ్లకి పైకం క్రమిస్తోంది. తర్వాత ఏమవుతుంది అన్న సంగతి ఆలోచించే అవకాశం ఏదీ!

తర్వాత జరిగినదంతా సలక్షణంగా జరగలేదు. కాస్తదూరం వెళ్లేసరికి నీటిపల్లం అడ్డువచ్చింది. అదంతా తుంగదుబ్బులు, తూటికాడలమయం. దానికి తోడు దుర్గ దారితప్పింది-కనుచూపు మేరలో ఎక్కడా ఉన్నట్టే కన్పించలేదు. చుట్టూ అన్నీ మాగాని చేలు, నీటిపల్లాలు, తుంగ దుబ్బులు. దట్టంగా ఉన్న ఆ దుబ్బుల్లోంచి వెళ్లటానికి తోవ కన్పించటంలేదు. బురదలో కాళ్లు కూరుకుపోతున్నాయి. చలికాలమయినా వాళ్ళకి చెమటలు కారుతున్నాయి. బాగా బాగా ఎండ ఎక్కిపోయింది. అక్క కట్టుకున్న లంగా ముళ్ల చెట్లకుపట్టుకుని వాలిందైంది. కాళ్ళల్లో రెండుమూడుసార్లు ముళ్లు విరిగాయి. వాటి నెలాగో చాకా పిన్నీసుతో కుట్టి పైకిలాగింది. అక్క చివరకు రైలు దారిమాట దేవుడెరుగు, అసలు మళ్ళీ ఇంటికి తిరిగి రావటమే చాలా కష్టమైంది. చాలా దూరంవచ్చేశారు. నవాబ్‌గంజ్ రోడ్డుకూడా కన్పించటం లేదిప్పుడు. ఆ నీళ్లుదాటి, పంటచేలుదాటి, ఎలాగో చచ్చిచెడి మళ్లీ మామూలు రోడ్డుమీదికి వచ్చేసరికి నడినెత్తిమీదికి వచ్చింది పొద్దు. ఇంటికి వచ్చాకవాళ్ళ అక్క అవీ యివీ బోలెడు అబద్ధాలు చెప్పి తమ ఇద్దరి వీపులు కాపాడింది ఆ నాటికి.

ఆ రైలుదారి ఇవాళ అన్ని తిప్పలు లేకుండానే ఎదుటపడుతుంది. దానికోసం పరుగులెత్తనక్కర్లేదు. దారి తప్ప నక్కర్లేదు, తిట్లు తినక్కర్లేదు...కొంచెం దూరం పోయాక విస్తుపోయి చూశాడు అపూ—నవాబ్ గంజ్ రోడ్డులాగా ఎత్తైనరోడ్డు ఒకటి మైదానాన్ని మధ్యగా చీల్చుకుంటూ చాలా దూరంపోయింది. రోడ్డు పొడుగునా రాళ్ళముక్కలు పేర్చినట్లు పోసిఉన్నాయి. నల్లటి ఇనుపస్తంభాలపైన ఏవో చాలా త్రాళ్లు లాగి కట్టి ఉన్నాయి. కనుచూపు మేరవరకు ఆ స్తంభాలలా పాతిఉన్నాయి. వాటిపైన లాగి కట్టిన త్రాళ్ళూ కన్పిస్తున్నాయి.

"అదుగో చూడరా, రైలురోడ్డు" అన్నాడు వాళ్లనాన్న.

అపూ ఒక్కపరుగులో గేట్ దాటి రోడ్డు మీదికెక్కాడు. ఎక్కినతర్వాత అటూ యిటూ అలాగే విస్తుపోయి చూస్తూ నుంచున్నాడు. రెండు ఇనుపబద్దెలు పొడుగ్గా వేసి ఉన్నాయి ఎందుకు? వాటిమీదనుంచి వెడుతుందా రైలు? ఎందుకు? ఒట్టి నేలమీది నుంచి కాకుండా ఇనుపబద్దీలమీదినుంచి వెళ్ళటం దేనికి? జారిపడిపోదూ? ఎందుకు పడిపోదూ? వాటిని తంతి స్తంభాలంటారా? వాటిమధ్య హోయ్‌మని ఆ చప్పుడేమిటి? తంతులమీదుగా వార్తలు వెడుతున్నాయా?

ఎవరు పంపిస్తున్నారో వార్తలు! ఎలా పంపిస్తారో: అటువైపునా స్టేషన్? ఏం స్టేషనో అది!

"ఎప్పుడు వస్తుంది నాన్నా రైలు? నేను చూడాలి—" అన్నాడు అపూ.

"రైలిప్పుడెలా చూస్తావురా? మధ్యాహ్నమెప్పుడో వస్తుంది. ఇంకా రెండు గంటలాలస్యం ఉంది"

"ఉంటే ఉందిలే నాన్నా! చూసే వెడదాం. నే నెప్పుడూ చూడలేదుగా మరి! ఏం నాన్నా? ఊఁ—ఊఁ—"


రాజా సులోచన సౌందర్యసూచనలు :
"మీ చర్మమును మృదువుగాను మరియు మనోహరముగాను వుంచుకొనుటకు...
"లక్స్ టాయ్‌లెట్ సబ్బు యొక్క మీగడవంటి నురగతో బాగా రుద్దుడు — అది ఎంతో పరిమళ మైనది.
తరువాత కడిగివేసి తుడుచు కొనుడు — మీరు ఎంతో హాయిగా నుందురు.
"శరీరమంతటి సౌందర్యము కొరకు పెద్దసైజు సబ్బును వుపయోగించుడు — నేను చేయుచున్నట్లు."
రాజా సులోచన
తెలుపుకు మరియు
శుద్ధతకు
లక్స్
టాయ్‌లెట్ సబ్బును
కోరుకొనును
LUX
TOILET SOAP
సినీమా తారలకు సౌందర్యమునిచ్చు
శుద్ధమైన తెల్లని సబ్బు
భారతదేశంలో తయారుచేయబడినది
LTS. 476-X52 TL

★ పథేర్ పాంచాలి ★

"అలా గుణవదు. ఇందుకే నిన్నెప్పుడూ ఎక్కడికీ తీసుకురానిది! ఇప్పుడెలా చూస్తావ్? మధ్యాహ్నం ఒంటిగంటదాకా ఈ మండు టెండలో కూర్చుందామంటావా ఇక్కడ? చాల్చాల్లే, పద. మళ్ళీవచ్చేప్పుడు చూడొచ్చులే"

చివరికి కంటికి కుంచెడు నీళ్ళు తెచ్చుకుని, అపూ తండ్రి వెనుకే ముందుకు సాగి వెళ్ళక తప్పలేదు.

—నువ్వు వెళ్ళిపోతున్నావ్. నీకు తెలియదు కాని, దారిప్రక్కల కంటపడుతున్న వాటినన్నిటినీ విశ్వాన్నంతనీ గ్రహించాలనే ఆబతో ఉన్న నీ ఆలిచిప్పల్లాంటి కళ్ళు-గ్రసిస్తూనే పోతున్నాయి. నీ ఆనందాన్ని బట్టి చూస్తే నువ్వో ఒక నూతన దేశాన్ని కనుక్కున్నట్లే. తెలియని ఆనందంలో తేలిపోవాలంటే, పృథివి అంతా చుట్టి రావాల్సిందే! అర్థం ఉండక్కర్లా ఆ తిరగటానికి! నేనిదివరకెన్నడూ రానిచోటుకి, ఇప్పుడే క్రొత్తగా అడుగుపెట్టిన చోటుకి, నా శరీరానికి క్రొత్త గాలులు పోసుతున్న చోటుకి, నాకంటె ముందు ఇదివరకెవరైనా వచ్చారా లేదా అన్న సంగతి నాకెందుకు? నేనిప్పుడే మొట్టమొదటి సారిగా దైహికంగా, మానసికంగా దాని నూతనత్వాన్ని ఆస్వాదిస్తున్నప్పుడు!

"అమ్‌డోబ్!"—కేవలం రైతులుండే కుగ్రామం. ఎలాంటి పేరు! ఆడవాళ్లు ధాన్యపు కంకులు కోస్తున్నారు. మేకల్ని కట్టేస్తున్నారు. కోళ్లు ముందు గింజలు చల్లుతున్నారు. పెద్దవాళ్లు జనపనార ఎండేస్తున్నారు. పెదుళ్లునలుకుతున్నారు. చూస్తుండగానే ఊరుదాటిపోయింది—మళ్ళీ అంతా మైదానం......గుంటల్లో, దొరువుల్లో నీళ్లు మిలమిల లాడుతున్నాయి. చేలల్లో కొంగలు ఒంటికాలిమీద నుంచుని జపాలు చేస్తున్నాయి. తామరాకులు, తామరపూలు ఒత్తుగా ఉండటంతో నీళ్లు కన్పించటం లేదు....

*　　*　　*

'ఖల్ సేమారి' దొరువు ప్రాంతాల పచ్చని చేలపైని వినీలాకాశం-వర్షంతో కడిగేసినట్లు స్వచ్ఛంగా కన్పిస్తోంది. చక్రవాల మంతటా అస్తమిస్తున్న సూర్యుని అపురూప కాంతులు అలముకున్నాయి. చిత్రవిచిత్రకాంతుల మేఘ పర్వతాలు, మేఘ ద్వీపాలు, మేఘ సముద్రాలు, మేఘాల్లోని స్వప్ననగరాలు—విశాల వినీలాకాశంతోటి ఇంత సన్నిహితపరిచయం వాడికింతవరకెప్పుడూ కలగలేదు. మైదానాని కవతలి సుదూరదేశం — ఎనిమిదేళ్ల బాలునిముందు ఇవాళ తన మేలిముసుగును తొలిగించుకుంది.

నడక గబగబా సాగటం లేదు— "నువ్వొట్టి అయోమయానివిరా! ఏది కన్పిస్తే దానికేసే అలా నోరు తెరుచుకుని చూస్తావెందుకు? గబగబానడు' అన్నాడు తండ్రి.

సాయంత్రానికి వారు గమ్యస్థానానికి చేరుకున్నారు.

శిష్యునిపేరు లక్ష్మణ్ మహాజన్. పెద్ద భూస్వామి, మంచి స్థితిమంతుడు. ముందున్న పెద్ద ఎనిమిదిదూలాల చావడిలో సగౌరవంగా వారికి వసతి ఏర్పాటుచేశాడు.

లక్ష్మణ్ మహాజన్ మరదలు ప్రొద్దున్నే స్నానానికని చెరువుకువెళ్లింది. చెరువులో దిగుతూ ఆమె అలాచూసేసరికి, ఒడ్డున అరటితోటలో, అపరిచితుడైన కుర్రవాడొకడు, వెదురుచువ్వ ఒకటి చేతపట్టుకుని, తనలో తాను ఏదో గొణుక్కుంటూ అటూయిటూ తిరుగుతూండటం కంటపడింది... ఆమె బిందె అక్కడపెట్టి, దగ్గరకు వచ్చి, "నువ్వు ఎవరింటికి వచ్చావ్ అబ్బాయీ?" అని అడిగింది.

అపూకి తల్లిదగ్గర ఎంతగారాబమో, బయటికి వస్తే అంత ముఖబిడియం.'

ముందు అసలు అక్కడినుంచి పారిపోదామనే ఆలోచనవచ్చింది వాడికి. తర్వాత సంకోచిస్తూ— "అదుగో వాళ్లింటికి—" అని మాత్రం అన్నాడు. "మా బావగారింటికా? మా బావగారి గురువుగారి అబ్బాయివా? ఓ!" అన్నాదామె.

ఆమె అపూని తనవెంట ఇంటికి తీసుకువెళ్లింది. వాళ్ల ఇల్లు వేరు. లక్ష్మణ్ మహాజన్ ఇంటికి రవంతదూరమే. కాని మధ్యలో చెరువు ఒకటి అడ్డం.

ఆమె చూపిన ఆదరణతో అపూ బిడియం కొంత ఎగిరిపోయింది. వాడు ఇంట్లోకి వెళ్లగానే అక్కడున్న సామానుల్ని వాటినీ అదేపనిగా చూడసాగాడు. అరె! ఎన్నెన్ని రకాల వస్తువులున్నాయి!... వాళ్లయింట్లో ఇలాటి వేమీ లేవు. వీళ్లు చాలా భాగ్యవంతులల్లే ఉంది! రంగు రంగుల కాగితాల గొలుసులు, బుట్టలు, ఊలుతో చేసిన పక్షులు, గాజుబొమ్మలు, మట్టిబొమ్మలు, ఇంకా ఎన్నో ఉన్నాయి. వాడు భయపడుతూ-భయపడుతునే ఒకటి రెండు వస్తువుల్ని తాకి, కదిలించిచూశాడు.

ఆమె ఇంతవరకు కుర్రవాడి ముఖంకేసి పరీక్షగా చూడలేదు. బాగా దగ్గరగా చూస్తే వాడింకా పసివాడనిపిస్తుంది. అయిదేళ్ల కుర్రాడి ముఖమంత లేతముఖం. ఆ కళ్లల్లో కన్పించే అంత అందం-అమాయకత్వం ఆమె ఇంతవరకు ఏ పిల్లల కళ్లలోనూ చూడలేదు. ఆ ఒంటిచాయ, ఆ అవయవపుష్టి ఆ అందమైన ముఖం, తీర్చిదిద్దినట్లుండి, అమాయకత్వం ఉట్టిపడే ఆ చారెడేసి కళ్లు - చూస్తున్న కొద్దీ ముక్కూ మొహం ఎరుగని ఆ కుర్రవాడిమీద మమకారం కలిగిందామెకి.

అపూ దగ్గరకువచ్చి కూర్చుని చాలా కథలు చెప్పాడు. అన్నిటికన్నా నిన్న తాను రైలురోడ్డు చూడటాన్ని ఘనంగా వర్ణించిచెప్పాడు. కాసేపయాక ఆమె 'మోహన్‌భోగ్' చేసి, ఓ గిన్నెతో కొంత తీసుకువచ్చి పెట్టింది. వ్రేలితో నొక్కితే నెయ్యి ఓడుతోంది. అపూ కొంతతీసి నోట్లో పెట్టుకుని ఆశ్చర్యపోయాడు. ఇంత వ్రగా ఉన్నది తానెన్నడూ తిని యెరుగడు. మోహన్‌భోగ్‌లో కిస్‌మిస్ పళ్లు వేస్తారా? అమ్మ చేసినపుడెప్పుడూ వెయ్యదే! 'నాకు మోహన్‌భోగ్ చేసిపెడతావా పెట్టవా?' అని తల్లిదగ్గిర మారాంచేసేవాడు తాను. 'అలాగే ఆనక చేసిపెడతానులే' అని వాళ్లమ్మనవ్వుతూ తర్వాత కొంత గోధుమపిండి నీళ్ళలో కలిపి, అందులో కొంత బెల్లంకూడా వేసి లేహ్యంలా తయారుచేసి, ఓ మట్టి గిన్నెలో ఆప్యాయంగాతీసుకువచ్చి పెట్టేది. అపూ ఇన్నాళ్లనుంచీ దాన్నే యెంతో లొట్టలేసుకుంటూ తింటూవచ్చాడు. కాని మోహన్‌భోగ్ ఇలా ఉంటుందని అపూ ఎన్నడూ ఊహించనే లేదు. ఈ మోహన్‌భోగ్‌కీ తల్లి చేసిపెట్టేదానికీ చాలా తేడా ఉన్నదని అనుకున్నాడు. దాంతో తల్లిమీద ఒక రకమైన జాలికూడా కల్గింది వాడికి. మోహన్‌భోగ్ ఇలాకూడా చెయ్యవచ్చునని ఒకవేళ అమ్మకి తెలియదేమో! 'మా అమ్మ మేమూ ఏమీ లేని వాళ్ళం!— అందుకనే మాయింట్లో మంచి తినుబండారాలేమీ ఉండవు' అని లీలగా తట్టింది వాడి లేత మనస్సుకి......

ఒకనాడు పొరుగున ఉన్న బ్రాహ్మల యింటికి అపూని భోజనానికి పిలిచారు. మధ్యాహ్నం—వాళ్ళ యింట్లో అమ్మాయి వచ్చి అపూని వెంటపెట్టుకు తీసుకువెళ్లింది. వాళ్ళ వంటయింటి వసారాలో చక్కగా పీటవేసి, కాసినినీళ్లు చిలకరించి స్థలం బాగుచేసి, అక్కడ వడ్డించారు వాడికి. అపూని పిలవటానికి వచ్చిన అమ్మాయిపేరు అమల. మంచి చాయ, పెద్ద పెద్ద కళ్లు, చక్కటి ముఖం—వాళ్ళ అక్కలాగే ఉంటుంది. ఆ అమ్మాయికి, అమల తల్లి దగ్గర కూర్చుని కావలసినవన్నీ అడిగి వడ్డించింది—ఆవిడ స్వయంగా యింట్లో చేసిన 'చంద్రపులి' కూడా పెట్టింది. భోజనమయాక అమల వాణ్ని ఇంటికి తీసుకువెళ్ళి దిగబెట్టింది. ఆ రోజున సాయంత్రం ఆడుకుంటూ ఆడుకుంటూండగా వాడి కాలు వెదురుపంగలో

విరుక్కుని బొటనవ్రేలు చీరుకుపోయి నెత్తురొచ్చింది. అమల పరుగెత్తుకొనివచ్చి కాలు వెదురు పంగలోంచి తప్పించబోయేసరికే చీరుకుపోయిందసలు. అప్పూ నడవలేక పోయాడు. అమల వాడిని ఎత్తుకుని వడ్లపురి ప్రక్కన ఏవో ఆకులు తెచ్చి నూరి అప్పూ వ్రేలికి కట్టుకట్టింది. తండ్రి ఎక్కడ కేక లేస్తాడో అన్న భయంతో అప్పూ ఆ సంగతి ఎవరికీ చెప్పలేదు.

ఆ రోజు రాత్రి అమలే కలలో కనిపించింది—తనని అమల ఎత్తుకున్నట్లు, తాను అమలదగ్గిరే కూర్చున్నట్లు, అమలతో పేకాడుకున్నట్లు, అమల తన కాలివ్రేలికి కట్టు కట్టినట్లు, అమల తనతో కూడా గొలుకట్టుకు వచ్చినట్లు—వచ్చింది కల. నవ్వు తొణికిసలాడే అమల కళ్ళు, ముఖం, రాత్రంతా నిద్రలో తనచెంతనే ఉన్నాయి. తెల్లవారగానే అమల తనదగ్గిర కెప్పుడు వస్తుందా అని చూస్తూ కూచున్నాడు. తక్కిన పిల్లలంతా వచ్చారు, ఆటలు మొదలెట్టారు. ఎంత ప్రొద్దెక్కినా అమల మాత్రం అయిపు లేదు. లోపల్నుంచి 'ఇంటావిడ' చిరుతిండి పెట్టడానికి పిలిచింది. ఆ చిరుతిండి తినేశాక 'ప్రొద్దున్నే అమలా దీదీ వచ్చిందా?' అని అడిగాడు ఆమెని. ఊహూఁ. ఆ పిల్ల రాలేదు: ఇంకా బాగా ప్రొద్దెక్కేసరికల్లా ఆటలు కట్టిపెట్టారు. తండ్రి తనని స్నానానికి రమ్మని పిలిచాడు. అప్పటికే అమల ఏమైనట్లు?

వాడి కిహ అభిమానం పొడుచుకు వచ్చింది. పోదూ, రాకపోతే మానే. ఇంకెప్పుడొచ్చినా తాను ఆఅమ్మాయితో మాట్లాడితే ఒట్టు—అనుకున్నాడు.

మళ్ళీ సాయంకాలం కూడా ఆడుకోటానికి అందరూ వచ్చారు—కాని అమల మాత్రం రాలేదు. అయిదారుగురు పిల్లలు ఉన్నా, తాను ఎవరితో ఆడుకోవటం అన్న ఆలోచన వచ్చింది అప్పూకి. వాళ్ళలో ఎవరూ తనతో ఆడుకోటానికి తగినవాళ్లుగా తోచలేదు వాడి మనస్సుకి. మండకొడిగా కాసేపు ఏదో ఆగాడు, కాని అప్పటికీ రాలేదమల.

మర్నాడు ప్రొద్దున అమల వచ్చింది. అప్పూ ఏంమాట్లాడలేదు. అమల కూచున్న చాయలకు కూడా పోలేదసలు. అయినా మధ్య మధ్య తాను కోపం వచ్చి యిలా చేస్తున్నాడన్న సంగతి గ్రహించిందా లేదా అన్నట్లు-ఆ అమ్మాయికేసి ఓరకంట పరిశీలనగా చూశాడు. అమల మొదట్లో నిజంగానే గ్రహించలేదు. కాని తర్వాత వీడి ధోరణి చిత్రంగా కనపడింది. దగ్గిరకు వచ్చి "ఏం, అబ్బాయ్? నాతో మాట్లాడవేం? ఎందుకని?" అని అడిగింది.

అప్పూకి అభిమానంతో కళ్లనీళ్ల పర్యంతమైంది. "ఎందుకనా? ఇంకా ఎందుకని అడుగుతున్నావా? నిన్న ఎందుకు రాలేదు?" అని అడిగాడు.

అమల తెల్లబోయింది. "రాలేదూ? రాకపోతే? అందుకని కోపం తెచ్చుకున్నావా?" అని అడిగింది. అవునన్నట్లు అప్పూ బుర్ర ఊపాడు. అమల కిలకిల నవ్వుతూ అప్పూ చెయ్యిపట్టుకుని లోపలకు తీసుకెళ్ళింది. అక్కడ ఆ ఇంటావిడ మొదట అంతా విని నవ్వు పట్టలేకపోయింది. తర్వాత నవ్వు బయటపడకుండా నోటికి చెయ్యి అడ్డు పెట్టుకుని, "అయితే అమలా, నువ్వింక ఇంటికెల్లా వెడతావ్? ఆ అబ్బాయి నిన్ను విడిచిపెట్టలేడుగా! ఇక్కడే ఉండిపో. లేదా -"

ఆవిడ మాటలకి అమల అదోలా సిగ్గుపడుతూ. "ఏ. పోవదినా! అలాంటి మాటలన్నావంటే ఇహ ఎప్పుడూ నేను మీ ఇంటికి-"

కాసేపయాక అప్పూ అమలతో కూడా వాళ్ళింటికి వెళ్ళాడు. అమల వాళ్ళ అలమర తెరిచి, గాజుది ఓ పెద్ద దొరసాని బొమ్మ, మెనపుది ఒక పక్షిబొమ్మ, ఇంకా ఎన్నో బొమ్మలు చూపించింది. అవి కాళీగంజ్ తిరునాళ్లకి వెళ్ళినప్పుడు కొనుక్కున్నవట. అప్పూ అడిగితే చెప్పింది. క్రొత్త రకపు ఆటవస్తువుల్లో-రబ్బరుకోతి ఒకటి-ఎటు వైపునించి చూసినా మనవైపే తిరిగి గ్రుడ్లు మిటకరిస్తున్నట్లుంటుంటది. మరొక బొమ్మ ఏదో ఉంది. దాని పొట్ట నొక్కితే మూర్ఛల రోగిలా కాళ్ళూ చేతులూ గిలగిల తన్నుకుని, కంజరీ వాయించటం మొదలెడుతుంది. అన్నిటికంటె ఆశ్చర్యకరమైన బొమ్మ రేకుతో చేసిన గుర్రం. రాణూవాళ్ళ భాబాయిగారి గోడగడియారానికి 'కీ' ఇచ్చినట్లు 'కీ' ఇచ్చి వదిలేస్తే అది మామూలు గుర్రంలాగానే క్రింద పరుగెడుతుంది. అది చూసి అప్పూ విస్తుపోయాడు. దాన్ని చేత్తో పట్టుకుని ఆశ్చర్యంతో అటూ ఇటూ త్రిప్పిచూసి, అమలకేసి చూస్తూ, "ఏం గుర్రం ఇది? భలేబాగుందే! ఎక్కడ కొన్నావ్ దీన్ని? ఎంతకి కొన్నావ్?" అని అడిగాడు.

అమలతో కూడా మళ్లీ ఇంటికి తిరిగివస్తూ అక్కకిలాంటి బొమ్మలేవీ లేనేలేవు పాపం; ఏవో ఆకాయలూ, ఈకాయలూ చెట్లక్రింద ఏరుకుని తీసుకువస్తుంది. వాళ్లబొమ్మలూ, వాళ్లబొమ్మలూ ఎత్తుకువచ్చి దెబ్బలుతింటూ ఉంటుంది! తన అక్క ఈడు అమ్మాయిలకందరికీ ఇన్నిన్ని ఆటవస్తువు లుంటాయనే ఎరుగడు. వాళ్ల ఆటవస్తువులకీ, అక్క ఆటవస్తువులకీ ఉన్న తారతమ్యం చూస్తూంటే అక్కమీద ఎక్కడలేని జాలీ పుట్టుకొచ్చింది వాడికి. తనదగ్గిర డబ్బుంటే అక్కకొక మరగుర్రం కొనిపెట్టాలి, రబ్బరు కోతికూడా ఒకటి కొనిపెట్టాలి. అది మనం ఎటుతిరిగితే అటువైపే గ్రుడ్లు మిటకరించి చూస్తూఉంటుంది. అనుకున్నాడు.

ఆ ఇంటావిడదగ్గర ఒక పాతపేక ఉంది. దాన్ని నిజానికి ఒకేపేక అనటానికి వీల్లేదు. ఎన్నిపేకల్లోనుంచో తీసిపారేసిన ముక్కలన్నిటినీ చేర్చి,ఒకపేకగా తయారుచేసినదది. అప్పూ అప్పుడప్పుడు ఆ పేకముక్కల్ని అటూ యిటూ తిరగేస్తూ ఉండేవాడు. రాణూదీ వాళ్లయింట్లో మధ్యాహ్నమప్పుడు ఎప్పుడైనా పేకాట ఆడుతూండటం కద్దు. అప్పూ ఊరికే ప్రక్కనకూర్చుని చూస్తూండేవాడు- ఆసు, రాజు, రాణి, జాని ముక్కలతో కోతపైకోతలతో జరిగే ఆట - భలే బాగుంటుంది అది! వాడికి పేకాట చేత కాదు. వాడికేకాదు, వాళ్లఅక్కకి, అమ్మకీ ఎవరికీ చేతకాదు. అయినా అప్పుడప్పుడు వాళ్లమ్మ ఆడటానికి వెళ్లేది, కాని ఆమెతో కలిసి ఆడటానికెవరూ ఇష్టపడేవారు కారు. ఆమెకేమీ చేతకాదనే వారందరూ. కాసేపయేసరికల్లా ఆమె ఓడిపోతూఉండేది. 'అదేమిటమ్మా? ఆసునిపెట్టి కోశావెందుకిప్పుడు? అక్కడ 'మీ చెయ్యి' రాజుని పెట్టి కోయటం' చూడలేదా? నీ కళ్లముందేగా! అనేవాళ్లెందరో. వాళ్లమ్మ తన తెలివి తక్కువను కప్పిపుచ్చుకోటానికి నవ్వుతూ 'అలాగా' చాలా పొరపాటయిందే! నేనది చూడనేలేదమ్మా వదినా! అనేది. మళ్లీ ఎవరికి ఏముక్క లుపడింది తనకు తెలుసునన్నంత ఆరిందాగా వచ్చి ఆటలో కూర్చుని, ఈసారి అయినా నెగ్గకపోతే వీల్లేదన్నంత ధీమాగా ఆడబోయేది. కాని కాసేపటికల్లా ఆటలో కూర్చున్న వారిలో ఎవరో ఒకరు "అదేమిటమ్మా, అలా చేశావేమిటి మళ్ళీ? నీదగ్గిర *'దాసు' ఉన్నట్లు చూపించావు కావేం మరి?" అని అడిగేవాళ్లు. వాళ్ళమ్మ పెద్ద తెలిసినదానిలా


* ఒకేరంగు వరస మూడుముక్కలుంటే 'దాసు!'

★ పథేర్ పాంచాలీ ★

నవ్వుతూ—"ఉందిలే, ఉంది. దానికొక తిరకాసుందిలే. అందుకని బుద్ధిపూర్వకంగానే చూపించలేదు" అనేది. కాని నిజానికి అసలు 'దాడు' అని దేన్నంటారో ఆమెకి తెలియదు. ఆమెపక్కన కూర్చుని ఆతే రెండో ఆవిడ "అందులో యింకా తిరకాసేమిటె నీ మొహం, నా మొహం. విక్షేపంలాంటి ఆట కాస్తా చెడకొట్టావు. ఆ ముక్కలు చిన్నవదిన కిచ్చెయ్. ఇంక నీతో కూర్చుని నేనుమాత్రం ఆడను. చాలు యిహ" అని కోప్పడేది. వాళ్ళ అమ్మ ఆ అవమానాన్ని కప్పిపుచ్చుకోటానికి—అసలేమీ జరగనట్లు, వాళ్ళు ఊరికే తమాషాకి తనని ఇలా అంటున్నట్లుగానే భావించుకుని చిరునవ్వు నవ్వేది.

తాను ఎక్కడైనా ఓ సేక సంపాయించుకుని వస్తే తాను, అమ్మ, అక్క కూర్చుని ఆడుకునేవాళ్లు. భోజనాలూ అవీ అయాక మధ్యాహ్నమప్పుడు తమ యింట్లోనే అడవి వైపున వున్న కిటికీదగ్గిర కూర్చునేవాళ్ళు. ఆ కిటికీ తలుపులు ప్రసుగులు తొలచటంతో తూట్లుపడి కరిలి సేచాలు కిర కిరలాడుతూ కింపపడేట్లుంటాయి. ఆ పాత తలుపు చెక్కలు పుచ్చిన వాసనకొడుతూ ఉంటాయి. కిటికీప్రక్కనున్న అడవిలోంచి తీగెసంపంగి వాసనలు గుప్పున వస్తూంటాయి. కటకటాలలోని కొరుగన్ని పొదలమీదికి అక్కకి పరిచితమైన ఆ పక్షి పిట్టవచ్చి వాలుతూ, ఎగిరిపోతూ వుంటుంది. సందడిలేకుండా వుండే ఆ మధ్యాహ్నమప్పుడు ఆ కిటికీప్రక్కన చాపవేసుకు కూర్చుని వాళ్ళు ముగ్గురూ ఆడుకుంటూ వుంటారు. 'దాడు' అని దేన్నంటారో 'ఇస్తోపు' అని దేన్నంటారో వాళ్ళకి తెలియకపోతే యేం! వాళ్ళ ఆటలో అలాంటివి చూపించకపోయినా చెల్లుతుంది. అంతమాత్రాన వాళ్ళెవరూ ఆటలోంచి లేచి పొమ్మనరు. ఎవ్వరూ అవమానంగా మాట్లాడరు. ఎవరూ ఆక్షేపించరు. వాళ్ళకి చేతనయినట్లు ఆడుకుంటూ వుండేవాళ్లు.

రాత్రికి లక్ష్మణ్ మురదలు అపూని భోజనానికి పిలిచింది. భోజనం ముందు కూర్చుని వడ్డించిన ఆ పదార్థాలన్నీ చూసి విస్తుపోయాడు అపూ. ఓ చిన్న ఆకులో విడిగా ఉప్పు, నిమ్మకాయడిప్ప ఎందుకు పెట్టారు? అమ్మ వాటిని విస్తట్లోనే వేస్తా వుంటుంది. ఒక్కొక్క కూరకి ఒకొక చిన్న పళ్లెం. అబ్బ! ఎన్ని కూరలో! ఆ చేపల కూరంతా తనకేనా!



అరె! పూరీలు! పూరీలు! వాడికీ, వాళ్ల అక్కకీ కలలకనే ఏకల్పితకథల దేశాలో లీలగా కన్పిస్తాయి...పగలూ—రాత్రిళ్లూ యెప్పుడూ ఏ అడవిదుంపల కూరో, ఏ సారకాయఇగురో తింటూఉంటే-చిరుతిండి లేకుండా గడపవలసివచ్చే ఉదయ-సాయం వేళల్లో వాళ్ల మనస్సులు యాదాలాపంగా ఎక్కడికో పరుగెత్తేవి—మధ్యాహ్నం ఎండవేళ తమ వీధిలోని వంటవాడు వీరురాయ్ పైనవేసుకున్న అంగవస్త్రంతో విసురుకుంటూ, కొత్తిగా పొయ్యిపెట్టి, పెద్ద బూరెల మూకుడునిండా నెయ్యిపోసి దానిమీద కెక్కించి పూరీలు వండుతూ కూర్చుంటేచోటికి పరుగెత్తేవి. కమ్మటి పూరీలు ఘుమఘుమ వాసనకొడుతూ ఉంటాయి. ఎంతోమంది ఆడపిల్లలు, మగపిల్లలు మంచిమంచి బట్టలు కట్టుకుని అక్కడికి వస్తూ, పోతూంటారు. గంగూలీగారింట్లో భజనమందిరాన్ని—ఆలివ్ చెట్లున్న తోటను కలుపుతూ మందువేసవి కాలంలో పందిరేస్తూ ఉంటారు. ఏడాదికి ఒక్కసారి అదయినా—చైత్రమాసంలో శ్రీరామనవమి వెళ్లాక 'డోలా' ఉత్సవం వస్తుందే అప్పుడు...ఆ రోజున తమ అందరికీ ఆ గంగూలీగారింట భోజనాలుంటాయి. కాని లేవని తలంపుగా ఆ సుదినం ఇవాళ ఎలా వచ్చింది? అన్నంముందర కూర్చుంటే వాటికి మాటిమాటికీ—'పాపం, మా అక్క ఇలాంటివన్నీ యెన్నడూ తిని యెరుగదు కదా' అని అనిపించసాగింది.

మర్నాడుఉదయం మళ్లీ ఆటలు మొదలెట్టారు. అమల రాగానే అపూ పరుగెత్తుకుంటూవెళ్లి, చెయ్యి పట్టుకుని, "నేను, అమలాదీ ఒకటి, మీరంతా ఒకటి" అన్నాడు.

కొంచెంసేపయేసరికల్లా, అమల తనతో బదులు విశూతో కలిసి ఆడితేనే బాగుంటు ననుకుంటోందని అపూ కనిపెట్టేశాడు. దానికి అసలు కారణం ఏమిటో వాడికి తెలియదు. అపూ ఆటలంత బాగా చేతయినవాడు కాదు. వాడిని తనపక్షాన ఉంచుకోవటం అంటే ఓటమి తెచ్చుకోవటమే. విశూ చాలా తెగింపు కలవాడు. వాడిని పరుగెత్తిపట్టుకోవటంఅన్నా, ఆటల్లో ఓడించటమన్నా మాటలుకాదు. అమల ఒకసారి స్పష్టంగానే విసుక్కుంది. తాను ఎలాగైనాసరే గెలిచి, అమలని సంతృప్తి పరచటానికి అపూ విశ్వప్రయత్నం చేశాడు. కాని ఎంత ప్రయత్నించినా మళ్లీ ఓడిపోయాడు.

మళ్ళీ వాళ్లు జట్లుజట్లుగా విడిపోయేప్పుడు అమల విశూవైపుకు మొగ్గింది.

అపూకి కళ్లనీళ్ల పర్యంతమయింది. ఆటంటేనే వాడికి హఠాత్తుగా వెగటు పుట్టుకొచ్చింది. ఆ విశూతో మలనవ్వుతూ పేలుతూ చక్కగా మాట్లాడేస్తోంది. కొంచెంసేపయాక విశూ ఎందుకో ఇంటికి వెడతాననగానే, 'మళ్ళీ తప్పకుండా రావాలిసుమా!' అని అమల మరీమరీ చెప్పింది. అపూ కెక్కడలేని ఓర్వలేనితనమూ వచ్చింది. 'విశూ ఆట వదిలి వెళ్లిపోతే ఆ వాళ్ళలో ఒకరు తక్కువైపోతారు. అందుకని అమలాదీ అలా అన్నది. నేను వెడతానంటే నన్నూ అలాగే ఉండమంటుంది. అంతకంటెకూడా ఎక్కువగా అంటుంది' అని అనుకున్నాడు అపూ. చటుక్కున తాను వెళ్లిపోతున్నట్లు నటిస్తూ "పొద్దెక్కుతోంది. నేను వెడతాను. వెళ్లి నీళ్లు పోసుకోవాలి" అన్నాడు. అమల ఏమీ అనలేదు. కంచరివాళ్ళబ్బాయి వాడూ గోపాల్ మాత్రం "మళ్ళీ సాయంత్రం రాతమ్ముడూ" అన్నాడు.

అపూ కొంతదూరం వెళ్లి వెనక్కి తిరిగి చూశాడు. తాను వెళ్లిపోవటం ఎవరికీ వెలితిగా యేంఉన్నట్లులేదు. మాంచిజోరుగా ఆడుకుంటున్నారందరూ. అమల స్తంభం దగ్గర, పిల్లలకి గంతలుకడుతూ కూర్చుంది. తనవైపు చూడనేలేదు.

అపూ అభిమానంతో ఇంటికి తిరిగివచ్చేశాడు. ఎవరితోనూ ఏమీ మాట్లాడలేదు.

'మంచిదికాదు అమల. తనకేసి చూడనన్నాలేదు. పోన్లే, ఏం చూడకపోతే!'

కొన్నాళ్లుపోయాక హరిహరుడు పిల్లవాణ్ణి తీసుకుని ఇంటికి వచ్చేశాడు.

నిజానికన్నాళ్లుఅని! అప్పటికే సర్వజయ పిల్లవాణ్ణి చూడకుండా ఉండలేకపోయింది.

కొన్నాళ్ళనుంచీ దుర్గ ఆటలు సరిగ్గా సాగటంలేదు. అపూ వూరు వెళ్ళటానికి ముందు ఎండిపోయిన గుమ్మడికాయల డొల్లల పడవల విషయమై తగాదావచ్చి ఇద్దరిమధ్య మాటలేకుండా పోయాయి—ఇప్పుడింకా చాలాడొల్లలు ప్రోగయినాయి. కాని దుర్గ వాటిని నీళ్ళలో వదిలి ఆడుకోవటం మానేసింది. 'పిటికోసమై తగాదా పెట్టుకుని పాపం వాడిచెవులు మెలేశాను. వాడు తిరిగిరానియ్. ఇంక యెప్పుడూ వాడితో తగాదా పెట్టుకోను. ఇవన్నీ పెట్టి వాడినే ఆడుకోనిస్తాను' అనుకుంది. ★

]ఇంకా ఉంది.]

చిత్రమాలిక:

సంసారులకు మాత్రమే

సాయంకాలం అయిదు గంటల వేళ - హనుమంతరావుగారు ఆదివరకు కొన్ని సంవత్సరాలుగా అలవాటయిన ప్రకారం షికారుకి, బయలుదేర బోతున్నారు.

ఆయన గుమ్మంలోకి వచ్చి వంటింట్లో ఉన్న భార్యకి వినబడేట్లుగా గట్టిగా, "నేను వీధిలోకి వెళ్తున్నాను, గడియ పెట్టుకో" అని తలుపు దగ్గరగా వేసి, మెట్లు దిగబోతూ ఉండగా ఇద్దరు యువకులు తమ యింటికే వస్తున్నారు.

ఇద్దరూ ఒకేమారు "నమస్కారమండీ" అన్నారు.

హనుమంతరావుగారు ప్రతి నమస్కారం చేసి, ఏమిటి సంగతి అన్నట్టు మొగం పెట్టేరు. వెంటనే వాళ్లుగాని, చెప్పిఉండక పోతే తామే స్వయంగా అడిగిఉందురు. ఆయనకి తన అలవాట్లకి ఏమాత్రం అంతరాయం కలిగినా చాలా చికాగ్గా ఉంటుంది. వచ్చిన ఇద్దరు యువకులలోనూ ఒకతను చాలా సన్నంగా పొడవుగా ఉన్నాడు. రెండవ అతను అంతకంటె పొడవుతక్కువ; లావు కొంచెం ఎక్కువ.

పొడవుగా ఉన్నతను "నా పేరు సూర్యనారాయణండి, వాడిపేరు సుందర్రావండి..."

అని అతనింకా ఏమో చెప్పబోతూ ఉంటే సుందర్రావు అడ్డుతగిలి "ముందు మన పేర్లతో ఆయన కేమిటి సంబంధం? మనం వచ్చిన పనేదో ఆయనకి చెప్తే..."

ఇంకా అతని మాట పూర్తికాకుండానే, హనుమంతరావుగారు, "అదేదో మీరూ చెప్పనక్కరలేకుండానే నాకు తెలిసిపోయింది. అద్దెకి ఇల్లు కావాలంటారు. అంతేనా?"

సుందర్రావు అతనికి సూటిగా జవాబు చెప్పకుండా, "ఒరే చూశావా ఆయన ఆలోచన? ఇటువంటి వాళ్ళను చూసే మనవాళ్ళు ఆవలిస్తే పేగులు లెక్కపెట్టేస్తారంటారు." అని హనుమంతరావుగారి వంక తిరిగి, "అవునండీ, అద్దెకు ఇల్లు కావాలనే వచ్చాము."

హనుమంతరావుగారు; "సరే, వచ్చారు. బాగానే ఉంది. కాని, పాపం, అనవసరంగా శ్రమపడ్డారు; బోర్డు సరిగా చూసి ఉండవలసింది" అని ఇక మరి మాట్లాడవలసిన అవసరం లేదన్నట్టుగా మెట్లు దిగసాగారు.

సుందర్రావు ఊరుకోలేదు; "బోర్డు సరిగా చూసే మీతో మాట్లాడాలని వచ్చాము - "ఈ ఇంటిలో ఒక భాగము అద్దెకు ఇవ్వబడును" అని పెద్దక్షరాలతోనూ, అంతకంటె కొంచెం చిన్నక్షరాలతో "సంసారులకు మాత్రమే" అనీ రాసినసంగతి చూసే యిలా మీ దగ్గరకి పరుగెత్తుకొని వచ్చాము-ఏమిరా సూర్యం?"

"అంతే, అంతే!"

~~~~*~~~~~~~~*~~~~

పంతుల శ్రీరామశాస్త్రి

~~~~~~~~....~~~~~~~~

"అంటే, మావాడు బోర్డును చూసి ఆ సంగతిని నాతో ఆఫీసులో చెప్పాడు. అప్పటినుండి ఎంతవేగం అయిదుగంటలవుతుందా, ఎంతవేగం మిమ్మల్ని వచ్చి కలుసుకుంటామా అనే ఆత్రుత - ఏమంటే యీ ఊరొచ్చి అప్పుడే రెండు నెల్లయింది. హోటలు మెతుకులు తినలేక చస్తున్నాము. కుటుంబాన్ని తెచ్చుకుందాం అంటే ఎక్కడా తగినఇల్లు దొరక్కుండా వుంది- ఇల్లువచ్చినా, ఇరుగు పొరుగులూ, అసలు ఇంటివారూన్నూ అంత గౌరవనీయులుగా కనబడకపోడమో, లేకపోతే మేము చదువుకొనే విద్యార్థులమో, ఒంటరిగావుండి యింట్లో వంటా పెంటా చెయ్యనివాళ్లమో ఇష్టమనే వాళ్లు ఇంటివాళ్లు కావడమో జరుగుతూ వచ్చింది ఈ రెండునెలల్లోనూ. ఇటువంటి మంచి పరిసరాల్లో ఇంత చక్కటి దిట్టమైన ఇంట్లో ఒకభాగము అద్దెకు దొరకడం నిజముగా అదృష్టమే-అయినా నేను కేవలం అద్దెయిళ్ళకోసమే తిరుగుతూ మీరు పెట్టిన బోర్డు చూడకపోవడం ఎలా సంభవించిందో విచిత్రంగానే ఉంది. ఏమిరా సూర్యం!"

"అంతేరా బ్రదర్ అంతే"

"ఒకేయి, నీకిదొక దురలవాటయిపోయింది. చిన్నతనంనుండి ఎంత స్నేహముగా ఉంటేమాత్రం, నీకు కావాలంటే "బావా", ఇంకా సరదాగా ఉంటే నికారంగా వినిపించినా సరే, "బ్రదరిన్లా" అను. అంతేకాని బ్రదర్ అంటేమాత్రం ఒప్పుకోను."

"ఇకముందునుండీ అలాగే అంటానండీ బావగారూ!"

"సరేకాని, మన కబుర్లతో పంతులు గారికి ఆలస్యం చేస్తున్నాము. ఆయన ఎక్కడికో అవసరంగా పనిమీద బయలుదేరినట్టున్నారు. నమస్కారం సార్, మీకు రేపుదయం వీలంటుందంటే వస్తాము. ఇల్లు చూసేక అద్దెసంగతి మాట్లాడుకుందాము. శెలవు."

హనుమంతరావు గారికి సుందర్రావు ధోరణి నచ్చింది. "ఎందుకూ రేపుదయం దాకా? ఇప్పుడే చూద్దురు గాని. నేను అంతా క్రమబద్ధంగా వేళపట్టున జరగాలనే మనిషిని. రోజూ ఈ వేళకి నాకు అలాగే ఓ రెండుమూడు మైళ్లు తిరిగి రావడం అలవాటు. అంతే."

సుందర్రావూ, సూర్యనారాయణా ఆయన షికారుకి కొంచెం ఆలస్యం జరగడానికి తమ విచారాన్ని వ్యక్తపరిచేరు—హనుమంతరావుగారు ఒక్కనాటికి ఫర్వాలేదంటూ ముందు నడిచి, ఇంట్లోకి వెళ్లి, "అమ్మాయి, సుభద్రా! ఇలారా అమ్మా" అని, కేక వేశారు. ఆ అమ్మాయి మెట్లుదిగివస్తూ ఉంటే,

"ఏం లేదమ్మా! వీరెవరో మన ఇల్లు చూడ్డానికి వచ్చారు. అందువల్ల నిన్ను కింద కూర్చొని చదువుకోమని చెప్దామని పిల్చేను" అన్నారు.

ఆ అమ్మాయి "అయితే నా పుస్తకాలు

సంసారులకు మాత్రమే

తెచ్చేసుకుంటూ ఉండండి" అంటూ, మెట్ల మీదనే వెనక్కి తిరిగి వెళ్ళి ఒక్క నిమిషంలో మూడు పెద్దపుస్తకాలు పట్టుకొని దిగివచ్చి, పక్కగదిలోనికి వెళ్ళిపోయి తలుపు చేరవేసుకొంది.

ఇల్లంతా చూపిస్తూ హనుమంతరావుగారు అన్ని సంగతులూ విశదంగా బోధపరచేరు—తమకు న్యాయంగా ఇల్లు అద్దెకు ఇచ్చుకోవలసిన అవసరం ఏమీ లేదనీ, అయితే దురదృష్టవశాత్తూ తమ ఏకైకకుమారుడికి ఇంకొక ఊళ్ళో ఉద్యోగం కావడంతో అక్కడ తప్పనిసరిగా కొంత అద్దె చెల్లించవలసివస్తూంది దనీ, ఆ నష్టాన్ని భర్తీచెయ్యడమే ఇక్కడ ఈ భాగం అద్దెకివ్వడంలోగల ఉద్దేశమనీ, అద్దెలో గడువులూ బకాయిలూ ఇటువంటి పద్ధతులేమీ పనికిరావనీ, అంత్యనిష్ఠురం కంటే ఆదినిష్ఠురమే మంచిదనీ, ప్రతినెలా జీతం అందుకోగానే వెంటనే చెల్లించవలసి ఉంటుందనీ—ఇక అద్దెకి ఉండేవాళ్ళుకూడా సంసారులనగానే పదిమంది పెద్ద గొడవగా ఉండడానికి వీల్లేదనీ, భార్యాభర్తలూ, మహా అయితే ఒక రిద్దరు పిల్లలు—అంతే—ముసలాళ్లు, గొడవ — ఇటువంటిదేమీ పనికిరాదనీ—చివరికి, ఎక్కడ పడుకోవాలో, ఎక్కడ భోంచెయ్యాలో, ఎప్పుడు మాట్లాడాలో, ఎప్పుడు మాట్లాడకూడదో — పాటలూ, పద్యాలు, గ్రామఫోను, రేడియో మొదలయినవన్నీ తమ పిల్ల సుభద్ర బి. ఏ. చదువుకి ఎలా అంతరాయంగా ఉంటాయో ఆయా వివరాలన్నీ స్పష్టంగా బోధపరచారు.

సుందర్రావు ఆయన అడిన ప్రతిమాటకీ సహచేశాడు; అతనికి వంతపాట పాడసాగాడు సూర్యనారాయణ. హనుమంతరావుగారు చిట్టచివరిమాటగా అద్దె పాతిక రూపాయి లియ్యవలసి ఉంటుందనీ, న్యాయంగా తాను తల్చుకొంటే మరొక అయిదుహూపాయిలు వచ్చే సావకాశం లేకపోలేదనీ, అయినా అక్కడ తను కుర్రవాడు ఇస్తున్న అద్దెనే ఇక్కడ తాము తీసుకోదలచుకొన్నామని స్పష్టంచేశారు.

సుందర్రావుకి ఈ అంశంలోనూ అభ్యంతరం లేకపోయింది.

సూర్యనారాయణతో, "ఏమిరా, మీ చెల్లెలుకి ఈ ఇల్లు నచ్చుతుందంటావా? నచ్చకపోవడమేమిటిలే, ఈ పూరుమొత్తం మీద ఇంతకంటే వసతి అయిన ఇల్లు లేదని నేను ఢంకా బజాయించి చెప్పగలను-అయితే, నాకిప్పుడని పిస్తున్న దేమిటంటే, అసలు ఇంటి పరుసాయాల మాట అటుంచి, ఇకముందు నేను ఉద్యోగరీత్యా తిరుమ కేంపులు వెళ్ళవలసి ఉంటుంది. మీ చెల్లెలు ఒక్కత్తె ఉండడానికి ఏమీ భయపడక్కర లేదు; ఇంతటి మంచితోడు మరెక్కడ దొరుకుతుంది—భగవంతుడు నాకు లేకుండా చేసిన పెద్ద దిక్కును ఈవిధంగా చూపించాడనుకుంటాను" అన్నాడు.

మొత్తానికి వ్యవహారం స్థిరపడింది—

హనుమంతరావుగారు పంచాంగంచూసి నిర్ణయించిన ముహూర్తం ప్రకారం మర్నాడు ఆఫీసుకి కూడా శెలవుపెట్టి, మధ్యాహ్నం మూడుగంటలకి గృహప్రవేశం జరిపించుకొన్నాడు. సుందర్రావు తానొక్కడే ఉంటూ ఉంటాడనీ, బావమరిది సూర్యనారాయణ హాస్టలులో ఉంటాడనీ అదీ ఇంక కొద్దిరోజుల్లో పరీక్షలు కాగానే వెళ్ళిపోతాడనీ చెప్పాడు.

రోజూ సాయంకాలం ఏడున్నర ప్రాంతంలో సుందర్రావు భోంచేసి వచ్చే వేళకు హనుమంతరావుగారు భోంచేసి, విశ్రాంతిగా పెద్దపడక కుర్చీలో పడుకొని పేపరు చదువుతూ ఉండేవారు.



"మీరు పెళ్లి చేసుకోవో

సుందర్రావు వచ్చినవాడు తిన్నగా మెట్లెక్కి వెళ్ళిపోక హనుమంతరావుగారితో బాతాఖానీ వేసేవాడు.

రాజకీయాలూ, నేటికాలపు యువతీయువకుల చెడునడతలకి కారణమయిన సినీమాల దుష్ప్రభావమూ, నేటి కాలపు రచనలలో ఏమీ సారంలేకపోవడం, నేటి జనసామాన్యంలోని సర్వలోపాలను అతి ఆప్యాయంగా చర్చించుకొనేవారు తొమ్మిదిగంటలవరకూను. తనతో అన్ని విషయాలలోనూ ఏకీభవించిన ఈ కుర్రవాడిలో ఒకే ఒక లోటు ఆయనకి కనపడింది. అదీ అతను మానెయ్యడానికే చాలా ప్రయత్నిస్తున్నాడు; అందుచేత ఆయన సుందర్రావు సిగరెట్లు కాల్చుకోడానికి అనుమతినిచ్చారు. అలాగే, కేవలం సుందర్రావుకి తోడుగా ఉండడం నిమిత్తం సినీమాకి ఒకనాడు వెళ్ళేరు - అసలు అప్పుడప్పుడు చూస్తూ ఉండకపోతే వాటిలోని లోటుపాట్లను తెలుసుకోవడ మెలా? సినీమా చూసినంతసేపూ బాగానే ఉన్నా, తరవాత ఇద్దరూ ఒకటే విమర్శన.



"నా కెందుకు కోపం!" అన్నది సుభద్ర.

క్రమంగా హనుమంతరావుగారికి సుందరావంటే ఎంతో అభిమానం పుట్టుకొచ్చింది. అతని ఈ వినయం, పెద్దలయెడల గౌరవం, నేటి కాలపు చిల్లర అభిప్రాయాలు కాక మంచి మంచి అభిప్రాయాలు (అంటే తన అభిప్రాయాల వంటివి) కలిగి ఉండడమూ ఇదంతా ఎంతో ఇష్టపడేవి.

ఉదయమే ప్రత్యేకించి కాఫీహోటలుకి వెళ్లడం ఎందుకని కాఫీ తమ యింట్లోనే ఏర్పాటు చేశారు. సాయంకాలం అతను ఆఫీసునుంచి వచ్చే వేళ, తాను షికారుకి బయలుదేరే వేళ — తను కాఫీ తాగి బైటకు వెళ్తాడు. అతను ఆఫీసులో పనిచేసి అలిసిపోయి ఉంటాడు కనక కొంత కాఫీ తాగి, విశ్రాంతి తీసుకుంటాడు. శెలవు రోజులలో ఫలహారం కూడా తమ యింట్లోనే — స్నానానికి వేణ్ణీళ్ల దగ్గర్నుంచి, చాకలికి బట్టలు వెయ్యడంవరకూ అతనికి సంబంధించిన అన్ని వ్యవహారాలూ సక్రమంగా జరిపించేవాడు హనుమంతరావుగారు.

సుందరావు చాలా కృతజ్ఞతగా ఉండేవాడు. కష్టం సుఖం ఆయనతో చెప్పుకుంటూండేవాడు.

వాళ్ల అత్తగారు జబ్బుమనిషి — నాలుగు రోజులు లేచి తిరిగితే వారం రోజులు పడుకోవలసి వస్తుంది — తను వదినగారు పురిటికి వచ్చింది. ఇంట్లో అంతపనీ తనభార్య చేసుకోవాలి. ఆ పురుడేదో అయేవరకూ రావడం పడదు. అంతవరకూ తనకు హోటేలు మెతుకులు తప్పవు. అయినా యిటువంటి యింటిలో అన్ని సదుపాయాలూ కలిగిఉండడంవల్ల ఇంకా కొంత నయం.

క్రమంగా కొన్నాళ్ళకి వదినగారికి పురుడు వచ్చింది. ఆడపిల్ల పుట్టింది. ఆ వచ్చిన శుభలేఖ సుందరావు మొదటినాడు ఆఫీసులో మరిచిపోయాడు. "జాతకం వేసి చూద్దాము; తప్పకుండా రేపు తీసుకొనిరా" అని హనుమంతరావుగారన్నారు. మర్నాడది ఎంత వెతికినా కనబడలేదు — బహుశః తాను మరెక్కడో మరిచిపోయి ఉంటాడు. అందుకోసమని మళ్ళీ సరైన టైము తెలియజేస్తూ రాయవలసిందని ఉత్తరం రాశాడు మామగారికి.

అక్క పురుటి అవసరం తీరిపోయింది. ఇక పంపిస్తారనుకొంటే తనకే జ్వరం వచ్చిందట. అక్కడనుంచి వచ్చిన ఒకాయన కనిపించి చెప్పాడు - పోనీ వెళ్లి చూద్దామంటే దగ్గర కాదు, పన్నెండు రూపాయలు పైగా అవుతుంది ఒకవంకకే రైలు టిక్కెట్టు.

తీరా అతనిభార్య జ్వరంతగ్గి బయలుదేరుతుందనే వేళకి అత్తగారికి విషమించింది. మొదట్లో ఇక సరే మరి ఆశ లేదనుకున్నారటగాని, ఎలాగో భగవంతుడి దయవల్ల ప్రాణభయం లేకపోవచ్చును, గాని, ఒక నెల్లాళ్ళపాటు విశ్రాంతి తీసుకోవలసి ఉంటుందట. అటువంటి పరిస్థితిలో, అమానుషంగా అల్లుడి అధికారం చూపించి, పంపించమని ఎలా రాయడం? అంతకంటె అయితే అయిందని మరి కొన్నాళ్ళు హోటలు భోజనం బాధపడడమే కర్తవ్యం.

సుందరావు తన కష్టసుఖాలు ఓపికగా చెప్పుకొని సలహా అడిగినట్టుగానే హనుమంతరావుగారు తనకి ఉండే సమస్యలని అతనూ తన యీడువాడయినట్టుగానే చర్చిస్తూ ఉండేవారు. ఏమిటో తరుచు వినిపించేది ఆయన కొడుకు ఖర్చుదారు. తను రెండువందలు జీతం తెచ్చుకుంటూ కూడా ఇంకా చాలడంలేదని వందా యాభై పంపమంటూ ఉంటాడు. ఇటువంటి ఆదాయవ్యయాల సమన్వయం తెలియనివాళ్ళు ముందు ముందుకి ఎలా బాగుపడతారు? భవిష్యత్తుకి ఏమిటి నిలవచేస్తారు... సుందరావు ఆయన కుమారుడిని సమర్థించినట్లుగా ఆరంభించి, క్రమంగా ఆయన వాదబలంవల్ల ఆయనతో అంగీకరించేవాడు.

ఇంతకంటే ముఖ్యమయినది ఆయన కుమార్తె వివాహ సమస్య - కట్నానికి బాధ లేదు - ఎంతయినా ఇస్తాను - కాని పుచ్చుకొందికి తగినవాళ్ళేరి! మనవాళ్ళలో ఐ. ఏ. యస్. మొదలైన హోదాల్లో ఉన్నవాళ్ళెంతమంది కనక? తాను తక్కువ జీతంతో ఆరంభించినా వందలు కళ్ళజూసేను; తన కొడుకూ వందలు తెచ్చుకుంటున్నాడు - కాని, ఏముంది, నెలకి అనమం ఒకటే తరవాత మూడు సున్నలయినా జీతం సంపాదించేవాడు కాకపోతే తనకి అల్లుడెవ



పడవలాగే పల్లెలు

(కత్తిరింపుల చిత్రం : వెల్లటూరి పూర్ణానందశర్మ.)

★ సంసారులకు మాత్రమే ★

దానికి ఎలా పనికివస్తాడు. కొంచెం ఆలస్యం అయితే అవుతుంది - ఈలోగా అమ్మాయి ఎమ్. ఏ. కూడా పాసవుతుంది. అంతే తప్ప, ఏ గుమాస్తా వెధవకో,

ఉపాధ్యాయ పుంగవుడికో కట్టబెట్టి కడగండ్ల పాలచేయటం ఎట్లా ?...

సుందర్రావు తన సూత్రప్రకారం ఆయన అభిప్రాయాలతో ఏకీభవించేవాడు - ఈ ఇద్దరి చర్చల మూలంగా ఆయన అతి ముఖ్యం అనుకొనే అమ్మాయి చదువు మాత్రం సాగేదికాదు-ఆమె గదిలో పుస్తకం ముందు పెట్టుకొని కూర్చొనేది, కాని, కాగితాలు తిరిగేవికావు - ఒక్కొక్కప్పుడు ఆమెకు సుందర్రావుని భస్మం చేసేద్దామన్నంత కోపం వచ్చేది అతని ధోరణికి. తన తండ్రివంటి వయోవృద్ధుడు ఆ మాటలంటే బాగుందిగాని, ఇతను, కుర్రవాడయి ఉండికూడా అన్ని నవీనమయినవాటినీ హేళన చెయ్యడమా, అని ఆమె కోపం.

హనుమంతరావుగారు తమ స్నేహితుడికి అస్వస్థతగావున్నట్లు ఉత్తరం రావడంతో చూసిరావడానికి వెళ్ళేరు.

సుందర్రావు ఆఫీసుకి శెలవు పెట్టేడు అస్వస్థత కారణంగానే. అతని పెట్టె తెరచి వుంది. పక్కనే నేలమీద హోల్డాలు విప్పి వుంది. సమీపంలో మాసినబట్టలు, పుస్తకాలు, ఇతర సామగ్రి కుప్పగాపడివున్నాయి. అతను పరధ్యానంగా శూన్యంలోకి చూస్తూ సిగరెట్లు తగలేస్తున్నాడు.

సాయంకాలం అయిదుగంటల వేళ —

సుభద్ర అప్పుడే కాలేజినుండి వచ్చింది.

సుందరం ఆఫీసుబంట్రోతు చేతిలో ఒకకార్డు పట్టుకొని "అమ్మా! సుందరం బాబుగారి ఉత్తరం-ఆరు మేడమీదున్నారు-కాబోలు" అన్నాడు.

సుభద్ర: "సరేలే, నేనిచ్చేస్తాను" అని తీసుకొంది. మరొక అయిదు నిమిషాల తరవాత, ఆమె మేడమీదికి వెళ్లి, "ఇదుగో

సుందర్రావుగారూ! మీ అత్తవారింటినుండి ఉత్తరం" అని అతనిదగ్గరగా పచేలా విసిరింది.

అతను చాలా గాభరాగా "నా అత్తవారింటినుండా?" అంటూ ఉత్తరం తీసి చూసేడు. చూడ్డంతోనే చదవకుండానే అతనికి అర్థమయిపోయింది. అది తన తండ్రి రాసిన ఉత్తరం.

ఆమె ఇంకా అలాగే నిలబడివుంది.

అతనికి ఏమనాలో తోచలేదు. ఇంకా అలస్యంచేసే ఆమె దిగిపోతుందేమోనని ఎలాగో సర్దుకుని, "క్షమించాలి. ఎక్కువ లేదు రెండునిమిషాలు మీతో మాట్లాడాలి" అన్నాడు.

ఆమె: "రెండు నిమిషాలలోనూ ఒక నిమిషం మీరు మాటలు వెతుక్కోవడంకే అయిపోయేలాగుంది. మానాన్నతో అయితే మీకు మాటలు అమృత ప్రవాహంలా వచ్చేస్తాయి. ఏమిటీ మాట్లాడవలసింది?"

ఈమారతనికి ధైర్యం కలిగింది.

"చూస్తున్నారు కదూ యీ సరంజామంతా!"

"ఊఁ. ఒక మరోకనిమిషమే ఉందను కొంటాను"

"క్షమించండి! మీరలా తొందరపడితే కాదు. అలాగని మిమ్మల్ని ఎక్కువసేపు నిలబెట్టను కూడా. మాసేరా నాగాభరాలో మీరు నిలబడివుంటే కూర్చోమన లేదు. అథమం నేనైనా లేచినిలబడలేదు."

"మీరాడదలచిన మాటలు పూర్తయిపోయా యనుకొంటాను. అయినా ఇంకా అరనిమిషం టైముంది. అందాకా ఇలా ఈ పుస్తకాలు, అద్దం దువ్వెనా కిందపడేసి ఈ కుర్చీలో కూర్చుంటాను. ఊఁ సరే, మరేం చెప్పడానికి లేదుకాబోలు?"

"నేను ఎంత ప్రయత్నించినా నాకు 'క్షమించండి' అన్న మాటతప్ప ఇంకొకటి రావటంలేదు. సరే, మరి కాలహరణం ఏల? మీరు యితరుల ఉత్తరాలను చదివేరని నింద ఆరోపణ చెయ్యాలని కాదుగాని, మీకు దీనిమూలంగా నాపరిస్థితి అంతా తెలిసిపోయి ఉంటుంది."

"మీరు నిందవేసినా వెయ్యకపోయినా ఈమీ ఉత్తరం చదివిన నేరాన్ని నేను చెయ్యకపోలేదు—గాని, దీని అవసరం లేకుండానే నాకు మీ సంగతి అంతా తెలుసును—సరా? ఇక మీరు చెప్పవలసింది మరేమయినా ఉందా?"

భగవంతుడు మీకు దివ్యదృష్టి ఇచ్చి ఉంటాడు. సరే, ఏమయినా ఇప్పుడు ఇక్కడే-చూస్తున్నారుకదూ, ఈ సరంజామంతా. ఈవాళ మీ నాన్నగారు లేరు—ఈ వచ్చే పదవ తారీఖువరకు అద్దె పూర్తిగా చెల్లించేశానుకదా—అంచేత ఎవ్వరికీ కవ

★ సంసారులకు మాత్రమే ★

బడకుండా చల్లగా ఇక్కణ్ణించి తప్పు కొందామని"

"బాగానే ఉంది. మళ్ళీ మీ కుటుంబాన్ని తెచ్చుకోందికి ఇటువంటి వసతి అయిన ఇల్లు దొరుకుతుందా?"

"ఇంకా మరెందుకు నన్ను చంపుతారు? ఈవాళ ఉదయమే హోటలుకి వెళ్ళినప్పుడు మా నాన్నకి ఉత్తరం రాసి పడేశాను. మీ యిష్టం వచ్చిన పిల్లను స్థిరపరచండి; పెళ్ళి చూపులకి నేను రానక్కర్లేదని."

మీకు ఎంత కోపంగా ఉంటుందో నాకు తెలుసును.

"మీరు పెళ్ళి చేసుకోబోతే నాకెందుకు కోపం?"

"నేను మోసం చెయ్యాలనుకున్నాను-కాని, నన్ను నేనే మోసం చేసుకొంటూ వచ్చాను. మరింకా కొద్ది రోజులిక్కడ—ఉంటే, ఏదో తెచ్చిపెట్టుకొన్నట్టుగా కాక, ఆయనతో ఆడే మాటలను నా అంతట నేనే మనస్ఫూర్తిగా అనే స్థితికి వస్తానేమో అని భయం వేసింది. ఆయన పెద్దవారూ, గౌరవనీయులే అనుకోండి, అయినా నా వంటివాడు అటువంటి ధోరణిలో పడడం చాలా అసహజం, అసందర్భం"

"అయితే మరి కావాలనీ ఈ అసందర్భ స్థితిని, అసహజత్వాన్ని ఎందుకు తెచ్చుకొన్నారు?

"ఏం చెప్పమన్నారు? బుద్ధి గడ్డితిని—సరే ఇంతవరకూ వచ్చిందిగనక ఆ ఒక్క మాటా మాత్రం దాచడం ఎందుకు? మీ వల్ల పూర్తిగా తినవలసిన చీవాట్లు తినేశాను—అప్పటికిగాని, ముందు ముందుకయినా బుద్ధిరాదు—

"మీ రసలు మాట చెప్పకుండా వ్యాఖ్యానిస్తున్నారు"

"అది చెప్పడానికి సాహసం చాలకే ఈ వ్యాఖ్యానమంతా! ప్రథమ దర్శనంలో ప్రణయ ప్రాదుర్భావము అనే సూక్తిలో నిండు విశ్వాసమున్న వాళ్ళలో ఈ దీనుడొకడు—కొన్నాళ్ళపాటు కళ్ళతో దూర దూరాల్లో అనుసరించాను—అదృష్టవశాత్తు మీ నాన్నగారికి ఇంట్లో భాగం అద్దెకియ్యాలనే సంకల్పం కలిగింది—కేవలం సామీప్యంకోసం తెగించాను. కుటుంబాన్ని సృష్టించుకొన్నాను. వాళ్ళకి ఎక్కడలేని యాతనలూ తెచ్చి పెట్టాను. నా ఉద్దేశం మొదట్లో ఒక్క వారం రోజులు చాలుననీ, కోటలో పాగా వేసినట్టు, ఇంట్లో ఇక తరవాత మరేముంది అనుకొన్నాను"

"తరవాత ఆ అభిప్రాయాన్ని మార్చుకోవలసిన అవసరం ఏంవచ్చింది?"

ఇంకా మెల్లిగా అడుగుతారూ? మీ నాన్నగారి లెక్క ఎంతసేపూ మూడు సున్నల జీతంమీద నే—అదే అంటే ఒకటి తరవాత మూడు సున్నలజీతం—ఇక, మీ దర్శనం ఈ ఇంట్లో ప్రవేశించిన తరవాత నే మరి దుర్లభ మయింది. దర్శన భాగ్యం కలిగినా ప్రయోజనంఏముంది. మీరు పూర్తిగా మీ నాన్నగారి మాటమీద నడుచుకోవలసినవారు."

"సరే, మరి ఇంత జ్ఞానోదయం కలిగి ఎందుకిన్నాళ్ళిక్కడ ఉన్నట్టు?"

"అదే చెప్తున్నానుకదా, ఒకరిని మోసం చేద్దామని నన్ను నేనే మోసం చేసుకోసాగాను. మీరు కేవలం ఆకాశాబ్జం అని తెలిసి పోయినా, మీ నాన్నగారితో బాతాఖానీ క్రమంగా నల్లమందులా నానా బాధపడి అలవాటు చేసుకున్నాను. నా సరదాలన్నిటినీ విడిచిపెట్టుకొని—ఇంతా జేసి, నిష్ప్రయోజనమే కాకుండా, ఎప్పుడో నాడు ఆయనకే దొరికిపోయి దగుల్బాజీ అనిపించుకోవడం ఒక్కటే మిగిలిఉంది. అందుకే, ఈవాళ ఉదయం జ్ఞానోదయం కలిగి, ఆయనకు నా యెడల ఉండే ఘనమయిన భ్రాంతిని భగ్నం చేసుకోకుండా వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాను కాని, కాలం కర్మం అనుకూలించలేదు.

కాని, ఒక్క మాట—మీకు ఇందువల్లనో మరెందువల్లనో తెలిసింది. కాని, ఇతరుల కెందుకు తెలియాలి?"

"అంటే మీతోపాటు నన్నూ నాటకం ఆడమంటారు? బాగానే ఉంది"

"అబ్బే ఇందులో నాటకానికేముంది? నేనెలాగూ వెళ్ళిపోతున్నాను. నన్ను గురించి మీరెలాగూ మోసగాడనుకొంటున్నారుకదా? మీ నాన్నగారనుకొంటే మాత్రం నాకేమిటి నష్టం? నేనాయనని మరి కలిసేదెప్పుడు? అయినా, నాగురించి ఆయన మంచి జ్ఞాపకాన్ని కలిగి ఉంటారంటే, అదోకసరదా. అనుమ ఈ తెలివితక్కువ నాటకంలో కొంత భాగమయినా రక్తికట్టిందని."

"అదే, అంటే మీకు కావలసింది మా నాన్నగారి సదభిప్రాయంతప్ప మరేంలేదన్నమాట?"

"ఆఁ ఏమిటన్నారు? మీరుగాని నన్ను పరీక్షించడంలేదుకదా? కొంపతీసి, మెట్లమీద మీ నాన్నగారినీ వారినీ నిలబెట్లేవుంచి నా నేరాన్ని మరింత యెక్కువచెయ్యాలని చూడడంలేదుకదా?"

"ఇంతటి భయస్థులు మీరేం సాధించదలచుకొని ఈగొడవంతా పెట్టుకున్నారు?"

"చెప్పానుకదూ. బుద్ధి గడ్డితిని. అందికే మా నాన్నకి ఉత్తరంరాసి పడేశాను. స్వయముగా నేను చెయ్యబోయే ఏ ప్రయత్నమూ ఇలాగే బెడిసికొడుతుందని తేలిపోయింది.

"అయితే ఇదివరకు కొన్ని ప్రయత్నాలు చేశారన్నమాట?"

"ఊహుఁ ఇదివరకన్నీ ఊహాలలో నే-కనక సులువుగా తేలిపోయేది. క్రియా రంగంలో దిగిన మొట్టమొదటి వ్యవహారమే..."

"ఏమిటి తుట్టతుది వ్యవహారంగా అవుతుందన్నమాట?"

"అంతేమరి, పెళ్ళి చేసుకున్నాక మరిక అటువంటివాటికి వీలేది?"

"ఆమాటమీద నిలబడతారా?"

"శాయశక్తులా ప్రయత్నిస్తాను-అయినా నేనేం సత్యహరిశ్చంద్రుణ్ణా-ఇంతకీమ్యాను నాకు మీ గండికత్తెర ఏమిటి?"

"గండికత్తెరో, అడ్డకత్తెరో, అలా అని మాట ఇస్తే నే..."

"ఆఁ ఏమిటేమిటీ? నా చెవులని నేను నమ్మలేకపోతున్నాను. నిజంగా మీరు, నేను పొరపాటు పడ్డానేమో, మరొక్కమారు ఆమాట..."

"వన్సుమోరులు నేను పాడలేను-ముందు మాట చెప్తున్నాను వినండి-అయినా, అబ్బ! అంతా నేనే చెప్పాలి—చీకటిపడ్డాక మీ సామానుతోపాటు ఇంకొక బట్టల పెట్టె కూడా పట్టించుకుని వెళ్ళండి. మీతోపాటు మరొకమనిషికి టిక్కట్టు కొనండి—ప్రస్తుతానికి అమ్మనిషిదగ్గర ఒక వంద వుంది ఈలోగా బేంకులో మీ పేరనున్న ఆరు వందలూ తెప్పించండి...ఇదుగో ఇదేకూడదు. రిజిస్ట్రారు ఆఫీసులో అధికారముద్ర పడేవరకూ గజందూరంలో ఉండే మాటాడాలి. మీశెలవో డబ్బో ఏదో ఒకటి అయిపోగానే వచ్చి సంసారులుగా ఈఇంట్లో అద్దెకి ప్రవేశిద్దాము—అలా దిగ్భ్రమ చెంది చూడడంకాదు, సామాను సర్దండి వేగం, ఇప్పుడప్పుడే ఆపని వాదికాదు." ★

వెధవ గొడవ

“శ్యామలా తువ్వాలేదీ” అని కేక వేశాడు ఆనందరావు.

“స్టాండుమీదే వుండాలండీ” అని తిరిగి కేక వేసింది పెరట్లో బాబిగాడికి వొళ్లు నలుస్తూ శ్యామల.

“ఎక్కడుందో ఏమిటో, గంటసేపట్నించి వెతుకుతున్నాను ఎక్కడా అవుపించదు వెధవ గొడవాని” అంటూ చిరాగ్గా మళ్ళీ గది అంతా కలియవెతకడం మొదలెట్టేడు ఆనందరావు.

“ఆనందరావుగారూ” అని వీథిలోంచి కేక.

“ఎవరు వారు?” అని విసుగ్గా అంటూ గది గుమ్మంలోంచే వీథి గుమ్మంకేసి చూశాడు ఆనందరావు.

“ఓ...నువ్వా బ్రదర్ మంచి టైముకే వచ్చేవ్ మరోసారి కనిపించు”

“అబ్బే మీకు జ్ఞాపకం చేద్దామని వచ్చాను. ఈ సారి తప్పకుండా యింటి పన్ను కట్టెయ్యాలి సుమండీ కమీషనరు మామీద కొరాలు మిరియాలు నూరుతున్నాడు” అంటూ మర్యాదగా జారిపోయాడు బిల్లుకలెక్టరు.

“ఇందాకా బాబిగాడు తీసేడు నాన్నా. అది చుట్టబెట్టుకుని ‘నేను నాన్నగారిని’ అంటూ తిరిగేడు. వాడేం చేసేడో మరి” అంది పద్మ.

“వాడి తస్సాదియ్యా, ఏంరా బాబిగా ఏం చేసేవురా నా తువ్వాలు?” అంటూ పెరట్లోకి వెళ్ళేడు ఆనందరావు.

సగం నలిచిన వొంటితో తన చేతికి అందకుండా ఏడుస్తూ పారిపోతూన్న బాబిగాణ్ణి తరమటం మానేసి ఆనందరావుకేసి ఒక్క చూపు చూసి విరగబడి నవ్వింది శ్యామల.

“అదేమిటండీ నడుముకు చుట్టబెట్టుకుని ఇల్లంతా వెతుకుతున్నారు!”

“అవును నాన్నా మరి ఇందాకా బాబిగాడిని ఆడించేటప్పుడు కట్టుకున్నావు కదూ” అంది పద్మ.

“ఊఁ...మహా చక్కగా జ్ఞాపకం చేసేరు. ఏమిటే శ్యామలా చిన్నపిల్లలా ఆ నవ్వులు. ఒసేవ్ పద్దీ ఆ వెకిలి నవ్వులు మానావా వీపు చిట్లగొట్టించమంటావా? నీళ్లు కాగేయేమో చూడు “శ్యామలా” అన్నాడు ఆనందరావు.

శ్యా: ఇవాళ దాసీది రాలేదు. ఇప్పుడే పొయ్యి అంటించాను. కాస్సేపుండండి.

ఆ: బాగుంది వరస అవతల ఇంటర్వ్యూకి టైము అయిపోతోంది. శ్రీమన్మహారాణీ దాసీ సుబ్బులుగారు దయచేయలేదంటే ఆగరు అక్కడ ఇంటర్వ్యూ చేసే పెద్దలు. అవునుగాని ఇవాళిటికి మూడు రోజులు నాగా. దాన్ని మానిపించేస్తే సరి, కుదురుతుంది.

శ్యా: ఆ. దానిమాటెల్లా వున్నా ముందు మనకి కుదురుతుంది. అయిందిగా భాగోతం ఇదివరకు. దాన్ని మానిపిస్తే ఇంకోళ్ళని ఇంటికి ఎక్కనిస్తుందా? స్వంతంగా చేసుకోలేక చావాలి. ఈ పనివాళ్లతో వేగలేకపోతున్నామమ్మా.

నిట్టల శ్రీరామమూర్తి

“అబ్బ ఆపు చెయ్యి లెక్చరు. మళ్ళీ వచ్చి పోసుకుంటాను” అని నూతిదగ్గర మొహం తోముకుని యింట్లోకి వెళ్లేడు ఆనందరావు.

ఆ: అదేమిటే కొబ్బరినూనె అయిపోయినట్టుంది. చచ్చాంరా బాబూ, వొసే పద్దీ రంగయ్యకొట్టుకు వెళ్లి నూనె తీసుకురావే.

ప: ఇవాళ బుధవారం నాన్నా కొట్టుకు సెలవు.

“మై గాడ్” అనుకుంటూ కాసిన్ని నీళ్లతో జుట్టు తడిచేసుకుని దువ్వెన్నకోసం అన్వేషణ ప్రారంభించేడు ఆనందరావు.

“అద్దం వెనక అతిజాగ్రత్తగా పెట్టుకుంటే ఎవరు తీశారే శ్యామలా” అని కేక వేసేడు ఆనందరావు.

“అబ్బ వస్తున్నా వుండండీ ప్రతి దానికీ గందరగోళం చేసి పారేస్తున్నారు.” అంటూ దొడ్డిఅంతా తిప్పి తన్ను కసరత్తు చేయించిన బాబిగాడివొళ్లు ఎల్లా అయితేనేం నలవటం పూర్తిచేసి సున్నిపిండి చేతులు కడుక్కుని యింట్లోకి వచ్చింది శ్యామల.

“ఈ దువ్వెన్నముక్క ఎక్కడెత తగలడిందో సీతాన్వేషణను మించిపోతోంది.” అంటూ మళ్లీ డ్రాయరు వెదకటం ప్రారంభించేడు ఆనందరావు.

బాబిగాడు పెరట్లో శివతాండవం చేస్తున్నాడు అమ్మలేని ధీమా చూసుకుని. నీళ్లపొయ్యిలోంచి పుల్లలు లాగెయ్యటం మొదలెట్టేడు.

“వెధవా, పొయ్యిదగ్గరకు వెళ్లకు” అని కేకపెట్టూ అలమారు వెదుకుతోంది శ్యామల.

“అమ్మా పాలు పోయించుకోండమ్మా” అంటూ పాలమ్మి కేక.

“వొస్తున్నాను వుండవే వెధవగొడవాని” అంటూ శ్యామల వంటింట్లోకి వెళ్ళింది.

“ఇదిగో నాన్నా” అంటూ పెట్టె వెనకాతలనుంచి తీసింది పద్మ నవ్వుతూ.

“మొదటనే చెప్పలేకపోయావుటే” అని గదుముతూ దువ్వెన్న లాక్కున్నాడు ఆనందరావు.

“నువ్వు వెతుక్కోగలవో లేవో చూద్దామని నాన్నా” అని నవ్వుతూ చప్పట్లు చరుస్తూ ‘నాన్నగారు ఫెయిలు అయిపోయిరోయ్’ అంటూ పెరట్లోకి వుడాయించింది పద్మ.

ఆ: “ఆహా దాని ఆకారం ఎంత సొంపుగా వుంది. అచ్చం మా తాత బోసినోరులాగే వుంది.”

“బాబిగాడి పనే అది” అంటూ కొత్త గిన్నె పాలమ్మివద్దకు తీసుకువెళ్లింది శ్యామల.

“వాడు పెద్దైతే ఫస్టుక్లాసు డెంటిస్టు అయేటట్టున్నాడు వెధవాని” అంటూ తల దువ్వుకునేందుకు వుపక్రమించేడు ఆనందరావు.

“ఏమే బొత్తిగా నీకు పోస్తున్నావ్.”

“అదేంటమ్మా అంత చిక్కగా పోస్తూంటే. కావలిస్తే, బుడ్డి వేసుకు

(56 పేజీ చూడండి)

హక్కులకోసం పత్రికల పోరాటం

"పత్రికవాళ్లని రానివ్వడమే! ఇంకేమన్నా ఉందా?"

'ఏంలేదు; కొంప మునిగిపోవడమే తరువాయి' అన్న ధోరణిలో ఈ మాట అన్న ఆయన ఒక బ్రిటిష్ పార్లమెంటు సభ్యుడు. పార్లమెంటులో ఉపన్యాసాలూ, చర్చలూ పత్రికలలో అచ్చు వెయ్యడానికి అనుమతించే విషయమై ఆయన ఈమాట అన్నాడు.

అలా అని ఏముంటుందో కూడా చెప్పాడు: "సభ విశేషాలు పత్రికలలో అచ్చువెయ్యనిస్తే ఉపన్యాసాలన్నీ ఏరోజు కారోజు అందరికీ తెలిసిపోతాయి. అది జరిగితే లోకం దృష్టిలో ఈసభ మహా కంట్రకం పడిపోతుంది." అన్నాడు. 1715 లో జరిగిన సంఘటన ఇది.

1956 లో ఈమాటలు వింటే నవ్వొస్తొచ్చు. ఆరోజునమాత్రం ఎవరూ నవ్వలేదు. పార్లమెంటు విశేషాలు పత్రికల కెక్కిస్తే కఠిన చర్య తీసుకోవాలని ఒక తీర్మానం చేసివేశారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత ప్రముఖస్థానం ఆక్రమిస్తున్న పత్రికలు, ఈనాటి స్వాతంత్ర్యం, హక్కులు సంపాదించడానికి ఏళ్ళతరబడి పార్లమెంటును,ప్రభుత్వాన్నీ ప్రతిఘటించి, నెగ్గుకు వచ్చాయి. ఈనాడు ఈహక్కులు ప్రజాస్వామ్య వ్యవస్థలకు ప్రాణతుల్యమైనవి. పవిత్రమైనవి. అయితే ప్రభుత్వాల దృష్టిలో మాత్రం ఇవి ఒక విధంగా తప్పనిసరి బెడదలు!

పేరు అచ్చుపడితే చాలు!

అనగనగా ఒకనాడు, రాజు అధికారాలు క్రమంగా బ్రిటిషుపార్లమెంటు పరం అవుతున్న రోజులలో పత్రికఅనేది పార్లమెంటు కోసుఎత్తితేచాలు. నెత్తికిముప్పు తెచ్చుకున్నట్టే. ప్రభువుల సభసభ్యుడి పేరు-కేవలం పేరుమాత్రం,పత్రికలో అచ్చువేస్తే, అది 'హక్కులకు భంగకరం'గా పరిగణించబడేది. ఆపైన ఆదుస్సాహసకార్యం చేసిన వ్యక్తిమీద చర్యతీసుకొనేవారు. ఆ రోజులలో కొందరు సభ్యుల కొందరికి, నిత్యం ప్రతికలన్నీ, తమపేర్ల కోసం గాలించడం ఒక ప్రత్యేక వ్యాసంగంగా ఉండేదిట,

మానవ నైజం

అయితే ఇంత ఆర్భాటం జరుగుతునే ఉన్నా పత్రికలలో పార్లమెంటు విశేషాలు పడుతునే ఉండేవి. మొట్టమొదట, సాహసించి ఈ రకం పోరాటం సాగించిన వ్యక్తి ఎడ్వర్డ్ కేవ్. దీనివలన అతను ఖైదుకు కూడా వెళ్ళి వస్తూ ఉండేవాడు. అయినా వార్తలు మాత్రం అచ్చుఅవుతునే ఉండేవి. ఈ విచిత్రానికి కారణం మనుష్యుల నైజగుణం. 'మా పేరు ఎత్తకూడద'ని బహిరంగంగా ఉద్ఘాటనలు చేసినా, కొందరు సభ్యులు తమపేరు అచ్చులో పడాలని ముచ్చటపడుతూ ఉండేవారట. అయితే, ఒకసారి ఎడ్వర్డ్ కేవ్ 'ఒక ఉపన్యాసం ప్రతి సంపాదించాడు. పార్లమెంటులో ఫలానా సభ్యుడు దాన్ని చదవడానికి ముందే, ఇతల పత్రికలో అచ్చుపడింది. అక్కడితో పార్లమెంటు విశేషాల ప్రచురణ తతంగం అంతిమైనంత పని అయింది.

పత్రికాస్వాతంత్ర్యానికై సమరం జరిగిన వివిధదేశాలలో బ్రిటన్‌లో కథ చెప్పతొగ్గది. సారస్వతప్రపంచంలో ఉద్దండులు అయినవా రెందరో అందులోపాల్గొన్నారు. వారు—దృఢసంకల్పులు. సంకల్పసిద్ధులు. ఈనాటిలండన్‌లోని "ఫ్లీట్ స్ట్రీట్" ఆనాటి వీరుల శిబిరం. ఎడ్వర్డ్ కేవ్, శామ్యూల్ జాన్‌సన్,జొనాథన్ స్విఫ్ట్, డేనియల్ డిఫో, నికొలస్ ఆమ్‌హర్స్ట్, జూనియస్, జాన్ వాల్టర్ ప్రభృతులు అనేక కష్టనిష్ఠురాల కోర్చి కృషిచేశారు.

ఏకసంతగ్రాహి

పత్రికల విలేఖరు లంటే తలుపులు బిడాయించే పార్లమెంటునుండి ప్రసంగాలు, చర్చల విశేషాలు సంపాదించుకు రావడానికి ఈ పత్రికా రచయితలు శతవిధ ఉపాయాలూ అవలంబించే వారు. చిన్న చిన్న కాగితాల మీద జదరాబాదరా వ్రాసుకుని, దొంగచాటుగా బయటికి చేరవేసేవారు. అడపాదడపా, కొందరుసభ్యులే, తమ ప్రసంగాలు వీలైనంత వివరంగా పడాలన్న ఉబలాటం కొద్దీ, లోపాయకారీగా, తామే, వివిధ విషయాలు 'రచియించి' పత్రికలకు అందచేసేవారట. చిన్న చిన్న చీటీ ముక్కల్ని దగ్గర పెట్టుకుని, వాటికి రూపం ఇచ్చి సాఫు చేయడంలో శామ్యూల్ జాన్‌సన్ సిద్ధహస్తుడనిపించుకున్నాడు. "మెమొరీ" వుడ్ ఫాల్ అని ఇంకో ప్రముఖ విలేఖరి ఉండేవాడు. ఆయన ఏకసంతగ్రాహి. పొరుడుగా, వెళ్ళి పార్లమెంటు గాలరిలో కూర్చునేవాడు. చేతులు కట్టుకుని, కళ్ళుమూసుకుని, చెవులు రిక్కించి, శ్రద్ధగా అన్నీవినేవాడు. అవటా ఇవతలకి చక్కా వచ్చి, విన్నదంతా, అక్షరం పొల్లు పోకుండా వ్రాసి అచ్చుకి ఇచ్చేవాడు.

ఎత్తులూ, పైఎత్తులూ

పత్రికలని అణగద్రొక్కడానికి ప్రభు

భారత పార్లమెంటు, రాష్ట్రీయ శాసనసభలలో చర్చల వివరాలూ, ప్రసంగాల పాఠాలు సమగ్రంగా వ్రాసుకుని పత్రికలలో ప్రచురించడానికి అనుమతి ఇవ్వగోరుతూ, శ్రీ ఫిరోజ్ గాంధీ భారత పార్లమెంటులో ఒక బిల్లు ప్రవేశపెట్టారు. పార్లమెంటు దీనిని ఒక ప్రత్యేక సంఘం పరిశీలనకు పంపింది.

నిజానికి, ఈవిధంగా పార్లమెంటు చర్చలవివరాలు ప్రచురించే హక్కు ప్రజాస్వామ్య వ్యవస్థల సంప్రదాయాన్నిబట్టి మనకి సంక్రమించింది. ఎటొచ్చి, దీనిని చట్టరీత్యా ఆమోదింపచేసి రక్షణ కల్పించడమే ఈ బిల్లు లక్ష్యం. పార్లమెంటులో అన్నిపక్షాల వారూ దీనికి సుముఖులుగానే ఉన్నారుగాని, రాష్ట్రీయ శాసనసభల విషయంలో, ఆయా రాష్ట్రాలు అన్నీ అనుకూలమైన అభిప్రాయం తెలుపలేదు.

త్వం వేసే ఎత్తులూ, వాటికి పత్రికల పై ఎత్తులూకూడా అద్భుతంగా ఉండేవి. ఒకప్పుడు Mist's Journal అనేక పత్రికను ప్రభుత్వం అణచివేసింది. కొద్దిరోజుల తరువాత "Fog's Journal" అనే పేరుతో ఆ పత్రిక మళ్ళీవచ్చింది. 1738 ప్రాంతాలలో బ్రిటన్ ప్రధాని సర్ రాబర్టు వాల్‌పోల్ పత్రికలను అణచడానికి చాలా గట్టి ప్రయత్నాలు చేశాడు. పై సంఘటన ఆయన హయాంలోదే. అసలు పార్లమెంటు పేరుగాని, సభ్యుల పేరుగాని మాటవరసకికూడా ఎత్తరాదని వాల్‌పోల్ శాసించాడు. ఎడ్వర్డ్ కేవ్ దానికి విరుగుడుగా కొత్త మార్గం అవలంబించాడు. ఒకవంక ప్రభుత్వం, అది పార్లమెంటు నిశేషాలు అని ఆరోపించడానికి వీలులేకుండానూ, మరొకపక్క, పత్రిక చదువుకునే వారికి వాటి నిజస్వరూపం సులభంగా తెలిసే విధంగానూ ఎడ్వర్డ్ కేవ్ వాటికి బురఖా వేసేవాడు. అతని వ్రాతలో గ్రేట్ బ్రిటన్‌కు పేరు గ్రేట్ లిలిపుట్. అప్పటిప్రధాని సర్ రాబర్ట్ వాల్‌పోల్‌కు పెట్టినపేరు సర్ రూఫ్ వాలెలాఫ్.!

పన్నులు విధించడంద్వారా ప్రభుత్వం ఒక ప్రయత్నం చేసింది. దానితో ధరలు పెరిగిపోయి చాలా పత్రికలు ఆగిపోవలసి వచ్చింది. అయితే, అంతలోనే ఆ పన్ను విధింపుచట్టంలో సూది బెజ్జం అంతమారం ఒకటి కనబడింది. చట్టంలో మాటలప్రకారం ఒక కాగితంమీద వేసే పత్రికకి అర పెన్నీ, రెండు కాగితాల పత్రికకు ఒక పెన్నీపన్ను. అప్పటికి అంతకన్న ఎక్కువ పుటలున్న పత్రికలులేవు. అంతే. ఈ లోపం బయటపడగానే, అందరూ మూడేసి కాగితాల పత్రికలు ముద్రించి, పన్నులకి ఉద్వాసన చెప్పారు. ఈ ఉపాయం పన్నెండేళ్ళపాటు నిరాఘాటంగా సాగింది. తరవాత ప్రభుత్వం ఒక సవరణ చేసి, ఆ లోపం సర్దివేసింది. ఎన్ని పుటలున్నా సరే పుటకి 'ఇంత' చొప్పున పన్ను కట్టాలన్నారు.

అతనికంటె ఘనుడు...

అయితే అప్పుడు కూడా ఇంకోమార్గం కనబడింది, ఆ చట్టం పన్ను విధించేది పుటల సంఖ్యనుబట్టి తప్ప, పరిమాణాన్నిబట్టి కాదుగా! అందుకని, నాలుగు చిన్న పుటలు వేసి ఎక్కువ పన్ను కట్టుకోవలసినవాళ్ళంతా, పేజీ పరిమాణాన్ని పెద్దది చేశారు. అక్కడితో నాలుగింట మూడుపాళ్లు పన్ను తగ్గిపోయేది!

ఈ రకంగా నిర్విరామంగా కృషిచేసి పత్రికలు స్వాతంత్ర్యాన్ని హక్కులనూ సంపాదించుకున్నాయి. ప్రజలసొత్తు దుర్వ్యయం కాకుండా కాపాడే సంరక్షకులుగా, ప్రజలకు, తమ ప్రతినిధులు చేసే కృషి వివరాలను తెలిపే దూతలుగా, మంచిచెడ్డా చర్చించుకోవడానికీ, మంచిదారిని ఎంచుకోడానికీ వేదికలుగా, సర్వతోముఖంగా పత్రికాప్రపంచం వికసించింది. విస్తరించింది. బలవత్తరమైన శక్తిగా రూపొందింది. లక్షమంది సైనికులకన్న, ఎదురుతిరిగిన నాలుగు పత్రికలు బలవత్తరమైనవని నెపోలియన్ ఒకసారి ప్రవచించాడు. ప్రభుత్వ వ్యవస్థ నిర్వహణ కట్టుదిట్టంగా, నిర్మాణాత్మకంగా నడవడానికి పత్రికాస్వాతంత్ర్యమే మూలకారణమని బ్రిటిష్ రాజనీతిజ్ఞుడు చార్లెస్‌జేమ్స్ ఫాక్స్ అన్నాడు. పత్రికల బలాన్ని, పలుకుబడిని, ఒక్క ముక్కలో చాటగల విధంగా ఒక ప్రముఖుడు ఈ ఛలోక్తి విసిరాడు.

"మంత్రివర్గం రాజీనామా చేసింది. లార్డ్ నార్త్‌క్లిఫ్ రాజుకు కబురంపాడు!" ★

('ఎవరిబడీస్' పత్రిక ఆధారంగా)

ఉగాదికి విడుదలైన
"చింతామణి" లో
చింతామణిగా భానుమతి,
బిల్వమంగళుడుగా
రామారావు.







లక్ష్మి ప్రొడక్షన్స్ వారి "ఇలవేలుపు"లో తరళగా జమున !



రాజశ్రీ వారి "జయం మనదే" లో జానకి.

సినిమా వార్తలు

లక్ష్మీ ప్రొడక్షన్స్ వారి 'ఇలవేల్పు' శ్రీ యోగానంద్ దర్శకత్వాన వాహినిలో చురుకుగా తయారవుతుంది. అంజలి, నాగేశ్వరరావు, రేలంగి జమున, కృష్ణకుమారి, గుమ్మడి ఆర్. నాగేశ్వరరావు, రమణారెడ్డి సూర్యకాంతం, డా॥ శివరామకృష్ణయ్య, రాగిణి మొదలైన వారు నటిస్తున్నారు.

* * *

నాగేశ్వరరావు, జానకి, సరోజ, కమలా లక్ష్మణ్ రేలంగి, ముక్కామల కాశిక్, నరసింహారాజు ప్రభృతి నటీనటులతో శంకర్ ప్రొడక్షన్స్ వారు నిర్మిస్తున్న 'సదారమ' చిత్రం ఏ. వి. ఎం. స్టూడియోలో తయారవుతోంది. ఇది ఈ సంస్థ తొలిచిత్రం. దర్శకుడు శ్రీ కె. ఆర్. సీతారామశాస్త్రి.

* * *

అంజలీ పిక్చర్స్ వారి నూతన చిత్రం వీనస్‌లో తయారవుతోంది. ఇది జానపదం. అంజలి, నాగేశ్వరరావు ముఖ్యభూమికలు నిర్వహిస్తున్నారు. నిర్మాత శ్రీ ఆదినారాయణరావు దర్శకుడు శ్రీ వేదాంతం రాఘవయ్య.

* * *

తయారవుతున్న పౌరాణికాలలో 'నలదమయంతి' ఒకటి. కన్నడ నటుడు కెంపరాజ్ ఉర్స్ నిర్మిస్తున్నారు. భానుమతి, కెంపరాజ్, రేలంగి, ముక్కామల జయలక్ష్మి ఇందులో నటిస్తున్నారు. దర్శకత్వం కెంపరాజే నిర్వహిస్తున్నారు.

* * *

రామారావు, రాజసులోచన, జానకి, టి. యస్. ఆర్. అమర్‌నాథ్‌లతో జి. వి. యస్. ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న సాంఘిక చిత్రం 'సొంతవూరు' చాల వరకు పూర్తి అయింది. మే నెలలో విడుదల చేయాలని నిర్మాణం చురుకుగా సాగిస్తున్నారు. దర్శకుడు ఇ. ఎస్. మూర్తి.

* * *

సాహిణీవారి సాంఘిక చిత్రం 'పెంకి పెళ్ళాం' శ్రీ కమలాకర కామేశ్వరరావు దర్శకత్వాన తయారవుతోంది. రామారావు, రేలంగి, శ్రీరంజని, రాజసులోచన అమర్‌నాథ్, నాగభూషణం, రమణారెడ్డి, జోగారావు, సూర్యకాంతం హేమలత మొదలగు వారు నటిస్తున్నారు. దీనికి మాటలూ పాటలూ ఆరుద్ర వ్రాశారు. సంగీతం ప్రసాదరావు.

* * *



జూపిటర్ వారి "ఉమాసుందరి"లో సుకి బాలసరస్వతి.

"సమర్థుడు, సజ్జనుడు, అగ్రశ్రేణి దర్శకుడు"

శ్రీ ఎల్. వి. ప్రసాద్ సన్మాన సభలో సినిమా ప్రముఖుల ప్రశంసాపరంపర

తెలుగుచిత్రాలనేకం డైరెక్టుచేసి, బాక్సాఫీస్ డైరెక్టరుగాను, సమర్థుడైన చలనచిత్రకళా నిపుణుడుగాను కీర్తి గడించిన శ్రీ ఎల్. వి. ప్రసాద్‌కు తెలుగు ఉగాది పర్వదినం నాడు గొప్పసన్మానం జరిగింది. ఈ సన్మానం అనేకవిధాలుగా తెలుగు చలనచిత్రచరిత్రలో అపూర్వమైనది. శ్రీ ప్రసాద్ గారి శిక్షణలో దర్శకులుగా పైకి వచ్చిన అయిదుగురు శిష్యులు ఈ సన్మానం తలపెట్టి విజయవంతంగా నిర్వహించారు. శ్రీయుతులు ఎర్రా అప్పారావు, తాతినేని ప్రకాశరావు, రజనీకాంత్, రంగనాథదాసు, యోగానంద్ సన్మానకర్తలు. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ పి. వి. రాజమన్నార్ అధ్యక్షత వహించారు. తెలుగుటాకీ పితామహుడు శ్రీ హెచ్. ఎం. రెడ్డి ఆశీఃపూర్వకంగా ఉపన్యసించారు. దాదాపు తెలుగుటాకీ చరిత్రను నిర్మించడంలో ప్రముఖపాత్ర వహించిన పెద్దలందరూ సన్మానవేదిక పైకివచ్చి శ్రీ ప్రసాద్‌ను అభినందిస్తూ మాట్లాడారు. ఉగాది పర్వదినంలో ఈ సన్మానం జరగడం మరొక విశేషం. సభ 'ఆంధ్రమహిళా సభ' ఆవరణములో రమ్యమైన వాతావరణంలో జరిగింది. శ్రీయుతులు నాగిరెడ్డి, చక్రపాణి, బి. ఎన్. రెడ్డి, కె. వి. రెడ్డి, ఎస్. ఎస్. వాసన్, ఇంకా పలువురు దర్శకులు, నిర్మాతలు, నటీనటులు, టెక్నీషియన్లు సభలో పాల్గొన్నారు.

అల్పాహారవిందు, ఘంటసాల, [illegible] గారి గానం ముగిసినతరువాత దైవగానంతో సభ ప్రారంభమైంది. సన్మానకర్తల తరఫున శ్రీ రజనీకాంత్ సన్మానపత్రం చదివి సమర్పించారు. అధ్యక్షులు శ్రీ రాజమన్నార్ మాట్లాడుతూ దర్శక ప్రముఖుడైన శ్రీ ప్రసాద్‌ను సన్మానించే ఈ సభలో పాల్గొనడం తమకు చాలా సంతోషంగా ఉందనీ, శ్రీ ప్రసాద్ అగ్రశ్రేణి దర్శకుడనీ, సమర్థతలోనేకాక సౌజన్యంలో కూడా ఆయన అందరి అభినందనాలు పొందుతున్నారనీ చెప్పారు. ఐదుగురు శిష్యులు ఈ విధంగా తమ గురువును సన్మానించడం చూస్తే, విస్మృతమైన ప్రాచీన భారతీయ సంప్రదాయాలు, ఆనాటి గురుకులవాసం, గురుదక్షిణ జ్ఞాపకం వస్తున్నాయనీ అన్నారు. చలనచిత్రం మిగతా లలితకళల వరుసలో చేర్చదగిన కళగానే తామెప్పుడూ భావిస్తున్నామనీ, సంగీతనాటక అకాడెమీ తరఫున గత సంవత్సరం చలనచిత్ర గోష్ఠిని ఈ దృష్టితోనే ఏర్పాటు చేశామనీ, చలనచిత్రకళా నిపుణుడైన శ్రీ ప్రసాద్ సన్మానంలో తాము హృదయపూర్వకంగా పాల్గొంటున్నామనీ, ఆయన భారతదేశంలోనే అగ్రశ్రేణి దర్శకుడనీ ఆయన అన్నారు.

తరువాత శ్రీ హెచ్. ఎం. రెడ్డి మాట్లాడారు: "ప్రసాద్ నాకు 1930 నాటినుంచీ తెలుసు. బొంబాయిలో నేను మొదటి తమిళ టాకీ 'భక్త కాళిదాస' తీస్తున్నప్పుడు నాకు ఒక దక్షిణ భారతీయుని సహాయం కావలసివచ్చింది. ఆ సందర్భంలో ప్రసాద్ నాకు తటస్థపడ్డారు. మా పరిచయం క్రమంగా వృద్ధిపొంది, నేను నిర్మించిన 'తెనాలి రామకృష్ణ', 'ఘరానా దొంగ' చిత్రాలలో ప్రసాద్ పనిచేయడం జరిగింది. ప్రసాద్ దర్శకుడుగా కంటె నటుడుగానే రాణిస్తాడని నేను అనుకునేవాణ్ణి. ఇప్పటికీ ప్రసాద్ దర్శకుడు కావడంవల్ల ఆంధ్రదేశం ఒక గొప్పనటుణ్ణి జారవిడుచుకుందని నా నమ్మకం. ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని నా ఆశీస్సు" అన్నారు.

ఆ పిమ్మట శ్రీ ఎస్. ఎస్. వాసన్ మాట్లాడుతూ ప్రసాద్ గారితో తమ పరిచయం కొద్దిపాటిదైనా గాఢమయిందనీ, ఆయన నిర్మించిన 'సంసారం' చిత్రం చూసి ముగ్ధుడనైనాననీ, వెంటనే దాన్ని తమిళ, హిందీభాషలలో నిర్మించాలని సంకల్పించాననీ, శ్రీ ప్రసాద్ తమకు ఆ సంకల్ప నిర్వహణలో తోడ్పడ్డారనీ అన్నారు. శ్రీ ప్రసాద్ 'డైనమిక్ డైరెక్టర్' అని ఆయన ప్రశంసించారు. "సంసారం" విజయం పొందడం చూసి తమకు ఒక చిత్రం డైరెక్టుచేసి ఇమ్మన్నానని కోరాననీ, కాని ఆయనకు తెలుగువాళ్ళయ్యే పని ఉండడం వల్లా, ఆరోగ్యం చెడిపోవడంవల్లా నిరాకరించారనీ, ఎప్పటికైనా ఆయన ఒక చిత్రం డైరెక్టుచేసి యిచ్చేదాకా తమకు సంతృప్తి ఉండదనీ అన్నారు.

శ్రీ బి. ఎన్. రెడ్డి మాట్లాడుతూ, తాను 'స్వర్గసీమ' నిర్మాణంలో నిమగ్నుడై ఉన్నప్పుడు కొత్తగా ప్రారంభమైన విజయా



భరణీవారి "చింతామణి" లో ఎస్. వి. రంగారావు.



"జయంమనదే"లో రేలంగి.

బొంబాయి సినిమా లేఖ

రేపు మే 23 న ప్రారంభం కానున్న 2500 వ బుద్ధజయంతి ఉత్సవ సందర్భముగా, బుద్ధుని ప్రబోధాలు, ఆ కాలపు స్థితిగతులు, నాటి సంస్కృతిని చిత్రించే మూడు నాలుగు చిత్రాలు నిర్మించబడుతూ ఉన్నాయి. వీటిలో ముఖ్యమైనది 'అంజలి' అనే చిత్రం. చేతన్ ఆనంద్ దీనికి కథ వ్రాశారు. ఆయనే దర్శకత్వం వహిస్తున్నారు.

బుద్ధ భగవానుని అభిమాన శిష్యుడు, అత్యంత సుందర స్వరూపుడు అయిన 'భిక్షు ఆనంద్' జీవితం దీనికి కథావస్తువు. దీని ఆధారంగా ఆ కాలపు స్థితిగతులు, ప్రజల జీవనవిధానాలు, సామాన్య ప్రజల అవస్థలు, రాజుల వైభవం, ఐహిక సుఖాల పట్ల దాహం, నాటి కులమత తత్వాలు మొదలయిన వాటన్నింటినీ, ఇందులో సమగ్రంగా, ఉజ్వలంగా చిత్రించడానికి చేతన్ ఆనంద్ సంకల్పించారు. ఆనాటి వేషభాషలు, కళలు మొదలయిన విషయాలలో పొరపాట్లు జరగకుండా, పరిశోధనలు జరిపి, దర్శకునికి ఆయా విషయాలలో సలహాలు యిచ్చే నిమిత్తం ఒక పరిశోధన మండలికూడా నెలకొల్పబడింది.

ఇంగ్లీషు, హిందీ భాషలలో నిర్మితమవుతున్న ఈ చిత్రం విడుదల హక్కులకై, విదేశీయ డిస్ట్రిబ్యూటర్లు చాలమంది ప్రయత్నాలు చేస్తున్నారట.

ఈ చిత్రంలో 'భిక్షు ఆనంద్' పాత్ర కు చేతన్ ఆనంద్ నిర్వహిస్తున్నారు.

భిక్షు ఆనంద్ జీవితంలో ప్రముఖ పాత్ర వహించిన యువతి, యువకులలో సందాలిక గా నిమ్మి, మనో హర అయిన యువరాణిగా [illegible] నటిస్తున్నారు. ఊర్వశి [illegible] పాత్ర [illegible] నటిస్తోంది. ఈ కథలో ఈమె భాగం కూడా ముఖ్యమైనదే.

ఒక జాతక కథ ఆధారంగా చేతన్ ఆనంద్ ఈ కథను వ్రాశారు. కథాస్థలానికి సంబంధించిన కొన్ని [illegible] దృశ్యాలను, గత వైభవం, [illegible], కళ్ళకు [illegible] ప్రాంతాలను [illegible] చేశారు.

ఈ చిత్రం పూర్తి కాగానే చేతన్ ఆనంద్ అంతర్జాతీయ మార్కెట్ కై పెద్ద ఎత్తున ఒక చిత్రం నిర్మిస్తారట. హాలీవుడ్ సంస్థ కొలంబియా వారితో ఈ విషయమై ఒక ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ చిత్రాన్ని సినిమా స్కోప్ లో వర్ణచిత్రంగా (ఈస్ట్ మన్ కలర్) నిర్మిస్తామని, భారతీయ నటీనటులూ హాలీవుడ్ నటీనటులూ కూడా పాల్గొంటారనీ చేతన్ ఆనంద్ చెప్పారు.

కాగా, బుద్ధజయంతి సందర్భంగా నిర్మించబడుతున్న [illegible] చిత్రం [illegible] మరొక [illegible] చిన్న చిత్రం. భారత ప్రభుత్వం ఈ చిత్ర నిర్మాణాని

శ్రీ ఎల్. వి. ప్రసాద్ సన్మానం

కంపెనీ డైరెక్టరు [illegible] అప్పుడు తాము శ్రీ నాగిరెడ్డి, చక్రపాణి గార్లకు శ్రీ ప్రసాద్ పేరు సూచించామనీ, ఆయన దర్శకత్వాన తయారయిన మొదటి విజయా చిత్రమే "షావుకారు" అని చెప్పారు.

శ్రీ నాగయ్య మాట్లాడుతూ తాము పోతన, త్యాగయ్య మొదలైన కొంత పాత్రలు వేయడంవలన ప్రజలు తనను కొంత మూర్తిలని అనుకునే వారనీ, కాని ప్రసాద్ గారితో కలిసి పనిచేయడం జరిగిన తరువాత కొంతమూర్తి అనేమాటకు అర్థం ప్రసాద్ గారేనని తనకు తెలిసిందనీ, ఆయన సౌజన్యం, సహనం సాటిలేనివనీ ప్రశంసించారు.

ఆపిమ్మట తమిళనటులు శ్రీ శివాజీగణేశన్, సారంగపాణి, తెలుగునటులు శ్రీ ఎన్. టి. రామారావు, నాగేశ్వరరావు, తారలు సావిత్రి, జమున, దర్శకుడు శ్రీ పి. రామకృష్ణరావు, రచయిత సముద్రాల రాఘవాచార్య హాస్యనటుడు రేలంగి ప్రసాద్ గారి సుగుణాలను వినుతిస్తూ, ఆయన దర్శకత్వాన పనిచేయడంతమకు సినీజీవితంలో ఎలా అభివృద్ధి హేతువైందీ వివరిస్తూ ప్రసంగించారు.

పలువురు శిష్యులు శ్రీ రాజమన్నారు ద్వారా శ్రీ ప్రసాద్ కు బహుమతులు కొన్ని అందజేశారు. వెండి పళ్ళెం, మరో వెండి పళ్ళెం [illegible] మొదలైన వస్తువులు శ్రీ ప్రసాద్ కు అర్పించిన పురస్కారంగా [illegible] అర్పించారు.

శ్రీ ప్రసాద్ సన్మానానికి కృతజ్ఞత తెలుపుతూ ప్రసంగించారు. తమతో పని చేసిన అయిదుగురు ఈనాడు స్వతంత్ర ప్రతిభ కనపరుస్తూ దర్శకులు కావడం, తాను తమకీ సన్మానం తలపెట్టడం తనకు చాలా ఆనందదాయకంగా ఉందనీ, శిష్యుల చేతి పరాజితుడు కావడం కంటె గురువుకు గర్వకారణం లేదనీ ఆయన చెప్పారు.

శ్రీ రజనీకాంత్ అభినందన సమర్పణ తర్వాత ఘంటసాల '[illegible]' గానంతో సభ జయప్రదంగా ముగిసింది. ★

★ సెవెన్ ఇయర్ ఇచ్ ★

తెలవని కోరికలన్నీ తీరనివై పేరుకుపోతే, కాస్తంత అవకాశం రాగానే అవి ప్రేలుతాయి. రంగురంగుల పగటికలలుగా రూపాలు ధరిస్తాయి. వాటిని 'కన్న' ఆసామికి అద్భుతరూపం ఇస్తాయి. ఆత్మనిగ్రహం గల మహానుభావుడుగా, బహుమంచివాడుగా చూపించి ఓదారుస్తాయి.

సిగరెట్లు దగ్గర్నుంచి పరస్త్రీలవరకూ కాస్తగట్టిగా సలహా లిచ్చి, అమలు జరిపించే భార్య దొరికినప్పుడు, భర్త ఈ పంథాలో రూపొందవచ్చు. ఆవిడ దృష్టి మళ్లగానే, ఆయన దృష్టి నలువంకలా సారిస్తాడు. అప్పుడది చక్కని చుక్కలమీద పడక తప్పదు. రోజులు మారినా, పురుషులలో ఈ ధోరణిలో మార్పేమీ రాలేదు.

ట్వెంటియత్ సెంచరీ ఫాక్స్ వారు "సెవెన్ ఇయర్ ఇచ్" అనే చిత్రంలో ఈ కోవకు చెందిన వ్యక్తిని అద్భుతంగా చిత్రించారు.

కథానాయకుడు, కోకపుస్తకాల కంపెనీలో ఉద్యోగి. నడికారు వయసువాడు. ఏమంత అందగాడు కాడు. భార్య క్రమశిక్షణలో బంగారు తండ్రిలా బాధ్యతగా ఉంటూ ఒడుదుడుకులు లేకుండా కాలం గడిపేవాడు. ఒక వేసవిలో భార్యని కొడుకునీ, కాస్త చల్లగావుండే పల్లెటూరికి పంపిస్తాడు. తాను మాత్రం ఉద్యోగరీత్యా వెనక దిగబడతాడు. సెలవుకదలగానే, క్రమశిక్షణ బంధాలు సడలుతాయి. సిగరెట్ల విషయంలోను, మద్యం విషయంలోనూ తెగుతాయి కూడా. మనసు మరింత 'స్వేచ్ఛ' కోసం అర్రులు చాస్తుంది. ఒక క్షణం తప్పు సుమీ అని హెచ్చరించబోతాడు మనస్సుని. మరో క్షణంసేపు, 'తాను' అనకపోయినా కోటిమంది స్త్రీలు తన కౌగిలికై వాలుతారు అని, అవకి తనే చెప్పుకొని తన సమ్మోహనశక్తిని, కళ్ళు తిరిగే రంగులలో చిత్రించుకుని మురిసిపోతాడు. అయినా తను వాళ్ళందర్నీ కాలతన్ని తృణీకరించగల ఉద్దండుడుగా, ఆత్మనిగ్రహం గలవాడుగా చిత్రించుకొని, కోరికలకు పగ్గాలు బిగించబోతాడు. ఈ పగటి కలలు కనడంలో, ఉద్యోగరీత్యా అతను చదివే కొను చదవవలసి వచ్చే పుస్తకాలు (వెల చవక, సరుకు కారు చవక) చాలా దోహదం చేస్తాయి. అలా కాని పుస్తకాలలోని ప్రణయఘట్టాలన్నీ అతని స్వప్నలోకంలో రూపాలు ధరిస్తాయి.

ఈ అవస్థలో ఉండగా ఒక తరాదోహ అతనికి తటస్థపడుతుంది. అతడు అద్దెకున్న ఇంటి మేడమీద గది ఆమె బస. వేసవి తాపం భరించలేక, అతని గదిలో ఏర్ కండిషనర్ ఉంది గదా అన్న ఊహతోనే ఆ పిల్ల ఒక రాత్రి అక్కడే విశ్రమించడానికి ఉద్యుక్తురాలౌతుంది. అక్కడితో అతని కోరికలూ, ఊహలూ చెట్టాపట్టా వేసుకు చెలరేగుతాయి. కథ ఎలా జరుగుతుందో, ఎలా జరగాలో అతను 'టెక్నికలర్ సినిమాస్కోప్‌లో' ఊహిస్తాడు. ఒకానొక ముహూర్తాన ఆ ఊహ బయటపడుతుంది. ఆ పిల్ల విస్తుపోతుంది. తన గదికి వెళ్ళిపోతుంది.

అక్కడితో అతని ఊహాశక్తి తిరిగి విజృంభిస్తుంది. ఈసారి కొత్త పంథాలో నడుస్తుంది. ఆపిల్ల తన దుశ్చేష్టను అందరికీ చెప్పి అల్లరిపాలు చేస్తుందని భయం పట్టుకుంటుంది. ఆ భయం తోటంగా తనకు విశేష ప్రాధాన్యం ఇచ్చుకుని, జరగబోయే కథను ఊహించుకుంటాడు. ఈ రెండో అవస్థలో ఉండగా, అమ్మకి వచ్చిన ఒక 'సైక్రియా' శాస్త్రీయ గ్రంథం చదువుతాడు. ఏడేళ్లు కాపురం చేసిన దంపతులలో, భర్తలకు ఏడో ఏడు మనసు చలించి, అన్యకాంతలపైకి పోతుందని, ఈ ప్రవృత్తి అతిసహజమని అందులో ఒక సిద్ధాంతం. గత రాత్రి తన చర్యనందిన్నీ అన్వయించుకోగానే, అతనికి తెలియకుం

పూనుకొని, అందుకు శ్రీ బిమల్ రాయ్‌ని నియోగించింది. కళాసాంస్కృతికరంగాలలోనూ, మతవిషయకంగానూ మన దేశంలోనూ, ఇతరదేశాలలోనూ ఉన్న బౌద్ధమత ప్రభావాన్ని, ఇందులో చిత్రిస్తారు.

మూడవ చిత్రం సంయుక్త నిర్మాణం. జపాను ప్రభుత్వమూ, అక్కడి భారత రాయబార కార్యాలయ పత్రికా వ్యవహారాల శాఖాధికారి డా॥ గంజూ ఇందుకు పూనుకొన్నారు. షోహేకొసుషా దీనికి దర్శకుడు. నిమ్మి నాయిక. హిందీ, జపానీస్, ఆంగ్లభాషలలోను, వీలునుబట్టి ఇతర భాషలలోనూ దీన్ని నిర్మిస్తారు.


ఈ మూడిటిలోనూ బిమల్ రాయ్ చిత్రమే ముందుగనుక తెరకెక్కుతుంది. జయంత్యుత్సవాలు ప్రారంభం అయ్యే రోజున మే 23 నే దీన్ని విడుదల చేస్తారు. చేతన్ ఆనంద్ చిత్రం 'అంజలి' ఈ సంవత్సరం ఉత్తరార్థంలో విడుదల అవుతుంది.

* * *

మహబూబ్ నిర్మించే 'హబ్బా ఖటూన్'లో నాయిక భూమిక నిర్వహించాల్సిన నర్గీస్ ఆ ఆలోచన విరమించుకుంది. రాజ్‌కపూర్ పెద్ద ఎత్తున నిర్మించ తలపెట్టిన "అజంతా" చిత్రంలో పని ఎక్కువగా ఉండడంవల్ల ఇందుకు కారణమని నర్గీస్ చెప్పింది. అయితే 'హబ్బా ఖటూన్'లో నాయకుడు దిలీప్‌కుమార్ అయినందువల్ల, అతనితో నటించడం ఇష్టంలేకనే ఆమె హఠాత్తుగా ఈ నిర్ణయం చేసిందని భావించబడుతున్నది. ★



శ్రీ నవశాయీ ఫిలింస్ వారి 'నలబావా' చిత్రానికి ఇటీవల మద్రాస్‌లో ప్రారంభోత్సవం జరిగింది. మొదటి 'షాట్'కు రేలంగి వేషం కట్టారు. జగ్గయ్య క్లాప్ కొట్టాడు. 'టేక్' పూర్తి కాగానే, "ఇదేం చోక్కా అయ్యా ప్రొడ్యూసర్!" అంటూ ఛలోక్తిగా సహనిర్మాత చంద్రశేఖర్‌ను రేలంగి దబాయిస్తున్నాడు. కెమెరావద్ద నిలచినవారు దర్శకుడు రజనీకాంత్.



రాజ్యం పిక్చర్స్ వారి "హరిశ్చంద్ర"లో ఒక సన్నివేశం.

[illegible]

తప్పిన అశుభం

వివాహం అంటే అందరి దృష్టిలోనూ శుభంగానే కనిపిస్తుంది. కాని గోపాలం దృష్టిలో అదిమాత్రం అశుభంగానే పరిణమిస్తోంది. ఆశించిన అమ్మాయి దొరకకపోడం, అక్కర్లేని అమ్మాయిని బలవంతంగా వరించమనడం, అన్ని విధాలా నచ్చి, అన్నీ స్థిరపరచుకున్న అమ్మాయి, ఏదో హఠాత్తుగా మీదవచ్చి పడిన ఆటంకాలు, ఆపదలవల్ల, తప్పిపోవడం, చూస్తోంటే పెళ్లి అనేది తన విషయంలో అశుభంకాక మరేమిటి అని అనిపిస్తోంది గోపాలానికి. పెళ్లిఅనేది తన విషయంలో పూర్తిగా అశుభం కనుకనే ఏదో వంకమీదుగా దైవం తన పెళ్ళి తప్పిస్తున్నాడనే తాత్విక నిర్ధారణకు కూడా వచ్చేశాడు గోపాలం.

ఒకరోజు హోటల్లో కూర్చున్నాం నేనూ, గోపాలం, ఒక కప్పు కాఫీ త్రాగుతూ.

అదోక విషణ్ణమైన దైన్యంతో ముఖం పెట్టాడు గోపాలం తీవ్రంగా ఆలోచిస్తూ.

అతని, జాలిచూసి 'ఏమిటి?' అని ప్రశ్నించాను.

మంచి యౌవనంలోఉన్న గోపాలం మానసికంగా అంత మథనపడుతున్నాడంటే అందులో నాకు తప్పేమీ కనిపించలేదు.

గోపాలం అన్నాడు "బాహ్యమైన పరిస్థితులన్నీ" చూస్తోంటే పెళ్ళి నాకు అశుభంగా తోస్తోంది. కాని మానసిక వేదన చూస్తోంటే పెళ్లి కావాలి అనే తొందర ఎక్కువ ఔతోందిగాని అది జరగటం లేదు. ఈ రెంటి సంఘర్షణమధ్య పరిష్కారం దొరకక సతమతమౌతున్నానంటే నమ్ము. అతని హృదయంలోంచి బాధ ఉద్వేగంగా ఉబికి, వేడి ఆవిరులు నా ముఖాన్ని ఆవరించాయి.

"నీ పరిస్థితులు చెప్పు దానికి పరిష్కారం నే చెబుతా" అన్నాను.

గోపాలం తన కథ అంతా వినిపించాడు.

* * *

చిన్నప్పుడు గోపాలం, చంద్రప్రభ, కలిసి ఆడుకుని చిగుర్చుకుని ఆనందించేవారు. చిన్న అపురూపాలా నిగనిగలాడే కళ్ళతో, చిలిపి అల్లరి చేస్తూ, నవ్విస్తూండే చంద్రప్రభఅంటే గోపాలానికి అపరిమితమైన అభిమానం ఏర్పడిపోయింది. తండ్రి గతించిన తర్వాత గోపాలం, తన అక్కయ్యదగ్గర పెరగవలసి వచ్చింది. అతనితల్లి, అతను పుట్టగానే చచ్చిపోయింది. గతించిన తండ్రి గోపాలానికి ఆస్తి ఏమీ వదలలేదు. అందువల్ల అతని భారమంతా అతని అక్కయ్యమీద పడింది. కూతురు చంద్రప్రభ అంటే ఎంత వాత్సల్యమో, తమ్ముడు గోపాలం అన్నా అతని అక్కయ్యకు అంతేఅభిమానం ఉండేది ఇద్దరినీ సమానంగాఆదరిస్తూ వారిని చూసి సంతోషించేది ఆమె.

గోపాలానికి పదునాలుగుసంవత్సరాలు, చంద్రప్రభకు పన్నెండు సంవత్సరాలు ఉండేవి. ప్రపంచమంటే కొద్దో గొప్పో గోపాలం అర్థంచేసుకునే రోజులు అవి. నిత్యజీవితంలో తన ఎదురుగా అనేకమంది దంపతులు, కంటిముందే అబ్బాయిలకు, అమ్మాయిలకు పెళ్ళిళ్ళు జరగడం చూస్తు

పోతుకూచి సాంబశివరావు

న్న గోపాలానికి, చంద్రప్రభతో తనకు పెళ్ళిఅయితే బాగుంటుందనీ, కోరిక కలగకపోలేదు. ఆకోరిక మొలకలెత్తి, వ్యక్తం అవుతూంటే, అది జీవితంలోని ఒక మార్పు తుఫానువల్ల పెకలింపబడి ఒరిగిపోయింది.

గోపాలం అక్కయ్యకు అతనిమీద ఎంత అభిమానం ఉన్నా, పేదవానికి పిల్లనిస్తే, తనకూతురు సుఖపడదనే, ఉద్దేశ్యంవల్ల కలిగిన స్వార్థం ఆమెను విడవలేదు. అన్నెం పున్నెం ఎరుగని చంద్రప్రభకు తను ఆనందంకోసం, తలితండ్రులు, ఆమె చిన్నతనంలోనే పెండ్లి చెయ్యాలని నిశ్చయించారు.

ఒకరోజు గోపాలం పుస్తకం చదువుకుంటూ కూర్చున్నాడు.

'మామయ్యా!' అంటూ కలకల నవ్వుతూ వచ్చింది చంద్రప్రభ.

పుస్తకంమూసి, ఆమె నవ్వు చూస్తూ ఆనందంగా కూర్చున్నాడు గోపాలం.

'ఏమిటి అలా చూస్తావు?' అంటూ మళ్ళీ నవ్వింది చంద్రప్రభ.

'ఎందుకు అలానవ్వుతావు?' అడిగాడు గోపాలం ఆమె విపరీతమైన నవ్వుకు కోపం తెచ్చుకుంటూ.'

"నాకు, పెళ్ళట, మామయ్యా...... పెళ్ళిట!" మళ్లీ గట్టిగానవ్వింది చంద్రప్రభ.

గోపాలం విని ఆశ్చర్యపోయాడు.

చంద్రప్రభ నవ్వు హఠాత్తుగా ఆపు చేసింది.

"మామయ్యా! నిన్ను పెళ్ళిచేసుకుంటా నంటే, అమ్మ ఒప్పుకోలేదు" మనిద్దరం పెళ్లి చేసుకుంటే బాగుండదు మామయ్యా.."

గోపాలం మౌనం వహించాడు. సంగతులన్నీ అర్థమౌతున్న గోపాలం మౌనమే శరణ్యమనుకున్నాడు.

'ప్రభా! నే చదువుకోవాలి, నువ్వు వెళ్ళిపో' అన్నాడు గోపాలం చికాకుగా, ఒంటరిగా ఆలోచించుకుందామని.

అతని చికాకును అర్థం చేసుకోలేక అపార్థం చేసుకుని వెళ్ళిపోయింది, చంద్రప్రభ.

ఆశించిన అమ్మాయి దొరకలేదు. చంద్రప్రభ పెళ్లి జరిగిపోయింది. తన స్నేహితుడే, రమణయ్య ఆమెను పెళ్లి చేసుకున్నాడు. రమణయ్య గోపాలానికి ముఖ్య స్నేహితుడు. చంద్రప్రభ అంటే ఎంత అభిమానమో, రమణయ్య అంటే గోపాలానికి అంత స్నేహాబంధం.

వయసు వచ్చి కాపురం చేస్తోంది చంద్రప్రభ. కాని ఆమెలో చాలా మార్పు కనిపించింది గోపాలానికి ఆరు సంవత్సరాలు గడిచాక. చంద్రప్రభ మాటల్లో ఏదో అసంతృప్తి ఉన్నట్టు గోపాలానికి కనిపిస్తోందేది. రమణయ్య పొదుపరి. గారాబంగా పెరిగిన చంద్రప్రభ విచ్చలవిడిగా ఖర్చు పెట్టే మనిషి. సినిమాలు, క్లబ్బులు, స్నేహాలు పెంచుకుని యింటిపట్టు నిర్లక్ష్యం చేసేది. రమణయ్య సంసారజీవితం పరిశీలించిన గోపాలానికి చంద్రప్రభను పెళ్లి చేసుకోకపోవడమే చాలా మంచిదనిపించింది చాలసార్లు. జీవితంలో ఆనందం యివ్వలేని భార్యలుండేకంటే, అసలు లేకపోవడమే చాలా మంచిదనిపించింది అతనికి. చంద్రప్రభతో తన పెళ్లి జరగకపోవడం, ఒక అశుభం తప్పిపోయినట్లే అని సంతృప్తిపడ్డాడు గోపాలం. వయసు వస్తోంటే, అక్కయ్య, బావ, గోపాలం పెళ్లికి పూనుకున్నారు. అవతావి

★ తప్పిన అశుభం ★

గారు గోపాలానికి కావలసిన దూరపు బంధువు. కొద్దోగొప్పో ఆస్తివుంది. శ్రోత్రియమైన ముఖవర్చస్సుతో, గంధాక్షతలు పెట్టుకున్నప్పుడు ఆకారంలో ఆయన శివలింగంలా కనిపిస్తారు. సంప్రదాయంలో, బంధు అభిమానంలో కీర్తి గడించిన ఆయన కుటుంబం అంటే గోపాలం అక్కయ్యకు, బావకు చాలా గౌరవం. అవధానిగారు తన కూతురు నిర్మలను గోపాలానికిచ్చి పెండ్లి చేయించవలసిందని కోరారు. అందుకు చాల ఆనందించి సమ్మతించారు అతని అక్కయ్య, బావ.

గోపాలం చూశాడు నిర్మలను.

కొంచెం లావుపాటి అజంతా బొమ్మలా వుంది నిర్మల. పదిహేడు సంవత్సరాలు. వీణ వాయించింది. ఇంగ్లీషు చదివింది. చిలక పలుకులుగా తన పేరు చెప్పి, అడిగిన ప్రశ్నలకు సమాధానం చిరునవ్వుతో సహా యిచ్చింది. అక్కయ్య బావ, బాగా ఆనందపడినట్లు తెలిసింది గోపాలానికి. కాని గోపాలానికి మాత్రం సంతృప్తి కల్గలేదు.

దానికి కారణం నిర్మల ఛాయ. ఆమె రంగు మసిబొగ్గును మించినది. నలుపురంగు, లావుపాటి శరీరంతో, నిర్మల, దేవాలయం లోని రాతి స్తంభంలా కనిపించింది గోపాలానికి. కొన్ని రాళ్లు సప్తస్వరాలు పలుకుతాయి మోగిస్తే. అలాగే నిర్మలకు కూడా సంగీతం అబ్బిందనుకున్నాడు గోపాలం. సౌందర్యమూ ప్రక్కన ఉండవలసిన భార్యకు ఆకార వర్చస్సులు ప్రధానం కాని, తక్కిన లక్షణాలు అవసరం కావు అని తోచింది గోపాలానికి.

నిర్మలను పెళ్ళి చేసుకోనన్నాడు గోపాలం. గోపాలాన్ని తప్ప మరొకర్ని పెళ్ళి చేసుకోనన్నది నిర్మల, అతని తెలివి తేటలు గురించి విని.

గోపాలం ఆమెను పెళ్ళిచేసుకోవాలని అక్కయ్య బావ, పట్టు పట్టారు.

చంద్రప్రభ హేళనగా నవ్వింది ఈ పెళ్ళి విని.

గోపాలానికి ముచ్చెమటలు పోశాయి, నిర్మల బలవంతంగా భార్య అవుతుందేమో అని. రెండు సంవత్సరాలు గడిచినా ఆ పెళ్ళి సంబంధం బిగి తగ్గలేదు.

గోపాలం, ఆ బిగివల్ల ఊపిరాడక, ఒకరోజు పారిపోయాడు.

నిర్మల అంతటితో మనస్సు మార్చుకుంది

అవధానిగారు పరిస్థితులు అర్థం చేసుకున్నారు.

నిర్మలకు మరొకరితో పెండ్లి అయిపోయింది.

కురూపియైన పిల్లతో జరగవలసిన పెళ్లి అనే అశుభం తప్పిపోయిందని సంతోషించి, ఇంటికి తిరిగి వచ్చాడు గోపాలం.

మళ్ళీ ఎన్నో సంబంధాలు వచ్చాయి గోపాలానికి. తన యౌవనజీవితం వ్యర్థం కాకూడదని ఒక మంచి సంబంధం ఏరుకున్నాడు గోపాలం అందచందాలు, ఆస్తిపాస్తులు, సంప్రదాయ గౌరవాలు, అన్నీ పరిశీలించగా, ఆ సంబంధం చాలా అనుకూలంగావుందని, గోపాలం చాలా అదృష్టవంతుడని అందరూ అన్నారు. కాబోయే భార్య పేరు శశి. ఆమె అందం గురించి ఆలోచించి జీవితం ధన్యమయింది అనుకున్నాడు.

ముహూర్తం నిశ్చయించారు.

మర్నాడే పెళ్ళి.

గోపాలం బావగారు చాల సందడిగా పెళ్ళి కార్యక్రమాలు చేయిస్తున్నారు. బంధువులతో యిల్లు కలకలలాడింది. అంతటా ఆనందం తాండవించింది.

గోపాలం బావగారు భోంచేసి తాంబూలం వేసుకుని కుర్చీలో కూర్చున్నారు. ఏదో తమాషాగా ఆలోచిస్తూ 'గోపాలం', అని పిలిచారు.

'వస్తున్నా బావా!' అంటూ దగ్గరగా వచ్చాడు గోపాలం.

'ఏం బావా!'

'..........

"ఏం బావా?"

"..............."

గోపాలం, తన బావవైపు తేరిపారి చూశాడు. 'అక్కయ్యా!" అంటూ ఒక పెద్ద కేక పెట్టాడు.

అతని అక్కయ్య, బంధువులు, పరుగెత్తుకొచ్చారు లోపలినుంచి.

గొల్లున ఏడ్చింది అతని అక్కయ్య. గోపాలం నిశ్చేష్టుడయ్యాడు. బంధువులు కూడా ఏడ్పులో శ్రుతికల్పారు. "పాపం! గోపాలం బావ చనిపోయాడంటూ,"

శుభమా అని పెళ్ళి చేసుకుందామని, చాలా కాలం తర్వాత మంచి సంబంధం ఏరుకుని, మంచి ముహూర్తం నిర్ణయించుకుంటే ఈ అశుభం ఏమిటని గోపాలం విస్తుపోయాడు. బంధువులంతా అన్నారు "కాబోయే భార్య తార మంచిది కాదు, శని దేవత" అని. కావచ్చు అనుకున్నాడు గోపాలం. ఈ పెళ్ళి మానెయ్యమన్నారు అంతా. ఏంగాక? శశి అందం చూస్తుంటే గోపాలం తన్మయుడై పోయాడు.


గోపాలం తన బావ అంత్యక్రియలు పూర్తి చేశాడు. కాని శశిని పెళ్ళి చేసుకుంటానని పట్టుపట్టాడు. అందువల్ల ముహూర్తం మాత్రం వాయిదా వేశారు.

వాయిదా వేసిన ముహూర్తం వచ్చింది. పెళ్ళి ప్రయత్నాలలో సగం కళ తగ్గినా, ఆ శుభసమయం మాత్రం తప్పనిసరిగా దగ్గరకు వచ్చింది.

ఎక్కడినుంచో ఒక పెద్దమనిషి పంచె బిగించుకుని పెద్ద మనిషిలా వచ్చి ఒకకబురు చల్లగా విడిచాడు, "పెళ్ళికూతురు కనిపించటం లేదని." "ఏం?" అన్నారు గోపాలం వైపు పెళ్ళిపెద్దలంతా. మెల్లిగా ఊదాడు ఆయన కళ్లు త్రిప్పుకుంటూ "పెళ్లికూతురు తన బావగారితో లేచిపోయిందట." "ఆ!" అని పిల్లగిత్తలా పడ్డారు కొందరు పెళ్ళి పెద్దలు. గోపాలం గుండె ఆగిపోయినంత పని అయింది.

ఒక పెళ్ళిపెద్ద సూక్ష్మమయిన ప్రశ్న నిశితబుద్ధితో వేశాడు, "బావ అంటే...... అక్క మొగుడా?" అని. "కాదులెండి... పెళ్ళికాని బావట" సమాధానం వచ్చింది.

పెళ్ళి పెద్దల ఉద్రేకమంతా చప్పబడిపోయింది. గోపాలం వేడి వేడి సంతోషమంతా చల్లబడి పోయింది. పెళ్ళి కూతురు



క్లోజప్!

ఫోటో: ఎ. వి. రామమూర్తి - మాయావరం.

పన్నెత్తాకు ప్రకటించుకుంది; అది ఉంచింది కొంతవరకు.

తెలివిపోయే లక్షణాలు కల్గిన అమ్మాయిని పెళ్ళి చేసుకుని ఏమి ఆనందించగలం అని గోపాలం సమాధానపరుచుకున్నాడు తన్ను. బాగా ఆలోచించి, నిజంగా తనకు ఒక అభిరుచికర మయిన అమ్మాయితో పెళ్ళి జరిగే ఒక అదృష్టం తప్పిపోయిందని చాలా సంతోషించాడు గోపాలం.

* * *

ఇది జరిగాక కొంత విరక్తి కలిగినా, తిరిగి తల్లిదండ్రుల కోర్కె కలిగి పెళ్ళికి ఒప్పుకోవల్సి వచ్చింది గోపాలానికి. పెద్దల సలహా చాలా పట్టుదలతో చేసి వారి అనుగ్రహం సంపాదించి, మరికొన్ని సంబంధాలు చూడసాగారు. సంబంధాలకై మళ్ళీ ప్రయత్నాలు చేయించాడు గోపాలం. ముందుగానే తెలుసుకొని గోపాలానికి పిల్ల నచ్చుతుందో లేదో, వాళ్లు ఎక్కువ తనిఖీ చేశారు. చాలా తర్కించేసి, చివరకు ఒక సంబంధం మాత్రం ఒప్పుకున్నాడు గోపాలం.

కాని పిల్లవాడిని చూస్తేకాని ఒప్పుకోమని ఆ సంబంధం వాళ్లు అన్నారు. అందువల్ల పెళ్లి చూపులు ఏర్పాటు చేశారు.

పిల్ల పేరు లక్ష్మి. పదహారేళ్లు. నిజంగా లక్ష్మిలా కళకళలాడుతూ కనిపించింది. బాగా చదువుకుంది. సంబంధం చాలా బాగుందనిపించింది గోపాలానికి. ఇంక ఒప్పుకోవడమే తరువాయి.

"అమ్మాయికి ఎన్ని ఏళ్లు" పిల్లతండ్రి గోపాలం తరఫు పెద్దను ప్రశ్నించాడు.

"పదహారేళ్లు! ఈ కాలంలో పెళ్ళి చేసుకోడానికి సరైన వయస్సు కదండీ!" అన్నాడు పెళ్ళి పెద్ద సాగదీసుకుంటూ.

"అది నిజమే లెండి!" అంటూ పిల్లతండ్రి ఒక నవ్వు నవ్వి పెదిమ విరిచాడు.

ఆ పెదవి విరుపులో, ఈ అమ్మాయికి మూడేళ్ళు ఎక్కువ వయస్సు ఉంటుందని చెప్పకనే చెప్పినట్లు, ఎన్నో సంగతులు గోపాలానికి స్పష్టంగా కనిపించింది. అంతే మళ్ళీ ఆ విషయంగానే కలవరపాటు వచ్చేసింది గోపాలానికి.

★ తప్పిన అశుభం ★

లక్ష్మి పెళ్ళి అయిపోయింది.

అయిన రెండేళ్ళకు రమణయ్య అన్నాడు ఒకరోజు గోపాలంతో. "నువ్వు అదృష్టవంతుడివేరా" అని.

"ఏం" అన్నాడు గోపాలం. తన అదృష్టం కనిపించక తడుముకుంటూ.

"ఆనాడు లక్ష్మి అనే అమ్మాయిని చూశావుకదూ! జ్ఞాపకముందీ, ఆ అమ్మాయికి క్షయరోగంట! ఆ పెళ్ళి చేసుకున్నవాడు నన్నెరుగునులే!... చెప్పాడు ఒకరోజు మందు తెస్తూ" అన్నాడు రమణయ్య!

గోపాలానికి యిప్పటికి అర్థమయింది ఆ పెళ్ళి కూడా ఎందుకు దైవం తప్పించాడో. పెళ్ళిచూపులనాడు నిజంగా ఆ అమ్మాయి కివటలా ఉంది. కాని క్షయ ఉంటుందని, తనెలా గ్రహించగలడు? "నయం! పెళ్ళి జరిగిందికాదు. నానా అవస్థ పడవలసి వచ్చేది" అనుకుని, తన జీవితంలో మరొక అశుభం తప్పిపోయిందని సంతోషించాడు గోపాలం.

* * * *

గోపాలం చెప్పిన కథలన్నీ విన్నాను.

"కాలం జరిగిపోతుంది కాని పెళ్ళి కావటం లేదు. ఈ అశుభాలన్నీ చూస్తోంటే పెళ్ళి మానేస్తేనే మంచిదనిపిస్తోంది. ఒక్కొక్కసారి. కాని పెళ్ళిచేసుకోవాలనేకోరిక చచ్చిపోవటం లేదు." అన్నాడు గోపాలం నిట్టూర్పుతో.

తనతో పెళ్ళి జరగనంతమాత్రాన, ఆ అమ్మాయిలపై దృక్పథం మార్చుకుని, తనకు వినో సంతృప్తి తెచ్చుకొని, వారిని నిరసనగా, దుర్భావంతో గోపాలం పరిశీలించడం నాకు నచ్చలేదు. గోపాలానికి ఒక పాఠం చెప్పాలనుకున్నాను.

"గోపాలం! జీవితంలో అనేకమైన విచిత్ర సంఘటనలు జరుగుతాయి. అంతమాత్రాన నిరాశపడి పెళ్ళిమానడం కాని, పెళ్ళి అవదనుకోడం కాని తెలివి తక్కువ. ఎవరికి తగ్గపిల్ల వాళ్ళకు దొరుకుతుంది. అయినా నీహస్తం చూడనీ ఎప్పుడో పెళ్ళి సాముద్రికం చెబుతా" అన్నాను.

"నిజంగా నీకు సాముద్రికం వచ్చా! అబద్ధమాడుతున్నావా" గోపాలం శంకించాడు.

నాకు సాముద్రికం కొద్దిగా తెలిసినా, నిర్దుష్టంగా చెప్పగలిగే శక్తిలేదు.

"నిజంగా, బాగా వచ్చు" అని బొంకాను.

"ఓరి! ఎప్పుడూ చెప్పావుకాదే?... అయితే చెయ్యిచూడు!" అంటూ ఆత్రుతతో చెయ్యిచాపించాడు గోపాలం. గోపాలం హస్తం తీవ్రంగా పరిశీలించాను. ఒక్క నిట్టూర్పు విడిచాను ఆలోచనతో.

'ఏమిటిరా ఆముఖం నువ్వూను' అన్నాడు గోపాలం చిరాకుగా.

'నిన్ను ఒక ప్రశ్న వెయ్యాలి, అసలు సంగతి చెప్పేముందు.'

'వెయ్యి'

'నువ్వు ధైర్యవంతుడివేనా ?'

'ఓరి యిదా నీ ప్రశ్న. నా శరీరం చూశావా ... పిడుగులాంటి మనిషిని. ఎవరినైనా సరే, ఒక గుద్దు గుద్దితే పాతాళంలోకి పోగలడు !' అంటూ నవ్వి, తనచిన్న మీసం దువ్వాడు గోపాలం.

"ఊ... అలాగా... నువ్వు పెళ్ళిచేసుకోవాలని అనుకుంటున్నా, పెళ్ళిమాత్రం చేసుకోకు !" అన్నాను తీవ్రంగా.

"ఏం" అన్నాడు ముఖం ముడిచి గోపాలం.

"నువ్వు ఎన్నేళ్ళు బ్రతకగలవనీ నీ ఉద్దేశ్యం ?"

"ఓ డెబ్భై ఏండ్లు నిరాటంకంగా బ్రతుకుతాను" అంటూ గట్టిగా నవ్వాడు గోపాలం.

"అట్టే నవ్వకు. నువ్వు ఏడురోజుల్లో చచ్చిపోతావు. తప్పదు."

"ఆహా!..." అంటూ హేళనగా గట్టిగా నవ్వాడు గోపాలం. నేను మౌనంవహించి అతన్ని పరిశీలించాను తీవ్రంగా.

"గొప్ప జ్యోతిషంలే!" గోపాలం మరీ గట్టిగా నవ్వాడు.

గోపాలం అంత గట్టిగా నవ్వుతున్నా ఆ నవ్వు ముఖం చిట్లింపులలో ఉబుకుతూ ఛాయల్లా విషాదరేఖలు కనిపించకపోలేదు నాకు.

కాఫీ త్రాగడం ముగించి బయటికి వచ్చాం యిద్దరమూ.

గోపాలం బాగా ఆలోచనలో పడ్డాడు.

"ఒక్కొక్కసారి నా భావాలు తప్పు దారిన వెడుతూంటాయి అనిపిస్తుంది" అన్నాడు గోపాలం సాలోచనతో నడుస్తూ.

నేను గోపాలం ముఖం పరిశీలించాను.

"నేను నీ సాముద్రికం నమ్మను. కాని ఒక వేళ అది నిజం అయితే నన్ను పెళ్ళి చేసుకుంటే ఒక వేళ వైధవ్యం పొంద వలసిన అశుభం యీ అమ్మాయిల కందరికీ తప్పిందన్న మాట! అందుకే నాకు పెళ్ళి కాలేదేమో!" అన్నాడు గోపాలం ఒక నిట్టూర్పు విడుస్తూ.

సరిగా యీ భావమే గోపాలానికి కలగాలని నేను ఆవిసంగా సాముద్రికం చెప్పాను.

గోపాలం మళ్ళీ అన్నాడు ఆలోచిస్తూ "నాకు తప్పిపోయిన సంబంధాల అమ్మాయిలందరూ, నేను చచ్చిపోతానని తెలిసి, పెళ్ళి మానేసినట్లు నన్ను చూసి హేళనగా నవ్వుతున్నట్లు కనిపిస్తోంది. చంద్రప్రభను నిర్లక్ష్యంగా మార్చిన ఆమెలోని ఆదరింపబడని అనురాగంవల్ల కలిగిన అసంతృప్తి; నిర్మల నల్ల శరీరంలోంచి తొంగి చూచే తెల్లకళ్ళల్లోని నైర్మల్యం, శాంతం, ప్రేమ, సంఘాన్ని కట్టుబాట్లను నిరసించి, తన ప్రేమ త్యాగానికై శశి చూపిన ధైర్యం, క్షయరోగికి నిత్యం సేవ చేయడానికి వను కాడని లక్ష్మి భర్త ఓరిమిలో తొంగిచూచే అనురాగబంధం, అర్థం చేసుకోకుండా, ఆ అమ్మాయిలను అశుభగ్రహాలని తలచాను" అంటూ వ్యాఖ్యానించాడు గోపాలం.

గోపాలం మనస్సు తెగని ఆలోచనలలో నిత్యమూ సతమతమవుతుందని తెలుసు నాకు. అతనికి యింక బాధ కలిగించదలచుకోలేదు.

"నేను చెప్పిన సాముద్రికం అబద్ధం గోపాలం?" అన్నాను.

విచిత్రంగా, వ్యంగ్యంగా ఒక నవ్వు నవ్వాడు గోపాలం.

మేము విడిపోయి ఎవరి యిళ్ళకు వాళ్లు వెళ్లిపోయాము.

వారం రోజులు గడిచాయి. గోపాలం చచ్చిపోయాడని వార్త వచ్చింది. నేను చాలా బాధపడ్డాను.

గుండె ఆగి చనిపోయాడని కొంతమంది. విషం త్రాగి చనిపోయాడని కొంతమంది అన్నారు. కాని నా సాముద్రికంలోని నిజం యొక్క అంతరార్థం అతని మానసిక పరిణామంలో ఊహించుకుని తెలుసుకున్నాను.

నేను పలికిన అశుభంలోని నిజం, గోపాలం జీవితంలో పెళ్ళికాక తప్పిపోయిన అమ్మాయిలకు ఒక అశుభం తప్పిందని నిర్ధారణ చేసినట్లనిపించింది. ★



అమెరికా సోదరీగణము ★ ఇల్లిందల సరస్వతీదేవి

జీవిత లక్ష్యము మీద ప్రబలమైన విశ్వాసము ఉన్న మనిషి ఎటువంటి సాహస కార్యమునయినా సాధించగలడు. ఈ విధమయిన విశ్వాసము గలది కనుకనే, శ్రీమతి మార్గరెట్ పాప్‌హామ్ పోలియో వ్యాధి పీడితురాలయినప్పటికీ, వికలాంగులనూ అవిటివారినీ ఉద్ధరించడానికి దేశాలన్నీ పర్యటిస్తున్నది. ఇటీవల భారతదేశము కూడా వచ్చి బొంబాయిలో పదిదినములు ఉండి, శ్రీమతి ఫాతిమా ఇస్మాయిలు నడుపుతున్న వికలాంగుల సంస్థను దర్శించింది.

శ్రీమతి మార్గరెట్ పాప్‌హామ్ వే అమెరికా దేశపు స్త్రీ. ఆమెకు 20 వ ఏట పోలియో వ్యాధి వచ్చి, మెడనుండి పాదమువరకూ వాతము కమ్మింది. వెంటనే, ఫిజియో థెరపీ ఉపచారము రెండు సంవత్సరముల కాలము పొందటముచేత, దండకర్రల సహాయముతో నడువ గలిగింది. వాటి సహాయముతో నడచిన తరువాత ఆమె వివాహము చేసుకొన్నది. ఒక కుమారుడూ ఒక కుమార్తె కలిగారు. వారిద్దరూ పెరిగి పెద్దవారయిన తరువాత వివాహాలు చేసి, ఆమె తిరిగి విద్యాభ్యాసం లోనికి దిగింది. తత్ఫలితముగా సైకాలజీ ఎం. ఏ పట్టము నందుకొన్నది. అవిటితనముగానీ, వయోధిక్యత గానీ ఎం.ఏ. పట్టము నందుకోవటానికి ఆమెకు ఆటంకం కాలేదు. సాధారణముగా 30 సంవత్సరాలకు పైగా వయసు కలవారికి పరీక్షకు వెళ్ళటానికి అనుమతి లభించదు. కాని మార్గరెట్ పరిస్థితులు అసాధారణ మయినవి కనుకనే ఆమెకు అనుమతి లభించింది. ప్రస్తుతము ఆమె కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంలో పరిశోధన చేస్తున్నది.

అంగవైకల్యము కలిగినప్పటికీ ఆమె సాధించిన కృషికి, వ్యక్తిగతమయిన శక్తి సామర్థ్యాలతోపాటు దేశ పరిస్థితులుకూడా తోడ్పడ్డాయి. అమెరికా దేశములో బాలబాలికలకు విద్య నిర్బంధము. ఉన్నతవిద్యాభ్యాసానికి బాలురకి కల్పించిన అవకాశాలు బాలికలకుకూడా కల్పింపబడ్డాయి. బాలబాలికలకు ప్రత్యేక విద్యాసంస్థలు కొన్ని, సమిష్టిగా కొన్నీ నెలకొల్పబడ్డాయి. సెకండరీ పాఠశాల విద్య ముగించిన బాలిక, సాధారణముగా కళాశాలలో ప్రవేశించి చదువుతుంది. ప్రత్యేక విద్యాసంస్థలో గాని సహవిద్యాసంస్థలో గాని విద్యార్జన చేస్తుంది. బాలబాలికలు వీలయినప్పుడల్లా వ్యవసాయపు పనులు, పశుపాలన, తోట పనులలో, పౌరసంబంధమయిన కార్యక్రమాలలో పాల్గొంటూ ఉంటారు. క్రీడలలో కూడా బాలబాలికలు సమానాధికారముతో పాల్గొంటారు. స్త్రీ పురుష తారతమ్యము దేనిలోనూ పాటింపబడదు.

అమెరికాలో కన్యకు వివాహకాలము 21 లేక 22 సంవత్సరాలు. తల్లికి ముగ్గురు సంతానము మాత్రమే ఉండటమూ, మూడవ బిడ్డ తల్లికి 28 సంవత్సరాల లోపుగా జన్మించటమూ ఆ దేశస్థులు సహజమనుకుంటారు.

టువంటి దానిని ఆదర్శ కుటుంబమని చెప్పుకుంటారు.

అమెరికా దేశములో పరిస్థితుల ననుసరించి కొద్ది కుటుంబాలు మాత్రమే ఇంటి నౌకర్లను నియమించుకోగలుగుతాయి. అక్కడ ఇంటిపనులు స్వయముగా చేసుకునే గృహిణుల సంఖ్య ఎక్కువ. అక్కడ కుటుంబాల సంఖ్య 43,000,000 కంటె అధికముగా ఉంటుంది. 1,700,000 మాత్రమే ఇంటిపనులు చేసే నౌకర్లు ఉన్నారు. చాలా మంది స్త్రీలు ఇంటిపనులు చేసుకుంటూ ఉద్యోగాలు చేస్తారు. స్త్రీలలో నాలుగవ వంతు విడాకులనుతీసుకొన్నవారు వితంతువులయినవారు ఉంటారు. వారందరూ తమ బిడ్డల జీవనోపాధికి గాను ద్రవ్యార్జన చేయవలసిన వారుగానే ఉంటారు.

ఆ దేశము మొత్తముమీద, 1951 వ సంవత్సరములో ప్రకటింపబడిన లెక్క ప్రకారము, 19,000,000 కార్మికు రాండ్రు ఉన్నారని తేలినది. వీరిలో సగముమంది వివాహితలు, మొత్తము కార్మికులసంఖ్యలో స్త్రీలు నూటికి 31 వంతున ఉన్నట్లు లెక్కలవల్ల తేలినది.

అమెరికా దేశచరిత్రలో పురుషుల కంటె స్త్రీల సంఖ్య అధికముగా ఉన్నట్టు 1951 రిపోర్టువల్ల తేలింది. ఆ దేశచరిత్రలో స్త్రీల సంఖ్య అధికమవటము అది మొదటి సారిగా నిర్ణయించబడ్డది. అమెరికా స్త్రీలకు ఓటుచేసే అధికారము 1920 లో లభించింది. సంయుక్త రాష్ట్రాలలో ఓటుచేసే అర్హతగలవారిలో సగానికి పైగా స్త్రీలు ఉన్నారు. సంయుక్త రాష్ట్ర కాంగ్రెసులో 50 మంది స్త్రీలు పనిచేసినట్లు 1951 రిపోర్టు ప్రకటించింది. ఇద్దరు గవర్నరు పదవి నలంకరించారు. అధ్యక్షుడి మంత్రివర్గములో ఒక మహిళకు స్థానము లభించింది. ప్రతినిధుల సభలో ఎనిమిదిమంది పనిచేశారు. 82 వ సంయుక్త రాష్ట్ర కాంగ్రెసు సెనేటులో ఒక వనిత పనిచేస్తున్నది. ప్రభుత్వోద్యోగాలలోను జాతీయ సంస్థలలోను పనిచేసేవారే కాకుండా 235 మంది స్త్రీలు రాష్ట్ర శాసనసభలలో పనిచేస్తున్నారు.

సంయుక్త రాష్ట్ర కళాశాలలలో 727,000 మంది స్త్రీలు ఉన్నట్లు లెక్కలవల్ల తెలుస్తున్నది. పట్టభద్రుల సంఖ్యలో నూటికి 45 వంతున స్త్రీలు ఉన్నారు. విజ్ఞానశాస్త్రము, న్యాయశాస్త్రము, వైద్యము, ఇంజనీరింగు, గణితశాస్త్రము, గానము మొదలయినవాటిని స్త్రీలు అభ్యసించి వృత్తిగా స్వీకరించారు. ఉపాధ్యాయ వృత్తిలో కూడా స్త్రీల సంఖ్య ప్రబలముగానే ఉన్నది. అన్ని రంగాలలో పురుషుడితో సమానముగా, సమానాధికారాలతో ఉద్యోగాలలో ప్రవేశించె అధికారము స్త్రీలకు లభించింది. 4,900,000 మంది స్త్రీలు సంయుక్త రాష్ట్రాలలో గుమస్తాలుగా ఉన్నారు. 8,700,000 మంది స్త్రీలు పారిశ్రామిక కర్మాగారాలలో పనిచేస్తున్నారు. 1,784,000 ఉపాధ్యాయ వృత్తిలోను, ఉపచార వృత్తిలోను ఉన్నారు. 818,000 మంది వ్యవసాయశాఖలో మేనేజర్లుగాను కార్మికురాండ్రుగాను పనిచేస్తున్నారు. 1,264,000 మంది స్త్రీలు విక్రయశాలల్లో వస్తువుల నమ్మటానికి నియమింపబడి ఉన్నారు. అక్కడ కొందరు స్త్రీలు స్వంత వ్యాపారముకూడా చేస్తూఉంటారు.

అమెరికాలో ఏ సంస్థగాని వ్యవస్థగాని సంబంధించని మహిళ ఉండదు. చర్చికి సంబంధించిన సంస్థలలో స్త్రీలందరు ఐకమత్యముతో సాంఘికబలాన్ని సంపాదిస్తారు. స్త్రీలు శాఖోపశాఖలుగా మానవసేవ చేయటానికి బయలుదేరుతారు. ఇటీవల స్త్రీల సంస్థలు అనేకముగా నెలకొల్పబడ్డాయి. వాటిలో కొన్ని అంతర్జాతీయ సంబంధము కలవి ఉన్నాయి. సంస్థలలో సాంఘిక రాజకీయ బాధ్యతలను గుర్తెరిగిన సంఘాలు ఎక్కువ. స్త్రీ ఓటర్ల సంఘము, జనరల్ ఫెడరేషన్ ఆఫ్ విమెన్స్ క్లబ్బు, స్త్రీల ట్రేడ్ యూనియను సంఘాలు వాటిలో చేరినవి. వృత్తి వ్యాపారాలలో ఉన్న స్త్రీలు తమ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అభివృద్ధిపరచి, ప్రతిపత్తిని ఇనుమడింపచేసే సంస్థలను స్థాపించుకొంటారు. ఈ సంస్థలు పౌర సంబంధమైన కార్యక్రమాలలో పాల్గొనటానికి స్త్రీలను ప్రోత్సహించుతూ ఉంటాయి. ప్రపంచ రాజకీయాలలోను సమస్యలలోను అమెరికా దేశపు స్త్రీలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. సంఘాభివృద్ధికి వహించవలసిన బాధ్యతలలో స్త్రీలుకూడా అర్ధభాగము వహించాలన్న భావము అమెరికాలో వృద్ధి అవుతున్నది.

అమెరికా దేశములో గృహిణి స్వయముగా యింటిపనులు చేసుకొని ఇతర కార్యక్రమాలలో పాల్గొనటానికి బయలుదేరుతుంది. అక్కడ ఇంటిపనులు సులభముగా తెమిలిపోయే పనిముట్లు అనేకముగా ఉండటమే దానికి ప్రధానకారణము. ప్రతి ఇల్లాలు విద్యుచ్ఛక్తిని విరివిగా అన్ని పనులకూ ఉపయోగించుకుంటుంది. వంటకు, బట్టలు ఉదకటానికి, ఇల్లు ఊడవటానికి ఆ యిల్లాండ్రకు శ్రమలేకుండా యంత్రసహాయమువల్ల పనులు జరిగిపోతాయి. కట్టెలు బొగ్గులు లేకుండా విద్యుచ్ఛక్తి పొయ్యిమీద వంట తయారవుతుంది. బట్టలకు సబ్బు పట్టించి బండమీద ఉదక అవసరములేకుండా యంత్రముద్వారా [illegible] తాయి. గిన్నెలు పళ్లెలు కడగటానికి ఒక యంత్రము, ఇల్లు ఊడవటానికి ఒకయంత్రము ఆ యిల్లాండ్ర చేతిలో ఉంటాయి.

అక్కడి కార్మిక స్త్రీ ప్రతి సంవత్సరమూ తన కొరకు నాలుగు వస్త్రాలను కొంటుంటుంది. 3 టోపీలు, 11 జతల మేజోళ్లు, 8 జతల బూట్లు ఆమె కనీసావసరాలు.

అమెరికా దేశములో సృజనాత్మకమైన, విజ్ఞానాత్మకమైన అభిమాన కళలను దాదాపు 10,000,000 మంది స్త్రీలు అభ్యసిస్తున్నారు. 1950 లో 17000 మంది స్త్రీలు ఎం. ఏ. పట్టాలను అందుకొన్నారు. 650 మంది వైద్యురాండ్రయినారు.

అక్కడి స్త్రీలు వినోదవిషయముగా తమ ఆదాయాన్ని ఇనుమడింప చేసుకోవాలని తాపత్రయపడుతూ ఉంటారు. కొందరు స్త్రీలు కుటుంబాభ్యుదయానికి గాను ఉద్యోగాలు చేస్తూ ఉంటారు. కొందరు తాము నైపుణ్యము సంపాదించుకొన్న పరిశ్రమలో వృత్తి కల్పించుకోవలెనని పనిచేస్తూ ఉంటారు. స్వయంకృషిచేసి తమ స్థితిగతులను బాగుచేసుకోవలెననే కాంక్ష ఆ స్త్రీల ఉనికిలో మాటలో ప్రతిబింబిస్తూ ఉంటుంది. ★



అగ్గిపుల్లల అమ్మాయి

మంచు కురుస్తోంది. చాల చలిగా వుంది. దాదాపు అంతా చీకటిగావుంది—అది సాయంకాలం... అవును అది ఆయేటి కడపటిసాయంకాలం! ఆ చలి-చీకట్లమధ్య చింపిరి తలతోను జోళ్లులేని పాదాలతోను ఒక పేదపిల్ల, వీధులలో తిరుగుతూంది. ఆమెకు ఇల్లు వదిలేసమయంలో ఒక జత కాలిజోళ్లున్నాయనడం వాస్తవమే, కానీ అవేమంత ఉపయోగపడలేకపోయినయ్. అవి ఛాలా పొడవయిన స్లిప్పర్లు. నిజానికి వాటిని ఇంతవరకూ ఆపిల్ల తల్లి ఉపయోగించేది, వీధిలో రెండుబళ్లు చాల జోరుగా వెళ్తూన్నప్పుడు, ఆ చిన్నిపిల్ల వాటిని తప్పుకొనేందుకు, వీధిదాటే తొందరలో అవి పోయినయ్. ఒకటసలు కనిపించనేలేదు. మరొకటి ఒక అబ్బాయిమీద పడింది. "ఇది... నాకు పిల్లలు కలిగినప్పుడు ఒక ఉయ్యాలకయినా పనికొస్తుంది" అంటూ ఆకుఱ్ఱాడు అది పుచ్చుకు పరుగు పుచ్చుకున్నాడు. కాబట్టి ఇక ఆ అమ్మాయి చలికి ఎఱ్ఱగా, నిలంగామారిన ఆ నట్టికాళ్లతోటే నడిచింది. ఆమె ఒక పాతబట్టలో కొన్ని అగ్గిపుల్లలు తీసుకెడుతోంది. చేతిలో ఒక కట్టపుల్లల్ని ఉంచుకొంది. ఆ రోజంతా ఆమెదగ్గర ఎవ్వరూ ఏమీ కొనుక్కోలేదు. ఎవ్వరూ ఒక కానీ అయినా ఇవ్వలేదు.

అచ్చం దైన్యం మూర్తీభవించిన చిన్న చిత్తరువులాగా ఆపిల్ల చలితో, ఆకలితో వణికిపోతూ, మెల్లిగా నడుస్తోంది! ఆమె మెడచుట్టూ వ్రేలాడుతున్న అవిశనారలాంటి పొడవయిన జుట్టును మంచుపొరలు కప్పివేస్తున్నాయి. కానీ ఇప్పుడామె దాన్ని లక్ష్యపెట్టడంలేదు — ఇళ్ళ కిటికీలన్నిటినుంచీ వెలుగు ప్రసరిస్తోంది. ఉగాది ముందురోజు కావడం వలన బాతు వేపుడు ఇంపుగా వాసన వేస్తోంది!

చివరికి రెండుభవనాలమధ్య ఏర్పడ్డ ఒకమూల కూర్చుందామె. తన చిన్నిపాదాల్ని దగ్గిరిగా లాక్కుంది. అయినా చలి యింకా విపరీతంగానే ఉంది — ఒక్క అగ్గిపుల్లయినా అమ్ముడుపోలే దీవేళ. ఇంటికి తీసుకువెళ్ళడానికి ఒక కానీ అయినా లేదు. కాబట్టి తిరిగి ఇంటికి వెళ్ళడానికి ఆమె కింకా ధైర్యం రాలేదు. ఇంటికివెళ్తే తండ్రి తప్పకుండా కొడతాడు—అదీగాక తమ ఇంటికి ఒక కప్పు మాత్రమే ఉంది. ఆ యింటి పెద్దపెద్ద కంతల్ని గుడ్డపేలికలతోను, గడ్డితోను నింపి ఉన్నా గాలి ఒక ఉశ్శబ్దంతో లోనికి వీస్తూవుంది. అంచేత అక్కడా కావలసినంత చలి ఉండనే ఉంది. ఆమె చిన్నిచేతులు దాదాపు పూర్తిగా మంచుతో కప్పబడిపోయినయ్ ... కట్టనుంచి ఒక పుల్ల తీసి, గోడమీదగీసి, వేళ్ళకు కొంత వేడి కలుగజేస్తే! ఒక్క ఆ అగ్గిపుల్లే ఆమెకు కొంతమేలు చేయగలదు!

చివ్వరికి ఒక్కపుల్ల లాగింది—గోడమీద గీచింది. బలే! అది... ఎంత వెలుగును వెదజల్లింది!... ఎలా వెలిగింది! చిన్న కొవ్వొత్తిలాగా...ఒక వేడిజ్వాల ఇచ్చిందది. ఆ అమ్మాయి దానిమీద తన చేతులుంచడం...నిజంగా అది అద్భుతమయినదృశ్యం! నిజంగా ఆ చిన్నిపాప ఒక పెద్ద ఇనుపకుంపటిముందు కూర్చునివున్నట్లే కనిపించింది. ఆమంట అతితేజోవంతంగా వెలిగింది. చక్కగా వేడినిచ్చింది.

మూలం: **హెచ్. సి. ఆండర్సన్**

అనువాదం: **రాజేంద్ర**

ఆ చిన్న ప్రాణి వేడి చేసుకోడానికి, తన చిన్ని పాదాల్ని బయటికి తీసే సరికి...అదిగో ... ఆ వెలుగు పారిపోయింది! కుంపటి అదృశ్యమయ్యింది. ఆమె చేత సగం మండిన ఆ అగ్గిపుల్ల తప్ప మరేమీ మిగల్లేదు!

ఆమె గోడమీద మరో అగ్గిపుల్ల గీచింది. అది వెలుగు ఇచ్చింది. గోడమీద వెలిగిన చోట... వెలుగు ప్రసరించే ఒక తెర అయిపోయింది!! ఆమె గదిలోకి చూడ గలిగింది! ఒక తెల్లటిబల్ల- తెల్లని 'మేజాగుడ్డ' దానిమీద దివ్యమయిన చైనా పళ్లెములు, పదార్థాలు వున్నాయి. అక్కడ ఏపిలుపళ్లు, ద్రాక్షపళ్లు బాతు వేపుడు ఉన్నాయి. ఇంకా చూడాలనిపించే తమాషా ఏమిటంటే — ఆ వేపుడుపదార్థంలో నుంచి హఠాత్తుగా ఆ బాతు క్రింది కురికింది! రొమ్ములో చిన్న కత్తితోను, ముళ్ళగరిటలతోను నేల మీద పాకి, అది ఆ పేదపిల్లదగ్గరకు గెంతివస్తోంది! తర్వాత...ఆ అగ్గిపుల్ల...వెలిగి పోయింది! ఇక ఆ లావాటి చెమ్మగోడ తప్ప మరేమీ అక్కడ మిగల లేదు.

ఆమె మరో పుల్ల వెలిగించింది. ఇప్పుడామె, ఒక పెద్ద దేదీప్యమానమయిన, క్రిస్మస్ చెట్టు క్రింద, కూర్చుని వుంది. తను ఇంతకు క్రితమొకసారి, ఒక పెద్ద ధనిక వ్యాపారి ఇంటి గాజుతలుపుగుండా చూచిన దానికన్నా, ఇది ఎంతో, ఘనంగా శృంగారింప బడిఉంది. వెయ్యి మైనపు వత్తులు, ఆ పచ్చని కొమ్మలమీద వెలుగు తున్నాయి. ఆ రంగుల చిత్రాల్లో, ఒకటి కప్పు మీదినుంచి తన వేపే చూస్తున్నట్లు కనిపించింది! ఆమె చేతులు చాచింది. క్రిస్మస్ వెలుగులు, ఎత్తుకు యింకాఎత్తుకు, హెచ్చుతున్నాయి - ఇప్పుడవి ఆకాశంలో చుక్కల్లాకనిపిస్తున్నాయి. వాటిలో ఒకటి క్రిందపడి, ఒక వెలుగు రేఖ వదిలింది! "ఇప్పుడెవరో చనిపోతున్నారు" అనుకొందా అమ్మాయి. ఆమె నెప్పుడూ ప్రేమించిన ఒకే ఒక వ్యక్తి...చనిపోయిన బామ్మ... చెప్పింది - 'ఒక చుక్క-క్రింద పడిందంటే, ఒక ప్రాణం పైకెగిరిపోతున్నందుకు అది చిహ్నం" అని.

ఆమె మళ్లీ ఒకపుల్ల గోడమీద రాచింది. అది మళ్ళీ చుట్టూ వెలుగు లిచ్చింది. ఆకాంతిలో స్పష్టంగా దేవతలా ప్రకాశిస్తూ, శాంతంగా చూస్తూన్న బామ్మ నిలుచుని వుండటం కనిపించింది.

"బామ్మా! నన్నూ నీతో తీసుకుపో...ఆ వెచ్చనికుంపటి, ఆ బాతు వేపుడు, ఆ చక్కని పెద్ద క్రిస్మస్ చెట్టులాగా నువ్వూ, మాయమవుతావని నాకు తెలుసు" అంటూ బామ్మను త్వరగా పట్టుకోవాలని, ఆకట్ట నిప్పుపుల్లలన్నీ తొందరగా గోడమీద రాచింది! ఆ పుల్లలు, పున్నమినాటి కన్న యింకా గొప్ప వెలుగు నిచ్చినయ్! బామ్మ అంత పెద్దదిగా, అందంగా...ఎప్పుడూ కనిపించలేదు-ఆమె ఆ చిన్ని పాపను, తన చేతుల్లోకి తీసుకొంది. మనిషి ఎఱుక లేని, చలిగాని ఆకలిగానీ, వర్షము, మంచుగానీ లేని, హాయిగా, ప్రశాంతంగా...ఏడాదంతా పగలుగా వుండే, మహోల్లాసకరమయిన చోటుకు ఇద్దరూ ఎగిరి పోయారు!

ఆ మరునాటి ఉదయం, చలిలో ఎఱ్ఱని బుగ్గలతో, నవ్వు ముఖంతో, ఆ పేదపిల్ల, గోడకు వాలివుంది గడచిన ఏటి, చివరిరాత్రి ఆమె గడ్డకట్టుకు పోయింది. ఉగాది సూర్యుడు, ఆ చనిపోయిన చిన్ని పాప మీద తన కిరణాలు ప్రసరించాడు. ఇప్పటికీ ఆమె అలాగే చేతిలో కాలిపోయిన నిప్పుపుల్లల కట్ట పట్టుకొని, కూర్చుని వుంది!

"తనకు తనే వెచ్చ చేసుకో ప్రయత్నించింది" అన్నారు ప్రజలా 'పాప'ను చూచి. ఉగాది ఉత్సాహంతో, ఆమె తన బామ్మతో! ఏ కాంతిలోకి ప్రవేశించిందో, ఎంత, చక్కటి దృశ్యాల్ని చూచిందో, ఎవ్వరూ కలగన లేదు! ★



జరిగిన కథ:—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకల కది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. ఒక రోజు ఒకచోట కనిపించి, మరొక రోజు కొన్ని వేల మైళ్ళ దూరంలో ప్రత్యక్షమయ్యేది. కొన్ని నౌకలకు దానివలన చిన్నచిన్న ప్రమాదాలు సంభవించాయి. కొందరది ఏదో గొప్ప జలచరమై ఉండాలనీ, కొందరు అది మునిగిపోయిన కొండగుట్ట కావచ్చుననీ, కొందరది పెద్ద జలాంతర్గామి అయిఉంటుందనీ రకరకాలుగా వాదించసాగారు. ఏమైనా దానివలన నాగరిక ప్రపంచానికి, ముఖ్యంగా నౌకా ప్రయాణాలకి ప్రమాదం సంభవించవచ్చునని అందరూ అభిప్రాయపడ్డారు. దాని అంతు కనుక్కొని హతమార్చాలని ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కొన్సిల్‌తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ మహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అబ్రహామ్ లింకన్ అలాగ కొంతదూరం ప్రయాణంచేసేసరికి కొంతదూరంలో సముద్రతరంగాలమీద ఒక పెద్ద వెలుగుకనిపించింది.

5. మహా వేగం

ఆ కేక వినబడేసరికి యుద్ధనౌకలోని నావికులు, అధికారులు, సరంగులు అంతా ఒక్కసారిగా నెడ్ లాండ్ దగ్గరికి పరుగెత్తారు. చివరికి ఇంజనీయరులు కూడా తమ ఇంజినులు విడిచిపెట్టి పరిగెత్తారు.

అనువాదం:
"వినాయక"

వెంటనే యుద్ధనౌక ఆపివేయవలసిందని ఉత్తరువు జారీ అయింది. అయితే ఓడ పూర్వపు వేగాన్నిబట్టి కొంచెం నెమ్మదిగా ముందుకు సాగింది. ఎటు చూసినా కారుచీకటి తప్ప మరేమీ కనిపించడంలేదు. నెడ్ లాండ్ ఎలాంటి కారుచీకటిలోనైనా చాలాదూరంవరకు చూడగలడు. అతనికి కనబడిందేమై ఉంటుందా అని నేననేకవిధాలుగా మథనపడ్డాను. ఆ కంగారులో నా గుండెల్లో తిమింగిలాలు పరిగెత్తాయి.

అబ్రహామ్ లింకన్‌కు చాలా సమీపంలో సముద్రం పైభాగం అంతా వెలుగుల తళతళలతో జాజ్వల్యమానంగా వెలిగిపోతూంది. ఆ అత్యద్భుతమైన జలజంతువు సముద్రంలోపల దాగి ఉండి పైపైకి వెలుగులు ప్రసరింపజేస్తూంది. ఆ వెలుతురునుగురించి అనేకమంది నావికులింతకు

పూర్వమే తమ ఓడ దస్త్రాలలో ఉదాహరించారు. అది చాలా పెద్ద వెలుగు! దాని మధ్యభాగం మరింత ధగద్ధగాయమానంగా వెలిగిపోయింది! తరవాత ఆ వెలుగు క్రమక్రమంగా మందగించింది.

"అది భాస్వర పరమాణువుల తేజఃపుంజమై ఉండవచ్చునని తోస్తుంది."

అన్నాడొక ఆఫీసర్. దానికి గట్టిగా నేనిలాగ సమాధానం చెప్పాను. "అబ్బే! ఆ వెలుగావిధంగా బయలుదేరడానికి వీలు లేదు! అది విద్యుచ్ఛక్తి మూలంగా బయలుదేరిన వెలుతురే అయి ఉండాలి! అదిగో! అలాగ చూడండి! అది మెల్లిమెల్లిగా కదులుతూ మనవైపే వస్తూంది."

దానితో ఓడ నావికులందరు పెద్దగా కేకలు పెట్టారు.

"అరవకండి! చుక్కాని జాగ్రత్తగా కాయండి! ఓడ వెనక్కి తిప్పండి!" అని ఆజ్ఞాపించాడు కెప్టెన్.

ఆవిధంగా మా ఓడ ఆ తిమింగిలాన్ని తప్పించుకుపోవాలని ప్రయత్నించింది గాని ఆ జలజంతువు శరవేగంతో మావైపే వచ్చేస్తూంది.

ఓడలో ఉన్న వారందరికీ పై ప్రాణాలు పైనే ఎగిరిపోయాయి! మేమెంత తొందరగా వెనక్కి వెళ్లిపోతున్నా ఆ జంతువు మా మీదమీదికి వచ్చేస్తూంది! ఆసమయంలో మా ఓడ గంటకు పది పదిహేను మైళ్ల వేగంలో వెళ్ళిపోతూంది. అయినా అది గబగబా మా ఓడ అందుకుని ఒకమారు దానిచుట్టూరా చెక్కరకొట్టింది. దాని జాజ్వల్యమానకాంతి మా నౌకచుట్టూ తళతళా మెరిసింది!

పిమ్మట ఆ వెలుగులు తళతళలు మా ఓడకు రెండు మూడు మైళ్ల దూరంవరకు వెళ్ళిపోయాయి. తరవాత హఠాత్తుగా మళ్లీ ఆ జంతువు అతివేగంగా మా ఓడవైపు వచ్చింది. ఒక ఇరవై అడుగుల దూరంలో ఆగిపోయింది. అంతలో దాని వెలుగంతా ఒక్కసారిగా అదృశ్యమైపోయింది! తరవాత ఆ వెలుగు మళ్ళీ మా ఓడకు మరిఒక పక్కగా ప్రత్యక్షమైంది. బహుశః అది ఓడ అడుగున దూరి తిరిగీ ఇటువైపు తేలిందేమో! ఆ సమయంలో అది ఓడతో ఢీకొనిఉంటే మా నౌక ముక్కముక్కలైపోయేదే!

మా నౌక నడక ధోరణి చూస్తే నాకెంతో ఆశ్చర్యం వేసింది. మా ఓడ ఆ జలజంతువు నెదుర్కోవడానికి బదులుగా అదే మా ఓడ నెదుర్కొంటున్నది! దీనికి కారణ మేమిటని మా కెప్టెన్‌ను ప్రశ్నించాను. సామాన్యంగా అతని ముఖంలో ఎప్పుడు నదురు బెదురు కనబడదు! కాని నే నతన్ని ప్రశ్నించేసరికి అతని ముఖంలో ఆశ్చర్యం తాండవిస్తూంది. అత డిలాగన్నాడు:

"ప్రొఫెసర్ అరోనా! అది చాలా బ్రహ్మాండమైన జంతువై ఉండాలి! దాని సంగతి సందర్భాలు తెలియందే ఈ కారుచీకటిలో దాని నెదుర్కొని పోరాడడం నా కిష్టం లేదు! అందుచేత మనం తెల్లవారే దాకా ఆగాలి! అప్పుడు మనమే ఆ జంతువు నెదుర్కొని పోరాడవచ్చును!"

"అయితే కెప్టెన్! ఆ జంతువు స్వరూపస్వభావాలనుగురించి మీకేమీ అనుమానం లేదన్నమాట!"

"ఏమీ అనుమానం లేదు! అది ఒక పెద్ద బ్రహ్మాండమైన తిమింగిలమై ఉండాలి! పైగా దానికి విద్యుచ్ఛక్తిసహాయంకూడా ఉన్నదనే తోస్తూంది!"

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

"అయితే ఇది ఒక పెద్ద టార్పెడో ఎదుర్కోవడంలాగే బాగా అపాయకరమైన వ్యవహారమన్నమాట!"

"దానికి ఓడలు పగలగొట్టడంలో అత్యద్భుతమైన శక్తి సామర్థ్యాలుండాలని అనుకొంటున్నాను! అదే నిజమయితే ప్రపంచంలో మరి అంతటి భయంకరమైన జలచరం ఇంకొకటి ఏదీ ఉండబోదు! అందుకనే నేను కొంచెం ముందు వెనక లాలోచిస్తున్నాను."

ఓడలోని నావికులందరు రాత్రి తెల్లవార్లు కంటిమీద కునుకు లేకుండా ప్రాణాలరచేతుల్లో పెట్టుకుని కూర్చున్నారు. అసలెవరికీ ఇక నిద్రపోవాలనే ఊహే తట్టలేదు! అబ్రహామ్ లింకన్ ఇక ఆ జలచరంతో సమానంగా వేగంగా పోలేదని తేలిపోయింది. అందుచేత దానివరక మందకొడిగానే ఉండిపోయింది. ఇలాగ కొంతకాలం గడిచిపోయేసరికి ఆ జలచరం అబ్రహామ్ లింకన్ ధోరణి అవలంబించినట్లే కనిపించింది. అదికూడా ఏమీ చెయ్యకుండా అలాగే స్తబ్ధుగా ఉండిపోయింది. దాని ఎప్పటో ఒక్కసారిగా మామీద విరుచుకు పడేటట్లే కనిపించింది!

అర్ధరాత్రి అయ్యేసరికి ఆ జలచరం వెలుతురంతా ఒక్కసారిగా అదృశ్యమైపోయింది! ఇంచుమించుగా ఒంటిగంట అయ్యేసరికి ఆ తిమింగిలగిలం ఒక పెద్ద కూత కూసింది! అది వినేసరికి నరంగుల చెవులన్నీ గళ్లు పడిపోయాయి.

కెప్టెను, నెడ్‌లాండు, నేను, ఓడ వెనకభాగంలో కూర్చుని ఆ చీకటిలో ఎంతో ఆత్రంగా ఆ జలచరం అదృశ్యమైన సాగరభాగం పరిశీలిస్తున్నాము. కెప్టెన్ నెడ్‌లాండ్ నీవిధంగా ప్రశ్నించాడు:

"నెడ్‌లాండ్! నీ వెప్పుడైనా తిమి గాని అంతకంటె పెద్ద జలచరం గాని కూత పెట్టడం విన్నావా?"

"విన్నాను గాని ఇంతటి పెద్ద జలచరం కూతపెట్టడం నే నెప్పుడూ విన లేదు!"

"పోనీ! ఈకూత నీవు విన్న కూత ఒకేమాదిరిగానే ఉన్నాయా?"

"ఒకే మాదిరిగానే ఉన్నాయి గాని ఇది చాలా పెద్ద ధ్వని! ఇది తప్పకుండా తిమింగిలగిలమే అయి ఉండాలి! అయితే తెల్లవారిన తరవాత మీ రనుమతించారంటే దానికీ మనకీ లడాయి ప్రారంభం అయిపోతుంది!"

"ఇంతా చేస్తే అది లడాయీకి తయారవుతుందో! కాదో!" అన్నాను నే నంతగా నమ్మకం కుదరక.

"కొంచెం అందుబాటులోకి వచ్చిందంటే దాని అంతేమిటో కనుక్కుని తీరతాను!" అన్నాడు నెడ్‌లాండ్.

"దాన్ని పట్టుకోవాలంటే జలజంతువులను పట్టుకొనే చిన్ననావ ఒకటి నీ స్వాధీనం చెయ్యాలి! అంతే!" అన్నాడు కెప్టెన్.

"అవునవును! నిజమే!"

"కాని చాలామంది నావికులు చనిపోతారేమోనని నా భయం!"

"నాగతి అంతే!" అన్నాడు నెడ్‌లాండ్ అతిహేళగా.

అటుపిమ్మట రెండు గంటలు కొట్టేసరికి ఆ తళతళ మెరిసే వెలుగు తిరిగి ప్రత్యక్షమైంది! అప్పుడది మా యుద్ధనౌకకు ఇంచుమించుగా అయిదుమైళ్ళదూరంలో కనబడింది! గాలి హోరు మని వీస్తూంది. కెరటాలు అల్లకల్లోలంగా పైకెగిరిపడుతూ పెద్దగా ధ్వని చేస్తున్నాయి. అంతదూరంలో ఉన్నా, ఆ అల్లకల్లోలంలోకూడా ఆ జలజంతువు తోకతో తరంగాలపై కొడుతున్న ధ్వని మాకందరికీ విస్పష్టంగా వినబడుతూనే ఉంది! అది బుసకొడుతున్న చప్పుడు కూడా అలాగే వినబడుతూఉంది! ఆ తిమింగిలగిలం ఊపిరి పీల్చుకోడానికి సముద్రం మీదికి వచ్చేసరికి ఆ జంతువు నాసారంధ్రాలతో ప్రవేశించిన గాలిహోరు గాలివాన హోరులా వినబడింది.

"ఇది కొన్నివేల గుర్రాలశక్తి గల తిమింగిలగిలం!" అనుకున్నాను నేను.

తెల్ల తెల్లవారేదాకా మేమంతా అలాగే ప్రాణాలరచేతుల్లో పెట్టుకుని కూర్చున్నాము. తరవాత పెద్ద జలచరాలను పట్టుకోడానికి వీలయిన ఒక చిన్ననావ అన్ని ఉపకరణాలతోను సిద్ధం చేశారు. కొందరా నావలో తుపాకులు ఫిరంగులు మొదలైనవి కాల్చడానికి కనువుగా అమర్చారు. నెడ్‌లాండ్ తన బల్లెం పదును సరి చూస్తున్నాడు.

అప్పుడే సూర్యోదయంఅయింది. అంతలో ఆ తిమింగిలగిలం వెలుగంతా ఒక్కసారిగా అదృశ్యమైపోయింది. చుట్టూరా దట్టంగా పొగమంచు పట్టడంవల్ల ఎలాంటి పెద్ద

దూరదర్శినీ యంత్రం ఉపయోగించినా ఏమీ పనిజరగలేదు!

నేను ఓడ కొయ్యలపైపై కెక్కి చూచాను. కొంతమంది నావికులక్కడ గుమిగూడి అతిశ్రద్ధగా ఆ జలచరం అదృశ్యమైన సముద్ర భాగం పరిశీలిస్తున్నారు.

ఉదయం 8 గంటలయ్యేసరికి పొగమంచు క్రమక్రమంగా కరిగిపోయింది. మళ్ళీ హఠాత్తుగా నెడ్ లాండ్ ఒక పెద్దకేక పెట్టాడు: "అదుగదుగో! చూడండి! మళ్ళీ అది కనబడుతూంది!"

అందరి కళ్లూ అటువైపు తిరిగాయి. మానౌక కొకమైలు మైలున్నర దూరంలో సముద్ర తరంగాలమీద సుమారొక గజంఎత్తున ఒక నల్లని జలచరం ప్రత్యక్షమైంది. అది తోక చాలా వేగంగా కదిలిస్తూంది. అందువల్ల సముద్ర తరంగా లల్లకల్లోలంగా ఉవ్వెత్తుగా పైపైకి లేస్తున్నాయి. జలజంతువు కదిలిపోయినంత మేర తెల తెల్లని నురగలు తళతళా మెరిశాయి.

క్రమంగా మా యుద్ధనౌక జలజంతువును సమీపించింది. నా కది బాగా స్పష్టంగా కనిపించింది. ఇంతకుపూర్వం షామన్ నౌకలోను, హెలివిటా నౌకలోను ప్రయాణం చేసినవా రాజలజంతువును గురించిన భోగట్టా కొంచెం ఇచ్చారుగాని అది బాగా అతిశయోక్తిపూరితంగా కనిపించింది. దాని పొడవు 150 అడుగులకంటె ఎక్కువ ఉండదని అనుకున్నాను. దాని ఆకారం అంతా ఆ నిడివికి తగినట్టుగానే ఉన్నదని అనిపించింది.

నేనలాగే దానికేసి చూస్తూంటే దాని నాసికా రంధ్రాలలోనుండి రెండు జలధారలు పైకి లేచాయి! అవి ఆకాశంలోకి 50 అడుగులవరకు వెళ్ళిపోయాయి. వాటిలో ఒక జలధారనిండా ఆవిరి ఎంతో దట్టంగా కమ్ముకున్నట్టు కనిపించింది. దానితో ఆ జంతువు ఊపిరి పీల్చుకునే పద్ధతి అంతా నాకు బోధపడిపోయింది. అది చూడగానే ఆ జలచరం తప్పకుండా తిమింగిలగిలాలు జాతికి చెందినదే అయి ఉండాలని అనుకున్నాను. అయితే ఆ విషయంలో నా కంతటి దృఢనిశ్చయం మాత్రం కలగ లేదు! తిమింగిలగిలాల్లో మూడు వర్గా లున్నాయి. వాటిలో అది ఆఖరివర్గానికి చెందినదై ఉండాలని ఊహించాను. అయితే ఆవిషయంలో కూడా కొంత అనుమానం పీడించింది.

నావికులంతా కెప్టెన్ ఉత్తరువులకోసం తహతహలాడుతూ ఎప్పుడు ఫిరంగులు పేలుద్దామా అని ఉవ్విళ్ళూరుతూ నిలబడ్డారు.

"ఏం సరంజాం అంతా సిద్ధంగా ఉందా?" అని ఇంజనీయరు నడిగాడు కెప్టెన్.

"ఓ. అంతా సిద్ధంగా ఉంది!" అన్నాడు ఇంజనీరు.

"అయితే ఓడ జోరుగా పోనిచ్చి ఫిరంగులు కాల్చండి!" అని ఆజ్ఞాపించాడు కెప్టెన్.


ఆ ఉత్తరువు వింటూనే నావికులదేపనిగా హర్షధ్వానాలు చేశారు. యుద్ధ సమయం ఆసన్నమైనది. అలాగ కొన్ని నిమిషాలు గడిచేసరికి అబ్రహామ్‌లింకన్ యుద్ధనౌక నుండి ఫిరంగి గుళ్ళు, పొగ సంతతధారగా సముద్ర తరంగాలలో కనిపించే జలచరంమీదికి ప్రవహించడం మొదలుపెట్టాయి. ఆ ఫిరంగి గుళ్ళవర్షంలోను, ఇంజనుల హోరులోను మా యుద్ధనౌక టూపంతా గజగజా వణికిపోయింది!

—ఇంకా ఉంది.



"దారి తప్పిన బాటసారి"

—ఫోటో: పి. గురుమూర్తి.



కుర్చీ ఆత్మకథ

ఈ ప్రపంచ మెంత చిత్రమైంది. ఇక్కడ అసంభవమైంది ఏదీ లేదు. ఇక్కడెల్లప్పుడూ క్రొత్త సృష్టి జరుగుతూనే ఉంటుంది. మనుష్యుడు చాల తెలివైనవాడు. కంటికి కన్పించిన ప్రతి సామాన్య వస్తువుతోనూ ఉపకరించే వస్తువులనెన్నో తయారు చేస్తాడు. తెలివైన వాడే కాకుండా మానవుడు స్వార్థపరుడు కూడాను. తన సుఖంకోస మతడేం చెయ్యడు? అతని సుఖంకొఱకు ఎన్ని ప్రాణులు దుఃఖాలపాలు కావడంలేదు? అతని సేవ కుపకరించేవారిలో నే నొకర్తను.

నా పేరు కుర్చీ. నే నెవరినో, మనుష్యులకు నే నెట్లు సేవ చేస్తున్నానో ఇప్పుడు మీరు గ్రహించే ఉంటారు. మనుష్యుడు నన్ను తనకు హితంగా ఉపయోగించుకొంటాడు. నా పుట్టు పూర్వోత్తరాలు మీ కిప్పుడు చెప్తాను.

నేను అడవిలో పుట్టాను. మొదట నే నొక వృక్షరూపంలో ఉండేదాన్ని. నే నెలాగో నరుని కంటపడ్డాను. నే నిలాగ ఉండడం అతడు సహించలేక పోయాడు కాబోలు. నన్నతడు నఱికివేశాడు. నా బాధ నతడు గణింపలేదు. నన్ను నఱికి బండ్లలో వేసి పట్నం తెచ్చాడు. తర్వాత వడ్రంగి వచ్చాడు. తన పనిముట్లతో నన్ను తన ఇష్టంవచ్చినట్లు రాసి రంపాన్ని పెట్టాడు. నాకప్పుడు కలిగిన బాధను మీ కెలాగ తెలియజెప్పడం? కాని దాన్ని అతడు లెక్కపెడతాడా? డబ్బు గడించే ఆశ అతణ్ణి ఊరుకోనిస్తుందా? క్రమక్రమంగా నా రూపం మారింది. చివరికీ కుర్చీ రూపం దాల్చాను. నున్నగా, గుండ్రంగా ఉన్న కాళ్లూ, మెరుస్తూ ఉండే ఒళ్లూ!—

ఎ. సీతారామం

నాకు చాలామంది సోదరులు కూడ ఉన్నారు. వారికి వేర్వేరు పేర్లున్నాయి. మాపై కూర్చునే వారెన్ని రకాలవారో!— సామాన్యులున్నారు; ధనవంతులున్నారు; రాజులున్నారు; బీదలున్నారు; మంచివాళ్లున్నారు; చెడ్డవాళ్లున్నారు; మేధావులున్నారు; మూర్ఖులున్నారు—ఇలాంటి వాళ్లు ప్రపంచమంతలో ఎందరోఉన్నారు. రాజుకూర్చునేదాన్ని సింహాసనమంటారు. దాన్ని కుర్చీ అనరు. సింహాసనానికి చాలా గౌరవం కలుగుతుంది. కుర్చీలకువలె వాటిని నిర్లక్ష్యంగా ఉంచరు. వాటిని బాగా అలంకరించి వుంచుతారు. నేను సింహాసనాన్ని కాను. మామూలు కుర్చీని.

ప్రపంచంలో నా అనుభవాన్ని మీ కిప్పుడు కొంచెం వినిపిస్తాను. నా జీవితాన్ని గురించి నే నెన్నో కల్పనలు చేశాను. కాని నా జీవిత మెలా పరిణమించిందో! నేను చాలా అందమైనదాన్ని. నన్ను చూసినవాళ్లంతా ఆకర్షింపబడేవారు. నాచే ఆకర్షింపబడి ఒక ధనవంతుడు నన్ను తనయింటికి తీసికొని వెళ్లాడు. తనయింటికి వచ్చేవారంతా కూర్చునేగదిలో నన్నుంచాడు. ఆ గది చాలా శుభ్రంగా ఉంది. అక్కడకు రోజూ ఎందరో వస్తూ ఉంటారు. నన్ను చూసి సంతోషం వెలిబుచ్చుతారు. 'ఇది మీ కెక్కడ లభించింది' అని ఆ శ్రీమంతుణ్ణి ప్రశ్నిస్తూ ఉంటారు ఇదంతా విని నేను సంతోషంతో పరవశమయ్యేదాన్ని. నాకు నేనే గర్వపడుతూ ఉండేదాన్ని. కాని నేను చాలా అమాయికురాల్ని. నా భవిష్యత్తునుగూర్చి నా కేమీ తెలియదు. ఈ ప్రపంచ మింత చెడ్డ దని నాకు తెలియదు. మనుష్య

బాలగేయం:

యుక్తిశాలి

ఆర్. దొరసామి

అంధుడైన వైశ్యుడొకడు
అతి దరిద్రుడైనకతన
ఎండడిగిన పాప మతని
కీయరైరి పిల్లదాని!

గడపె నతడు బ్రహ్మచారి
గా తొంబదియేండ్లవఱకు
కడకు నడువజాలనట్టి
కష్టస్థితికూడ వచ్చె!

ఒక్కనాడు ధ్రువచరిత్ర
మొక్కభాగవతుడు సెప్ప
మొక్కువైన శ్రద్ధవినియె
నిట్లు తలచె నావైశ్యుడు.

"పంచవర్షముల ధ్రువుండు
పట్టుపట్టి తపమొనర్చి
అంచితముగ పొందగలిగె
నట్టి యుత్తమపదంబును!

ఇట్టు తలచి చక్రిగూర్చి
యెన్నరాని తపముసేయ
తుట్టతుదకు వానిముందు
తోచెను పరమేశ్వరుండు.

తనమనమున దేవు డిట్లు
తలచె, వీనితీరుచూడ
కనులులేవు ధనములేదు
కాంత మొదలె లేదుగదా!

కోరు నితడు ఒక్కమారె
కోర్కెలెల్ల యని తలంచి
కోరుమోయి ఒక్కవరము
కోమటీ! యనియె దేవుడు!

దేవునకు పాతమెఱిగి
ధీనిశాలుడైన సెట్టి
దేవదేవ! చిత్తమల్లె
తెలుపుకొందు వినుప్రభూ!

సకలధరణి చక్రమేలు
సార్వభౌముడైన కొడుకు
నొకని నాకు చూచుభాగ్య
మొసగుమయ్యా! దయానిధీ!

వానియుక్తి నెఱిగి మెచ్చి
వారిజాక్షు డట్లె యొసగె
కాన యుక్తిశాలి కెందు
కలుగు జయము నిశ్చయముగ!

★ కుర్చీ ఆత్మకథ ★

ఉంత కృతఘ్నుడనీ నాకు తెలియదు. తనకు సేవచేసే శక్తి మనలో ఉన్నంతకాలం అతడు మనల్ని జాగ్రత్తగా ఉంచుతాడని క్రమక్రమంగా నాకు తెలియవచ్చింది. మనం పనికిరానివాళ్ళం కాగానే మానవుడు మనల్ని లక్ష్యం చెయ్యడు. లక్ష్యం చెయ్యకపోవడమే కాదు, మోసం కూడా చేస్తాడు. ఆ పాపులు ఇంకా ఏమేమి చేస్తారు అన్న ప్రశ్నకు సమాధానం నా జీవితగాథలో లభిస్తుంది. సావధానంగా వినండి.

నేను ధనవంతుని యింటికి వచ్చాక కొన్నాళ్ళల్లే గడచాయి. క్రమంగా నన్నుగూర్చిన ప్రశంస తగ్గుతూ వచ్చింది. కొన్నాళ్ళకు వాళ్లు విసిగి నా ప్రశంస ముగించారు. ఇప్పటివఱకు నన్ను నేను మఱచాను. క్రమంగా దుఃఖం రుచి చూడ నారంభించాను. ఆ శ్రీమంతున కొక కొడుకున్నాడు. వాడు చాలా ధూర్తుడు. వాడు నాపై నిర్లక్ష్యంగా కూర్చునేవాడు. ఇటూ అటూ యీడ్చేసేవాడు. నన్నిలాగ బాధించేవాడు. పాఠాలు చదువుకోవాలంటే వచ్చి నామీద కూర్చునేవాడు. వాడు చదివే దేముంది? చదువు పేరుకే. నాపై కూర్చుని తఱచు సిగరెట్టు వెలిగించి పొగ వదుల్తూ, చదువుచున్నట్లు నటించేవాడు. వాడెలాటి విద్యార్థియై ఉంటాడో మీరు దీన్ని బట్టి తెలుసుకోగలరు.

వాడు పెద్దవాడయ్యాడు. అయినా, వాడి స్వభావం మారలేదు. ఇంకా పాడయింది. వాడు త్రాగుబోతయ్యాడు. ఒకనాడు వాడుతప్ప త్రాగి నాపై నిర్లక్ష్యంగా పడ్డాడు. దురదృష్టవశాత్తూ నాదో కాలు విరిగిపోయింది. నాకు చాలా బాధ కలిగింది. ఈ జీవితంలో నేనింకా ఎన్ని కష్టాలు పడాలో! విరిగిన కాలు బాగు చేయిస్తారు, బాగుపడతా ననుకొన్నాను. ఎన్నోఏండ్లతని సేవ చేశాను. నన్నిలా విడిచిపెట్టరనుకొన్నాను. కాని యింకో విధంగా జరిగింది. నా యజమాని నాయీ స్థితి చూచి నౌకరును పిలిచి 'దీన్నింకో చోటి కెక్కడైనా తీసికొని వెళ్లిఉంచు. ఇప్పుడిది పనికి రాదు' అన్నాడు. నాకు పర్వతం విరిగి మీద పడ్డట్టు అయింది.

నౌకరు నన్నక్కడినుండి తీసి

కొని పోయి వెనుకనున్న ఒకగదిలో పారవేశాడు. నా జీవిత శేషం అక్కడ గడపవలెనని నాకు తెలిసి కంపించా. నాకు నా పూర్వపు దినాలు జ్ఞప్తికి రాసాగాయి. నా కిట్టి అగౌరవం కలుగుతుందని నే నెన్నడూ తలంచలేదు. ఆ గదిలోనే నేను కొన్ని దినాలు గడిపాను.

రోజులన్నీ ఒక్కలా ఉండవు. కాలం మారనారంభించింది. ప్రపంచంలో ఘోర సంగ్రామం జరుగుచున్నట్లు వినవచ్చింది. ప్రపంచంలో హాహాకారాలు మిన్నుముట్టాయి. అన్నం లేక ఎందరో ప్రజలు చచ్చిపోతున్నారు. తినుబండారాలు దొరికినా యింటికి కలప కఱవయింది. సర్కారు కలపంతా సైనికులకోసం తీసికొనిపోసాగారు. బీదలకే కాదు, ధనవంతులకు కూడా కలప దొరకడం లేదు. అంచేత విరిగిపడివున్న కఱ్ఱలన్నీ ఏరి వంట వండుకొనేవారు. ఈ సంగతి వింటే నాకు కూడా అట్టి దశ పడుతుందేమోనని భయపడేదాన్ని. ఉండుండి నన్నీ ఆలోచన బాధించేది. నాకు భయం కలిగినప్పుడల్లా నాకు నేనే నచ్చ చెప్పుకునేదాన్ని. 'నీకట్టి గతి పట్టదు. నీవు వారి కెన్నో సేవలు చేశావు. ఇవన్నీ మఱచి ఒక్కపూట తమ పొట్టల్ని నింపుకోడంకోసం నీకట్టి మోసం చేస్తారా? ఎన్నటికీ చెయ్యరు' అని నాకు నేనే ధైర్యం చెప్పుకునేదాన్ని. కాని కాదలచింది కాకమాన్తుందా? నుదుట వ్రాసినదాన్ని ఎవరు తుడిచివెయ్యగలరు? ఒక రోజున ఎవరో నా గదిలోనికి రావడం చూశాను. గదంతా చీకటితో నిండిఉండడంవల్ల ఆ వస్తున్న దెవరో నాకు తెలియలేదు. ఎవరినో వెదకుతున్నట్లు అతడు గదిలో అటూ యిటూ చూశాడు. అతడు తనతో లాంతరు కూడా తెచ్చాడు. దాన్ని వెలిగించి మెల్లిగా ముందుకు సాగాడు. దగ్గఱకు వచ్చిన పిమ్మట, అతడు నన్ను గదిలోనికి విసరివైచిన నౌకరే అని గుర్తించాను. అతణ్ణి చూడగానే నా ధైర్యం తొలగిపోసాగింది. మృత్యువు వచ్చి నాయెదుట నిల్చినట్లయింది. నన్ను బాగు చేయించడానికి వచ్చాడు కాబోలు అని మళ్లీ అనుకున్నాను. కాని సంగతి అది కాదు. నేను ఏమీ చెయ్యలేకపోయాను. ఏమనైనా రాలేను. ఆఖరికి కదలనైనా కదలలేకపోయాను. అతడు వింటేగా, ఏమైనా చెప్పుకోడానికి? అతనికి నా అవసరం ఉంది. నన్ను చూచి అతని కళ్లు మెరవసాగాయి. అతని కేదో నిధి లభించినంత సంతోషం కలిగింది. అతడు వడివడిగా నడిచి నాదగ్గఱకు వచ్చి నన్ను తీసికొని పోసాగాడు. నే నెందుకొఱకు సిద్ధపడలేదో, ఆఖరికి అదే జరిగింది. అతడు నన్ను పొయ్యిదగ్గఱకు కొంపోయాడు. నా ఒక్కొక్క కాలే విఱిచి పొయ్యిలో వెయ్య నారంభించాడు. నే బాధపడితే అతని కేమైనా విచారమా? వంట చేసికోవడమే అతనికి కావలసింది.

ఓ! పరమాత్మా! మనుష్యు డెంతటి కృతఘ్నుడు! అతడు నాచేత ఎన్నెన్ని సేవలు చేయించుకున్నాడు! ఎన్నెన్నివిధాల నన్ను పొగడాడు! ఆహా! దీని కిదా ఫలితం! యావజ్జీవితం చేసిన సేవకు మృత్యువా పారితోషికం! 'ఓ సోదర సోదరీమణులారా! పొరపాటునైనా మానవుణ్ణి నమ్మకండి' అని నా అనుభవం వల్ల చెప్తున్నాను. అతడు స్వార్థపరుడు, కపటి, నీచుడు. ఈ అన్యాయాన్ని భగవంతుడే సహించాలి. నమస్కారం. సెలవు—

అనువాదం—హిందీ నుండి. ★

అత్తగారు

బొడ్డుపల్లి హనుమాయమ్మ

పూర్వం హస్తినాపురమనే నగరంలో శివదత్తుడనే బ్రాహ్మణుడుండేవాడు. అతడు మంచి భాగ్యవంతుడు. అతనికి ఒక్కడే ఒక్క కుమారుడు. అతని పేరు వసుదత్తుడు.

వసుదత్తుడు చిన్నతనంలోనే వేదాలు, శాస్త్రాలు అభ్యసించి మంచిపేరు తెచ్చుకున్నాడు. అతనికి యుక్త వయస్సు వచ్చింది. శివదత్తుడు బాగా విచారించి, ఒక కలవారియింటి అమ్మాయిని కొడుక్కి వివాహం చేసుకొన్నాడు. ఆ అమ్మాయి కాపురానికి వచ్చింది.

శివదత్తుడి భార్య వట్టిగయ్యాళి గంప. పరమ మూర్ఖురాలు. మహా తామసం. కొడుకు కోడలు చక్కగా చిలుక గోరువంకల్లాగా ఆడుకుంటూ, పాడుకొంటూ ఉంటూంటే ఆమె సహించలేకపోయింది. రోజూ కోడలితో యుద్ధమే. ఇదంతా చూడలేక శివదత్తుడు చెప్పకుండా దేశాల పాలైపోయాడు. వసుదత్తుడు, భార్యతో కలిసి తల్లి కోపం చల్లార్చటాని కన్నివిధాల ప్రయత్నించాడు. ఆ ప్రయత్నాలన్నీ బూడిదలో పోసిన పన్నీరైనాయి. అత్తగారి యీ పోరుపడలేక వసుదత్తుడు భార్య మాయమైపోయింది. ఆ విచారంతో వసుదత్తుడు కూడ ఇల్లు వదలి పోవటాని కుద్యమించాడు. అప్పుడిరుగు పొరుగువాళ్లు జాలి దలచి, మరో పిల్లను తెచ్చి అతనికిచ్చి పెండ్లిచేసి, మరోసారి ఒకయింటివాణ్ణి చేశారు.

ఇప్పటికైనా అత్తగారికి మనసు మారలేదు. ఆమె తన స్వభావసిద్ధమైన దౌష్ట్యంతోనే ఈకోడల్ని హింసించటం మొదలుపెట్టింది. పాపమా రెండోకోడలు ఈ హింసాకాండ భరించలేక ఒకనాడు రహస్యంగా ఉరితీసికొని చచ్చింది. వసుదత్తుడెంతో దుఃఖించాడు. ఇల్లు వాకిలి వదలిపోదామనే విరక్తిభావం కలిగిందాతనికి. ఈ మారు కూడా ఇరుగు పొరుగువాళ్లు అడ్డుపడ్డారు. తండ్రి, కొడుకు లిద్దఱు ఇల్లు వీడిపోతే ఎలాగన్నారు. మళ్లీ పెళ్లి చేయాలని ప్రయత్నించారు. కాని వసుదత్తుడు మాత్రం అంగీకరించలేదీమారు.

తనగతి ఏమిటా ! అని వసుదత్తుడెంతో విచారించాడు. అంతలో ఒక అద్భుతమైన ఆలోచన తట్టిందతనికి. సమర్థుడైన ఒక శిల్పిచేత దారువుతో ఒక రమణీయమైన స్త్రీ బొమ్మ చెక్కించాడు. తాను రహస్యంగా పెండ్లి చేసికొన్నట్లు ఆ అమ్మాయికి చాలా బిడియమని, అందువల్ల ఎప్పుడు గదివదలి పెట్టి రాదని బాగా ప్రచారం చేశాడు. చేయించాడు. చెక్క బొమ్మను ఒక గదిలో పెట్టి తాళం వేశాడు. అక్కడ ఒక దాసీ దాన్ని కాపలాపెట్టాడు. వసుదత్తుడు కడకు తనతల్లిని కూడా గదిలోకి పోనీలేదు. "అమ్మా ! ఇక నీ కొత్త కోడలితో ఏ మాత్రం సంబంధం లేకుండా ఉండాలి. దానికి ఇంటిపనులేమీ చేయటం చేతకాదు. నీవు దానిగదిలోకి వెళ్లక్కర్లేదు. దాన్ని చూడక్కర్లేదు." అని మొగమోటం లేకుండా చెప్పాడు వసుదత్తుడు తల్లికి. తల్లి ఈమాటలు నమ్మింది. కొత్తకోడలు జోలి లేకుండా ఆమెను చూడకుండా చాలారోజులు గడిచాయి.

ఇట్లా ఉంటుండగా, ఒకనాడు దొడ్లోనుండి పెద్దకేక వినిపించింది. వసుదత్తుడి తల్లి జాతితో తల మోదుకుంది. రక్తం జలజల కారుతున్నది. వసుదత్తుడు, చుట్టుప్రక్కల అమ్మలక్కలు, అయ్యలు ప్రోగైనారు. వారంతా కారణం విచారించారు. తన కొత్తకోడలు, నిష్కారణంగా తన్ను జాతితో మోదిందని చెప్పిందత్తగారు. అందఱు ఆశ్చర్యపోయారు. 'బలేభార్యను సంపాదించావయ్యా !' అని అందఱు వసుదత్తుడ్ని నిందించారు. అందఱు ఆమెను చీవాట్లు పెట్టాలని గదిలోకి దూకుడుగా పోయారు. అక్కడ అందమైన దేవదారు బొమ్మమాత్రం ఉంది. అందఱు ఆశ్చర్యపడ్డారు. అత్తగారి గయ్యాళితనానికి ముక్కున వేలువేసుకొన్నారు. వసుదత్తుడు ఇక తనకింట్లో సుఖం లేదని ఇల్లు వదలిపోయాడు. ఈమారు అడ్డగించినవాళ్లేలేరు.

(కథాసరిత్సాగరం నుండి)

అరుణ వలయం

(8-వ పేజీ తరువాయి)

"జాక్! నువ్వు తెలివైనవాడివని నాకు నమ్మకం ఉంది. కనుక నేను చెప్పేది విని కోపం తెచ్చుకోకు. నీ విలాసాలకు, వినోదాలకు నేనెన్నడూ అడ్డురాలేదు. కాని ఇప్పుడు నువ్వు చేస్తున్నది మంచిపనే నంటావా?"

జాక్‌కు అర్థమైంది.

"మిస్ డ్రమండ్ నుగురించేనా మీర నేది?"

అవునన్నట్లు వృద్ధుడు తల పంకించాడు.

"ఆమె ఫ్రాయంట్ దగ్గిర కార్యదర్శి పని చేస్తోంది," అని జాక్ మొదలుపెట్టాడు.

"ఆ సంగతి నాకు తెలుసు. అందుకు కాదు నేన నేది. ఆమె పుట్టుపూర్వోత్తరాలు నీకేం తెలుసని నే నడుగుతున్నాను."

జాక్ ముఖం ఎర్రబడింది. "ఆమె అంటే నాకిష్టం. ఆమె నాకు స్నేహితురాలు. మీ ఉద్దేశం నే నామెకు నా ప్రేమ వ్యక్తంచేశానని. అవునా. చెయ్యలేదు. చేస్తే మా స్నేహం చెడిపోవచ్చు కూడాను."

తండ్రి తల పంకించాడు. చెప్పవలసిందంతా చెప్పినట్లు, ఇంకేమీ లేనట్లు, మరొక పెద్దకవరు తీసి పరిశీలనగా చూశాడు. దాని మీద ఫ్రెంచి పోస్టేజి బిళ్లలు ఉన్నాయి. అది పంపిం దెవరా అని జాక్ ఆలోచించాడు.

కవరు చింపి, అందులోంచి మరొక సీలు వేసిన కవరు తీశాడు. దానిమీది అక్షరాలు చదివి "హు" అనుకుని చింపకుండానే ఆ కవరక్కడ పడేశాడు. మిగతా ఉత్తరాలన్ని చూసేసి మళ్ళీ కుమారుణ్ణి ఒకసారి పరికించాడు.

"స్త్రీనిగాని, పురుషుణ్ణిగాని వాళ్లలోని చెడు అంతా తెలిసేవరకూ నమ్మబోకు. ఇవ్వాళ నాకోసం ఒక పెద్దమనిషి వస్తున్నాడు. అతని గత చరిత్ర పాపాలపుట్ట. అయినా అతనితో నేను వ్యాపారం చేయబోతున్నాను - అతని కల్మషమంతా నాకు తెలుసు..."

జాక్ నవ్వాడు. ఇంతలో వారి అతిథి ప్రవేశించాడు. అతడు డిటెక్టివ్ యేల్.

"రండి, రండి. బాగా నిద్రపట్టిందా? జాక్! మరికొంచెం కాఫీ తెమ్మను," అన్నాడు జేమ్స్ బియర్డ్ మోర్.

డెరిక్ యేల్ తమ ఇంట్లో అతిథిగా ఉండడం జాక్ బియర్డ్ మోర్‌కు చాలా సంతోషంగా ఉంది. ఇంకా కుర్రతనం. అద్భుతవిషయాలమీద ఆసక్తి జాస్తి. ఎంత చచ్చురకంవాడైనా డిటెక్టివ్ డిటెక్టివే. అందులో డెరిక్ యేల్ సామాన్యుడు కాడు. మానవాతీతమైన అసాధారణ ప్రజ్ఞ గలవాడు. తీర్చిదిద్దినట్లున్న ముఖం, కళ్ళల్లోంచి తొంగి తొంగి చూస్తూ దాక్కునే ఏదో గంభీర రహస్యభావం, పొడుగైన హస్తాలను కదిలిస్తూ అతడు మాట్లాడే పద్ధతి ఇవన్నీ అతని అసాధారణత్వానికి దోహదాలయ్యాయి.

చేతిలోని చిన్న తువ్వాలు విప్పుతూ, తువ్వాలు చివరఉన్న వెండి రింగును ఒక్క క్షణం పరిశీలించాడు. జేమ్స్ బియర్డ్ మోర్ కొంచెం హేళనగా చిరునవ్వు నవ్వాడు. జాక్ మాత్రం కళ్లు పెద్దవిచేసుకుని చూస్తున్నాడు.

"ఏమిటి సంగతి?" వృద్ధుడు అడిగాడు.

"ఈ రింగును నాకు ముందు పట్టుకున్న వ్యక్తికి ఏదో చెడ్డవార్త వచ్చింది. ఆ వ్యక్తి దగ్గిరబంధు వెవరికో చాలా జబ్బుగా ఉంది," అన్నాడు డిటెక్టివ్.

బియర్డ్ మోర్ అవునని తల పంకించి "మా ఇంట్లో పనిచేసే జేన్‌హిగిన్స్ ఇవాళ వడ్డించింది. ఆమె తల్లి చావు బతుకులమధ్య ఉందని ఈ ఉదయమే ఉత్తరం వచ్చింది."

జాక్ ఆశ్చర్యపడ్డాడు.

"మీకు ఇదంతా ఆ తువ్వాలచివర రింగు చూస్తే తెలిసిపోయిందా? ఎలా తెలిసింది మిస్టర్ యేల్?"

డెరిక్ యేల్ తల అడ్డంగా తిప్పాడు.

"నేను వస్తువులనుచూసి అనేకవిషయాలు కనిపెట్టగలను. ఎలా కనిపెడతానో చెప్పలేను. ఈ తువ్వాల ముట్టుకోగానే ఏదో గాఢదుఃఖం నాకు స్ఫురించింది."

"కాని మా దాసి తల్లినిగూర్చి మీకెలా తెలిసింది?

"ఎలాగో తెలిసింది. దానికంతా ఒకరకమైన తర్కం ఉందిలే. ఏమిటి విశేషాలు?" అని యేల్ బియర్డ్ మోర్‌ను అడిగాడు.

జేమ్స్ బియర్డ్ మోర్ అరుణ వలయం కార్డు అందించాడు.

యేల్ అది చదివాడు. తరవాత దాన్ని అరచేతిలో పెట్టి, తూచుతున్నట్టు ఊగించాడు.

"దీన్ని ఒక వానిపుడు పోస్టుచేశాడు. అతడు కొంతకాలం జైలుశిక్ష అనుభవించాడు. అతడు ఈ మధ్యనే చాలా డబ్బు నష్టపోయాడు."

వృద్ధుడు నవ్వాడు.

"వాడు నష్టపోతే నాకేం, నష్టపోకపోతే నాకేం? నేనుమాత్రం అనవసరం ఖర్చుచెయ్యదలుచుకోలేదు. ఈ బెదరింపుల్లో మీకు నమ్మకంవుందా?"

"ఆహా. అంతేకాదు. నేను తోడు లేకుండా మీరీ యిల్లు కదలరాదని నా సలహా," అని, ఏదో చెప్పబోతున్న బియర్డ్ మోర్ మాటకు అడ్డం వస్తూ "ఈ అరుణ వలయం ఏదో కథల్లో మాదిరిగా ప్రవర్తిస్తోందని నాకూ తెలుసు. కాని మీరు కథలో మాదిరిగా చనిపోయారని అనుకోవడం మీ వారసుల కేమంత సంతృప్తి గనక? నా మాట విని మీ జాగ్రత్తమీద మీరు ఉండండి," అన్నాడు డెరిక్ యేల్.

జేమ్స్ బియర్డ్ మోర్ ఒక క్షణం మౌనంగా ఉన్నాడు. జాక్ తండ్రిని ఆందోళనగా చూస్తూ "మీరు కొంతకాలం విదేశాలకు పోయి విశ్రాంతితీసుకోరాదూ?" అన్నాడు.

"ఛా, నేనా? ఈ వెధవరౌడీలకి భయపడి పారిపోతానా? వాళ్లని—"

ఎక్కడికి పంపించదలుచుకున్నాడో అతడు చెప్పకుండానే, జాక్, యేల్ గ్రహించారు. (ఇంకా ఉంది)

★ వెధవ గొడవ ★

(25 వ పేజీ తరువాయి)

చూసుకోండి" అని పాలమ్మి దబాయింపు.

శ్యా: "మన మొహంమీకే కుళాయి దగ్గర చెంబులునింపి ఎల్లా దబాయిస్తోందో చూడండి."

"వాళ్లంతా అంతే యీ రోజుల్లో. వాళ్ల దబాయింపులకి మహా మహా ప్లీడర్లే చాలరు, మనమెంత చెప్పు" అంటూ దువ్వటం పూర్తిచేసి అద్దంలో మొహం ఓసారి తనివితీరా చూసుకుని బట్టలపెట్టె తీసేడు ఆనందరావు.

ఆ: "అరె, ఒక్క పంట్లామూ లేదే. చాకలి బట్టలుతీసుకెళ్లి యెన్నాళ్లైంది శ్యామలా?"

"ఇరవైరోజులు దాటింది. అప్పుడే నాలుగుసార్లు కబురు చేసేం. ఇదుగో తెస్తున్నాం అదిగో తెస్తున్నాం అన్నమాటే కాని తేందే?" అంటూ బాబిగాడి పని పట్టడానికి షెడ్లోకి వెళ్లింది శ్యామల.

"ఇప్పుడు ఇంటర్వ్యూకి వెళ్లటం ఎలా వెధవగొడవాని. నిన్ననే తెస్తానన్నాడు కదా అని లాండరీకి వేసుకోలేదు" అంటూ పెళ్లినాటి ట్వీడు పంట్లాము తీసేడు ఆనందరావు. కోటు ఆ ముందురోజే తీసేడు. చొక్కా కాస్త మాసింది. కోటుందిగా మరేం ఫరవాలేదు అనుకున్నాడు. రోహిణికార్తి. పూరికే చెమటలు కారిపోతున్నాయి. ఫాను రిపేరుకి వెళ్లింది. పెరట్లో బాబిగాడు ఏడుపు లంకించుకున్నాడు. పద్మ 'మేరే దిలియే పుకారేకే ఆజా' అంటూ ఆనందరావు బూడ్సు తుడవటం మొదలెట్టింది. ఆనందరావు డ్రెస్సు వేసుకుని యివతలికి వూడిపడేసరికి మంగలివీరడు చేతులు నలుపుకుంటూ నవ్వుతో, కిటికీదగ్గర ప్రత్యక్షమయ్యాడు 'మొన్నటి సవరం డబ్బులు బాబూ' అంటూ.

"ఉండర్రా బాబూ, ముందు నా పని తువరమయ్యేటట్లు వుంది. ఇప్పుడు చిల్లర లేదు మళ్లీరా" అంటూండగానే పూర్ణయ్యగారు రావటం కుర్చీలో కూర్చోటం జరిగింది.

పూ: ఇదిగో చూడు ఆనందం! శుభలేఖ బల్లమీద పెట్టాను. రేపు రాత్రి సరీగ్గా వంటిగంటా తొమ్మిది నిమిషాలకి తప్పకుండా రావాలేం, శ్యామల పిల్లలూ అంతా రావాలి సుమా మర్చిపోయేవుగనక"

"ఓ తప్పకుండాను. అంతకన్నానా" అంటూ 'ఇక సెలవిప్పించండి' అన్నట్లు నమస్కారం పెట్టేడు ఆనందరావు.

"పిల్లలూ నువ్వూ అంతా రావాలి. మళ్లీ మళ్లీ పిలవలేదనుకోకు" అంటూ కుర్చీలోంచి లేచి,

"శ్యామలమ్మా మీ ఆయనతో చెప్పేను తప్పకుండారా" అని మెట్లు దిగుతూ "ఏమోయ్ ఆనందం అమ్మాయిని పిల్లల్ని తీసుకురా సరీగ్గా రాత్రి వంటిగంటా తొమ్మిది నిమిషాలకి" అని హెచ్చరిస్తూ వెళ్లిపోయారు పూర్ణయ్యగారు. ఆనందరావు అల్లాగే అన్నట్లు బుర్రవూపి ఓసారి చేతి వాచి చూసుకొని వీధి అటూ ఇటూ పరకాయించి చూసేడు. ఒక్క రిక్షాకూడా కనిపించలేదు.

"ఒసే పద్మా రిక్షావాణ్ణి కేకవేయవే" అన్నాడు.

"పద్మని ఇప్పుడే కాంతంగారి యింటికి పంపించాను కుంకుడుకాయలకోసం" అంది శ్యామల కుంకుడుకాయలు కొట్టే రాయి కోసం వెతుకుతూ.

ఇంతలో ఓ రిక్షా తను యింటికేసే వస్తూంటే చూసి 'అమ్మయ్యా' అన్నాడు ఆనందరావు.

"అరే అందులో మనుష్యులున్నారే?"

రిక్షా ఆనందరావు యింటిదగ్గర ఆగింది. పద్మ కుంకుడుకాయలు తెస్తూ రిక్షాని చూసి,

"అమ్మా శంకరంమామయ్య వాళ్లొచ్చేరే" అని కేకవేస్తూ ఇంట్లోకి పరుగెత్తింది.

ఆనందరావు నీరసంగా చిరునవ్వు నవ్వి తెచ్చిపెట్టుకున్న ఉత్సాహంతో "ఏంవోయ్ ఎప్పుడు వచ్చేవ్" అని పలకరించేడు బావమరదిని.

"ఇదిగో వస్తున్నాము గానీ యిదే రాక" అంటూ సామాన్లు లోపల పెడుతున్నాడు శంకరం.

'ఆనందం మామయ్యా' అంటూ శంకరం రెండోవాడు ఆనందరావు కాళ్లు పట్టుకుని వేళ్లాటం మొదలెట్టేడు. ట్వీడ్ పాంటు నలిగిపోతున్నందుకు మనస్సులో యమయాతన పడుతూ పైకి నవ్వుమొహం పెట్టి, జలగలా పట్టుకున్న వాణ్ణి ఓసారి యెత్తుకుని దింపేసి "ఏయ్ రిక్షా వుండు వస్తున్నా" అని చిల్లర కోసం పర్సులో కుస్తీ పడుతున్న శంకరంతో "ఇంటర్వ్యూకి వెళ్తున్నా నీ చెల్లెలు లోపలవుంది." అని శంకరం అడగబోయే కుశలప్రశ్నల్ని ఆపుజేసి, రిక్షాయెక్కేడు ఆనందరావు. రిక్షా రెండుబారలు నడిచిందో లేదో "నాన్నా పెన్నుమర్చిపోయావు" అంటూ పద్మవచ్చి పెన్నుయిచ్చింది. ఆనందరావు ఆలస్యమైందేమో అని టైము చూసుకునే సరికి వాచీ ఆగిపోయివుంది. "పద్మా ప్లీడరుగారింటికి వెళ్ళి టైము చూసిరావే" అన్నాడు. పద్మ పరుగులో వెళ్ళి వచ్చి "నాన్నా వాళ్ళ గోడగడియారం ఆగిపోయిందట" అంది...వీధి మలుపు తిరక్కుండానే రిక్షా బ్రహ్మాండమైన శబ్దముతో ఆగిపోయింది.

"టైరుపోయింది సార్" అన్నాడు రిక్షావాడు.

"అయితే ఈడ్యూటీనుంచి రిటైరు అవు" అంటూ కైరైన మొహంతో ఆనందరావు బస్సుస్టాండుకేసి నడక సాగించేడు. అరఫర్లాంగు వెళ్ళేసరికి బస్సు వచ్చేసింది. ఆపమంటూ పరుగెత్తుకుంటూ వెళ్ళేడు. "ఖాలీ లేదు సార్, పోబా రైట్" అన్నాడు కండక్టరు.

ట్వీడ్ సూటులో ఉడికిపోతున్నాడు ఆనందరావు. టైము పూరికే ఖర్చు అయిపోతోంది దానకర్ణుడి చేతిలోని ధనంలా. ఇంటర్వ్యూ టైము అయిపోతోందో ఏమిటో? ఆనందరావుకి లోపల తేళ్లూ జెర్రులూ పాకినట్లుంది. ఎంతకీ బస్సు రాదు. "అమ్మయ్య బస్సు వచ్చింది." అని బస్సు ఎక్కుతూవుంటే "నాన్నా" అంటూ పద్మ కేక వేసుకుంటూ వస్తోంది. "వెధవగొడవాని" అంటూ ఆగిపోయాడు ఆనందరావు.

"ఏమే ఏం కొంప మునిగింది?"

"మామయ్యవాళ్ళొచ్చారు కదూ నాన్నా! అమ్మ బియ్యం అవీ తేయాలని చెప్పమంది" అంది పద్మ వగర్చుకుంటూ.

"అరి భగవంతుడా" అని జేబులు తడుముకున్నాడు. చిల్లర డబ్బులు మాత్రం తగిలాయి. బస్సువచ్చేస్తోంది. ఫ్రెండు పరమయ్య జ్ఞాపకం వచ్చాడు.

"పద్దీ పరమయ్య మామయ్య దగ్గరకు వెళ్ళి నేను ఇమ్మన్నానని చెప్పి పది రూపాయలు తీసుకో" అంటూ బస్సు ఎక్కేడు.

ఇంటర్వ్యూ హాలులోకి వెళ్ళేసరికి తన పేరే పిలుస్తున్నారు. నుదుటినుంచీ, చెంపలనుంచీ కారే చెమటని జేబురుమాలుతో తుడుచుకొని, టైసర్దుకొని, క్రాపు వేళ్ళతో సరిజేసుకుని, ఉత్కంఠతో కొట్టుకునే గుండెలతో, తెచ్చిపెట్టుకున్న ధీమాను సూచించే బలవంతపు చిరునవ్వుతో ఇంటర్వ్యూ రూములోపల అడుగుబెట్టాడు ఆనందరావు. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.



"[illegible]..."

—[illegible]